www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఒక్క రోజే 4 పతకాలు

11

పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ జోరు

షూటర్ అవని లేఖారాకు స్వర్ణం

మనీష్‌కు రజతం.. మోనా, ప్రీతికి కాంస్యాలు



శనివారం | 31-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 137 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి తె. 3.41 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పుష్యమి రా. 7.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 6.04-7.43; అమృతఘడియలు: మ. 12.48-2.31; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.25 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

1,000 ఎకరాల్లో జూపార్కు

హైదరాబాద్ శివార్లలో కొత్తగా ఏర్పాటు

టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట ఆలయ బోర్డు

చట్ట సవరణ ద్వారా స్వయం ప్రతిపత్తి కల్పిస్తాం

ఫోర్త్‌సిటీలో వెయ్యి ఎకరాల్లో హెల్త్ హబ్

రామప్పగుడిలా కీసరగుట్ట ఆలయ పునర్నిర్మాణం

అనంతగిరిలో నేచర్ వెల్‌నెస్ సెంటర్

పర్యాటకులను ఆకట్టుకునేందుకు కొత్త పాలసీలు

హెల్త్, ఎకో, టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

స్పీడ్ ప్రాజెక్టుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

స్కిల్ యూనివర్సిటీ డిజైన్లను పరిశీలించిన సీఎం



'స్పీడ్' ప్రాజెక్టులపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష. చిత్రంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టీటీడీసీ చైర్మన్ రమేశ్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులో కొత్తగా జూపార్కు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఫోర్త్ సిటీలో హెల్త్ హబ్, టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట ఆలయ బోర్డు, అనంతగిరిలో నేచర్ వెల్‌నెస్ సెంటర్, కీసర గుట్ట ఆలయాన్ని రామప్పగుడి తరహాలో పునర్నిర్మాణం జరపడం.. ఇవీ ప్రభుత్వం 'స్పీడ్'లో భాగంగా అత్యంత ప్రాధాన్యంగా చేపట్టాలనుకుంటున్న కార్యక్రమాలు. వివిధ కార్యక్రమాలను వేగంగా పట్టాలెక్కించేందుకుగాను సర్కారు చేపట్టిన స్పీడ్ (స్మార్ట్ ప్రో యాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ..పర్యాటకులను ఆకట్టుకునేలా రాష్ట్రంలో హెల్త్, ఎకో, టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్ నగర పరిసరాల్లో కొత్తగా మరో జూపార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించాలని, వివిధ ప్రాంతాల నుంచి జంతువులు, పక్షులను తీసుకువచ్చి ఈ పార్కులో ఉంచేలా అర్బన్ ఫారెస్ట్రీని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైతే పారిశ్రామికవేత్తలు, సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ 3వేల ఎకరాల్లో వన్‌తార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాగా, కొత్త

మిగతా 14వ పేజీలో...

ఆ వ్యాఖ్యలను నాకు ఆపాదించారు

బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా

న్యాయవ్యవస్థపై నాకు పూర్తి విశ్వాసం

సుప్రీంకోర్టు ఆగ్రహం నేపథ్యంలో

ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ వివరణ

14

నామినేటెడ్ భర్తీపై భట్టి, ఉత్తమ్‌తో సీఎం చర్చ



హైదరాబాద్ రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలో నాలాపై అక్రమ నిర్మాణాల కూల్చివేత

హిమాయత్‌సాగర్‌కు

హైడ్రా బుల్డోజర్లు!

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై 1-2 రోజుల్లో స్పష్టత

2-3 రోజుల్లో నివేదిక.. ఆ తర్వాత చర్యలు

సర్కారు ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ, వాటర్ బోర్డ్ సర్వే.. 10 అక్రమ నిర్మాణాల గుర్తింపు

వాటిలో ఎమ్మెల్యే సహా ప్రముఖుల అతిథి గృహాలు

జన్వాడ ఫామ్‌హౌస్‌పై ఆర్డీవోకు సర్వేయర్ల నివేదిక

ఫిర్యాదు వచ్చిన 48 గంటల్లోపే నేలమట్టం

రాంనగర్ మణెమ్మ గల్లీ రోడ్డు, నాలాపై చర్యలు

మూడంతస్తుల భవనం సహా కట్టడాల తొలగింపు

ప్రతి ఫిర్యాదు ప్రత్యేకమే.. అలసత్వం వద్దు

సుదీర్ఘ సమీక్షలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసు నమోదు

హైదరాబాద్ సిటీ, రామచంద్రాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైడ్రా బుల్డోజర్ల తదుపరి అడుగులు హిమాయత్‌సాగర్ వైపేనా..? జలాశయం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ప్రముఖుల అతిథిగృహాలు, ఇతర ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమవుతోందా..? అంటే.. విశ్వసనీయవర్గాలు ఈ ప్రశ్నలకు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని.. ఆ తర్వాత కూల్చివేతలుంటాయని సంస్థ వర్గాలు చెబుతున్నాయి. వారం రోజులుగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న

మిగతా 13వ పేజీలో...

తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్యం కానివ్వొద్దు

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కేటీఆర్ విజ్ఞప్తి



శివాజీ మాకు దేవుడు!

మహారాష్ట్రలో ఆయన విగ్రహం కూలడంపై క్షమాపణ చెబుతున్నా: ప్రధాని

దేశవ్యాప్తంగా 218 ఫిషరీస్ ప్రాజెక్టులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు

ఏపీలో జువ్వలదిన్నె హార్బర్ కూడా.. 11

ఆ 15 వేల కోట్లూ గ్రాంటే

అమరావతి నిర్మాణానికి కేంద్రం సాయం

ఈఏపీ అప్పుగా తెచ్చి రాష్ట్రానికి ఇస్తుంది

తిరిగి 100 శాతం కేంద్రమే చెల్లింపు

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ 3



నవ్వుతో చెల్లింపు!

'స్మైల్‌పే' పేరిట ముఖ గుర్తింపు ఆధారిత చెల్లింపు వ్యవస్థ

ప్రారంభించిన ఫెడరల్ బ్యాంకు 12

దేశంలో తొలి ఫేషియల్ పేమెంట్ వ్యవస్థ



శ్రీశైలానికి భారీ వరద

ఎగువ నుంచి మరో 5 రోజుల పాటు.. హెచ్చరించిన కేంద్ర జల సంఘం 3

సాగర్‌లో రెండో రోజూ గేట్లు ఓపెన్

రాష్ట్రంలో నేడు, రేపు అతి భారీ వర్షాలు

రాత్రి పూట డ్యూటీ.. భయం భయం!

దేశంలో మూడింట ఒక వంతు మంది వైద్యులు అభద్రతలోనే

మహిళా డాక్టర్లలో మరింత భయం

ఆత్మరక్షణ కోసం వెంట ఆయుధాలు

45% ఆస్పత్రుల్లో డ్యూటీ రూమ్‌లు, విశ్రాంతి గదులు కూడా కరువు

ఉన్నవాటిలో బాత్‌రూమ్‌లూ లేవు

ఐఎంఏ ఆన్‌లైన్ అధ్యయనంలో వెల్లడి

22 రాష్ట్రాల్లో 3,885 మందితో సర్వే



న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశవ్యాప్తంగా మూడింట ఒక వంతు మంది వైద్యులు అభద్రతలో ఉన్నారని భారత వైద్య మండలి(ఐఎంఏ) అధ్యయనంలో వెల్లడైంది. మరీ ముఖ్యంగా రాత్రిపూట విధులంటే వైద్యులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని తెలిపింది. పురుష వైద్యులకంటే మహిళా వైద్యులు మరింత అభద్రతాభావంలో ఉన్నారని, వారిలో కొందరు ఆత్మరక్షణ కోసం ఆయుధాలు వెంటబెట్టుకుని వస్తున్నారని అధ్యయనం పేర్కొంది. ఆసుపత్రుల్లో భారీగా ఉంటున్న రోగులు, మౌలిక సదుపాయాలు లేకపోవడం, డ్యూటీ రూమ్‌లు కూడా ఉండకపోవడంతో వైద్యులు అభద్రతాభావంతో ఉన్నారని తెలిపింది. వైద్యులకు సరైన భద్రత, సౌకర్యాలు కల్పిస్తే.. తద్వారా రోగులకు మరింత

మిగతా 12వ పేజీలో...

పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీ...

ఈ ఐపీఎస్‌లే వేధించారు

మరో ఇద్దరు పోలీసు అధికారులూ ఉన్నారు.. వారి పేర్లు నాకు తెలియదు

మానసికంగా, శారీరకంగా హింసించారు

కొందరు పోలీసులు నన్ను అసభ్యకరంగా ఫొటోలు, వీడియోలు తీశారు

సజ్జన్‌పై కేసు రాజీ చేసుకోవాలన్నారు

ఏపీ పోలీసులకు వెల్లడించిన కాదంబరి

విద్యాసాగర్ పెళ్లి చేసుకుంటానన్నాడు

కాదన్నాననే నన్ను వేధిస్తున్నాడు

ఆ ఫోర్జరీ డాక్యుమెంట్ అతడి సృష్టే!

పోలీసులు నన్ను ముంబైలో కిడ్నాప్ చేసి విజయవాడ తీసుకొచ్చారు!

45 రోజులు నా జీవితాన్ని దుర్భరం చేశారు

మీడియాతో కాదంబరి జత్వానీ

విజయవాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ నాపై పెట్టిన దొంగకేసును విచారించే సమయంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులు... పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ నన్ను తీవ్రంగా వేధించారు. మరో ఇద్దరు పోలీసు అధికారులు సైతం వేధించిన వారిలో ఉన్నారు. వారి పేర్లు నాకు తెలియదు. మానసికంగా, శారీరకంగా టార్చర్‌కు గురిచేశారు. కొందరు పోలీసులు నన్ను అసభ్యకరంగా ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారు' అని ముంబై సినీనటి కాదంబరి జత్వానీ పోలీసుల విచారణలో వెల్లడించారు. శుక్రవారం తెల్లవారుజామున 5.30కి కాదంబరి జత్వానీ, ఆమె తల్లిదండ్రులు విజయవాడ చేరుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బస చేసిన ఆమెను శుక్రవారం మధ్యాహ్నం విచారణాధికారి స్రవంతి రాయ్ వెళ్లి కలిశారు. ఆమెపై పెట్టిన కేసు పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం జత్వానీ తన న్యాయవాది

మిగతా 2వ పేజీలో...



మీడియాతో కాదంబరి జత్వానీ

ముంబై నటి కేసులో ఎవరున్నా వదలొద్దు

పోలీసు ఉన్నతాధికారులకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం 2

దక్షిణ ఆర్‌ఆర్‌ఆర్‌కు 3 నమూనాలు!



అలైన్‌మెంట్ ఖరారు కోసం రూపకల్పన

రైతుల సాగు భూముల్లేని మార్గంపై యోచన

ఫోర్త్ సిటీకి అనుగుణంగా ఉండేలా చర్యలు

ప్రత్యేకంగా దృష్టి సారించిన సర్కారు

189.2 కిలోమీటర్లకు 2 వేల హెక్టార్ల భూమి

భూ పరిహారానికి రూ.7 వేల కోట్లు

మొత్తం రూ.16 వేల కోట్లతో రోడ్డు నిర్మాణం

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ రహదారి అలైన్‌మెంట్ కోసం ఏకంగా మూడు నమూనాలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫోర్త్ సిటీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు, బెంగళూరు హైవే.. అన్నీ అధిక భాగం దక్షిణ భాగం మార్గంలోనే ఉండడంతో అలైన్‌మెంట్ ఖరారుపై చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఇప్పటికే ఉత్తరభాగం మార్గం నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతుండగా, త్వరలో టెండర్ల ప్రక్రియను కూడా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఉత్తర భాగం పనులతో సమాంతరంగా దక్షిణ భాగానికి సంబంధించిన పనులను ప్రారంభించాలని సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగానే దక్షిణభాగంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా రైతులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములు లేకుండా.. సాగేతర, అటవీయేతర భూములుంటే ఎలాంటి ఇబ్బందులు రావని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే దక్షిణ భాగం అలైన్‌మెంట్‌పై క్షుణ్ణంగా పరిశీలన జరపాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగానే ఇప్పుడు దక్షిణ రింగ్ అలైన్‌మెంట్‌ను మూడు నమూనాల్లో సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మూడు నమూనాల్లో ప్రాంతాలు మారనుండడంతోపాటు, ఆ మార్గంలో సాగు, సాగేతర, అటవీ, అటవీయేతర భూములు ఎంతమేర ఉంటాయనే అన్ని వివరాలను పొందుపరచనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలవగా, త్వరలోనే 3 నమూనాలు సీఎం వద్దకు చేరనున్నట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అన్ని అంశాలను పరిశీలించి.. ఈ మూడు నమూనాల్లో ఒక దానిని ఖరారు చేయనున్నారు.

గతంలోనే ప్రాథమిక మ్యాప్..

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం రోడ్డు నిర్మాణంలో కీలకమైన అలైన్‌మెంట్‌పై గతంలోనే ఒక మ్యాప్‌ను ప్రాథమికంగా సిద్ధం చేసినా.. అది ఖరారు కాలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో రోడ్డు నిర్మాణం సహా పలు అంశాలపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా ప్రస్తుతం ఉన్న రూట్‌మ్యాప్ ప్రకారం ఈ రహదారి చౌటుప్పల్ వద్ద ప్రారంభమై.. ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డిలోని

మిగతా 2వ పేజీలో...



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు 2

లేడీస్ హాస్టల్ బాత్‌రూమ్‌లలో రహస్య కెమెరాలు!

ఏపీలోని కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో కలకలం.. విద్యార్థినుల తీవ్ర ఆందోళన

3 బాత్‌రూమ్‌లలో కెమెరాలున్నాయని ఆరోపణలు

పూర్తిస్థాయి విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశం

అదుపులో ముగ్గురు.. ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

వైసీపీకి మరో ఇద్దరు ఎమ్మెల్సీల గుడ్‌బై


కర్రి పద్మశ్రీ, కళ్యాణ చక్రవర్తి రాజీనామా 2

ముంబై నటి కేసులో ఎవరున్నా వదలొద్దు

కేసును పారదర్శకంగా దర్యాప్తు చేయండి.. గుడ్లవల్లేరు ఘటనపైనా పూర్తి విచారణ జరపాలి

పోలీసు ఉన్నతాధికారులకు ఏపీ సీఎం ఆదేశం

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కేసును పూర్తి పారదర్శంగా దర్యాప్తు చేయాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. ఒక రాష్ట్ర ప్రభుత్వమే మాఫియాగా మారి ఒక మహిళను, ఆమె కుటుంబాన్ని దారుణంగా వేధించిన ఈ కేసులో ఎంత పెద్దవారున్నా వదిలిపెట్టొద్దన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు, శాంతిభద్రతలపై సచివాలయంలో శుక్రవారం సీఎం సమీక్షించారు. ముంబై నటిని వేధించిన వైపీఎస్ మాఫియా, గుడ్లవల్లేరులోని ఇంజనీరింగ్ కాలేజీ బాలికల హాస్టల్‌లో సీక్రెట్ కెమెరా వివాదం, మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో పురోగతి, మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు తదితర అంశాలపై చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ పోలీసులంటే జాతీయ స్థాయిలో మంచి పేరు, గౌరవం ఉండేవని, గత ఐదేళ్లలో మాఫియాలా వ్యవహరించిన కొందరు ఐపీఎస్‌ల వల్ల ఏపీ పోలీస్ ఇమేజ్ దెబ్బతిందని సీఎం వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయి శాంతిభద్రతల సమస్యలకు పరిష్కారం చూపించిన ఘనత ఏపీ ఐపీఎస్‌లకు ఒకప్పుడు ఉండేదని, ఇప్పుడు ఒక్కొక్కటి వింటుంటే అసహ్యం వేస్తోందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో ఏపీ పోలీసు ప్రతిష్ఠ పెరగాలంటే ముంబై నటి కేసు పూర్తి పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడా పొరపాటు లేకుండా, ఎవరు తప్పు చేసినా వదలకుండా చట్టం ముందు నిలబెట్టాలన్నారు. పారిశ్రామికవేత్తలా.. రాజకీయ నాయకులా.. ఐపీఎస్ అధికారులా.. అనేది చూడకుండా తప్పు చేసిన వారిపై చర్య తీసుకోవాలని నిర్దేశించారు. గుడ్లవల్లేరులోని ఇంజనీరింగ్ కళాశాల మహిళా హాస్టల్‌లో రహస్య కెమెరా వివాదంపైనా సీఎం ఆరా తీశారు. ఆ ఘటన వెనకున్న వ్యక్తుల్నీ శిక్షించాలని, కుట్రకోణాన్ని పరిశీలించి, ఉంటే వదిలి పెట్టొద్దన్నారు. విద్యార్థినులకు పూర్తి భరోసా కల్పించి, వారిని రెచ్చగొడుతున్న వారిపై నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో ఆడపిల్లల జోలికి ఎవరొచ్చినా ఊరుకోవద్దని, వారి భద్రతే ప్రభుత్వానికి ముఖ్యమని స్పష్టం చేశారు.



రాష్ట్ర ప్రతిష్ఠ మంటగలిసింది

ముంబై నటి వ్యవహారంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పోలీసులు వ్యవహరించిన తీరు రాష్ట్రం ప్రతిష్ఠను మంటగలిపిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు మాట్లాడారు. తప్పు చేసిన పోలీసులు ఏ స్థాయిలో ఉన్నా క్షమించేది లేదని, మహిళలు, ఆడబిడ్డల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల్లో నెలకొన్న ఆందోళన విషయంలో తాము సకాలంలో స్పందించి తగు చర్యలు తీసుకొన్నామన్నారు.

లోకం తీరు



తెలుగు పాత్రికేయ రంగంలో
వి.హనుమంతరావు పాత్ర ప్రత్యేకం

- రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు
- విలేకరుల స్వేచ్ఛ సన్నగిల్లిందని వ్యాఖ్య



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలుగు పాత్రికేయ రంగంలో ప్రముఖ పాత్రికేయుడు వి.హనుమంతరావు పాత్ర చాలా ప్రత్యేకమైందని రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు పేర్కొన్నారు. పత్రికల్లో అచ్చు అక్షరాన్ని భగవద్గీత, బైబిల్, ఖురాన్ అంతటి పవిత్రంగా ఆరాధించిన ఒకనాటి స్వర్ణయుగంలో ఆయన జర్నలిస్టుగా రాణించారంటూ కొనియాడారు. పాత్రికేయుల ఆరోగ్య సంక్షేమం కోసం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని సంప్రదించి, వారిని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు హనుమంతరావు ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం విలేకరుల స్వేచ్ఛ సన్నగిల్లిందని ఆయన పేర్కొన్నారు. వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయుడు వి.హనుమంతరావు శత జయంతి సభ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. కార్యక్రమంలో కేవీపీ మాట్లాడుతూ.. కొన్ని క్లిష్టమైన అంశాలపై సలహాలు, సూచనల కోసం వైఎస్ ప్రభుత్వం ఆయన్ను సంప్రదించిన సందర్భాలున్నాయన్నారు. అలాంటి ప్రజా పాత్రికేయుడి స్ఫూర్తిని, ఆనాటి పాత్రికేయ విలువలను ఈతరం జర్నలిస్టులకు తెలియజేసేలా తెలంగాణ ప్రెస్ అకాడమీ ప్రత్యేక సదస్సులు, శిక్షణా తరగతులు లాంటివి నిర్వహించాలని సూచించారు. దీనిపై అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రముఖ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ..ఆర్థికరంగానికి సంబంధించిన గణాంకాలు, లెక్కల్లో హనుమంతరావు కదిలే విజ్ఞాన కేంద్రమని ప్రశంసించారు. వీక్షణం మాస పత్రిక వ్యవస్థాపకుడిగా హనుమంతరావు సేవలను ఎన్.వేణుగోపాల్ వివరించారు. కార్యక్రమంలో హనుమంతరావు జీవిత భాగస్వామి సరళ, కుమారుడు జర్నలిస్టు డైరీ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి రాష్ట్ర బార్ కౌన్సిల్ ఖండన

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వృత్తిపరమైన విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులపై దాడులు పెరిగిపోతుండటంపై బార్ కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై చర్చించేందుకు వైస్ ఛైర్మన్ సునీల్‌గౌడ్, బీసీఐ సభ్యుడు పి. విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సంగారెడ్డిలో వృత్తిపరమైన విధులు నిర్వహిస్తున్న న్యాయవాది చైతన్యపై అవతలిపక్షంవారు దాడి చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేసు వాదిస్తున్న న్యాయవాదులపై దాడులను ఖండించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డీజీపీకి; అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానాలు చేశారు.

ఫార్మా సిటీ భూసేకరణపై ప్రభుత్వం అప్పీల్

- రైతులకు డివిజన్ బెంచ్ నోటీసులు

ఫార్మాసిటీ కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ.. నూతన భూసేకరణ చట్టం-2013 కింద జారీ చేసిన నోటిఫికేషన్, అవార్డును ఎందుకు కొనసాగించరాదో వివరించాలని పేర్కొంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన భూయజమానులు, రైతులు 72 మందికి నోటీసులు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీకి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను గతేడాది ఆగస్టు 4న సింగిల్ జడ్జి ధర్మాసనం కొట్టేసింది. సవరించిన ధరల ప్రకారం మళ్లీ భూసేకరణ ప్రక్రియ మొదటి నుంచి ప్రారంభించుకోవచ్చని ప్రభుత్వానికి తెలిపింది. మేడిపల్లి తదితర గ్రామాల్లో దాదాపు 1700 ఎకరాల భూసేకరణ కోసం 2017 నుంచి 2020 వరకు వివిధ సంవత్సరాల్లో ప్రభుత్వం జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్లు, అవార్డులను కొట్టేసింది. తాజాగా సింగిల్ జడ్జి తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం, ఆర్ అండ్ ఆర్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, భూసేకరణ అధికారి, యాచారం తహసీల్దార్, టీజీఐఐసీ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె. శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రతివాదులైన భూ యజమానులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

అనాథ బాలిక దుర్గకు సర్కారు అండ

- నిర్మల్ గురుకుల పాఠశాలలో ప్రవేశం
- 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన బేల్‌తరోడా గ్రామస్థులు

తానూర్, ఆగస్టు 30: నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన అనాథ బాలిక దుర్గకు రాష్ట్ర సర్కారు అండగా నిలిచింది. తల్లి మరణంతో దుర్గ అనాథగా మారిన కన్నీటి గాథపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, మానవతావాదులు స్పందించి... ఆపన్న హస్తం అందించారు. ఇందులో భాగంగానే నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్... శుక్రవారం జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో దుర్గకు ప్రవేశం కల్పించారు. దుర్గకు అవసరమయ్యే బ్యాగులు, కాస్మోటిక్స్, దుస్తులు, నోటు పుస్తకాలను అందించారు. ఉన్నత చదువులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కాగా.. తల్లి మరణంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న దుర్గ కన్నీటి గాథను వెలుగులోకి తీసుకొచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి.. బాలిక బంధువులతో పాటు బేల్‌తరోడా గ్రామస్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీ...
ఈ ఐపీఎస్‌లే వేధించారు

(మొదటిపేజీ తరువాయి)



నర్రా శ్రీనివాసరావు, స్రవంతి రాయ్‌తో పాటు సాయంత్రం 6గంటల సమయంలో సీపీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సీపీ రాజశేఖర్ బాబు, స్రవంతి రాయ్ ఎదుట జత్వానీ, ఆమె తల్లి ఆశా జత్వానీ స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. సుమారు 4గంటలకు పైగా ఆమె సీపీ కార్యాలయంలోనే ఉన్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు.. పోలీసుల వద్ద జత్వానీ సంచలన విషయాలను వెల్లడించారు. తమను ఫిబ్రవరి 3న అరెస్టు చేశారని, 4న విజయవాడకు తీసుకొచ్చి ఇబ్రహీంపట్నంలోని అతిథిగృహంలో ఉంచారని, అక్కడ తనను, తన తల్లిదండ్రులను నిర్బంధించి మానసికంగా.. శారీరకంగా వేధించారని వివరించారు. ఆ సమయంలో కొందరు పోలీసులు తనను అసభ్యకరమైన రీతిలో ఫొటోలు, వీడియోలు తీశారని వాపోయారు. సజ్జన్ జిందాల్ కేసును రాజీ చేసుకోవాలని తీవ్రస్థాయిలో బెదిరించారని చెప్పారు. ముంబైలో తమను అరెస్టు చేసిన సమయంలో ఒంటి మీద దుస్తులు మినహా మరో జత తీసుకొచ్చేందుకూ అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. తమను ఫిబ్రవరి 6వ తేదీన కోర్టుకు హాజరుపర్చి, జైలుకు పంపారని తెలిపారు. కోర్టుకు వెళ్లే సమయంలో తమ కాళ్లకు చెప్పులు కూడా లేవన్నారు. అతిథిగృహంలో ఉంచిన సమయంలో ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీ అక్కడికి వచ్చి తనను, తన తల్లిదండ్రులను వేధింపులకు గురిచేశారని వెల్లడించారు. పోలీసులు తమ కుటుంబం నుంచి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సీజ్ చేశారని, వాటిని కోర్టు ద్వారా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాల్సి ఉన్నా అది జరగలేదని జత్వానీ పేర్కొన్నారు. ఫోర్జరీ చేశారని ఫిర్యాదుదారుడు కుక్కల విద్యాసాగర్ చెబుతున్న డాక్యుమెంట్‌ను కూడా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపలేదన్నారు. ఈ కేసులో భాగస్వాములైన చాలామంది పోలీసుల పేర్లు తనకు తెలియవని, కొందరిని గుర్తుపట్టగలనని జత్వానీ పేర్కొన్నారు. జగ్గయ్యపేట అనే ఊరు ఉందని తనకు తెలియదని, అలాగే డాక్యుమెంటు గురించి కూడా ఏమీ తెలియదని ఆమె స్పష్టం చేశారు. విద్యాసాగర్ వేధింపులతోనే ఇదంతా జరిగిందని, తనకు న్యాయం చేయాలని జత్వానీ కోరారు.

కేసులో 20 మంది పోలీసు అధికారులు!

కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఫిబ్రవరి 2న ఉదయం 6.30కు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అక్కడి నుంచి పోలీసులు ఈ కేసును పరుగులెత్తించారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంను ఏర్పాటు చేశారు. అందులో విచారణాధికారి అప్పటి ఇబ్రహీంపట్నం సీఐ ముత్యాల సత్యనారాయణతోపాటు కె.శ్రీధర్ (సీఐ), దుర్గాభవాని, మౌనిక, వై.రమేశ్‌బాబు, షేక్ అబ్దుల్ రెహమ్మాన్, ఎం.భానుకిరణ్, యు.గోపి, షేక్ షబ్నా పర్వీన్, ఎం.గీతాంజలి, ఎస్.రమ్య ఉన్నారు. ముంబై నుంచి జత్వానీని ఇబ్రహీంపట్నం తీసుకొచ్చిన తర్వాత మరో 10మంది వరకు పోలీసులు ఈ కేసు విచారణలో భాగస్వాములయ్యారు. సాధారణ చీటింగ్ కేసు విచారణకు ఈ స్థాయిలో అధికారులు భాగస్వామ్యం కావడం చూస్తేనే దీనివెనుక బడా బాబుల హస్తం ఉందని అర్థమవుతుంది. జత్వానీ కేసులో భాగస్వాములైన పలువురు పోలీసులు అధికారులు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు. ఉన్నతాధికారులైన పీఎస్సార్, కాంతిరాణా, విశాల్ గున్నీ మాటలు విని తాము ఈ కేసు విషయంలో ముందుకెళ్లామని, అంతకుమించి తమకేమీ తెలియదని ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు.

బెయిల్ దొరక్కుండా చేశారు

జత్వానీని అరెస్టు చేయడానికి ముందే ఏపీ పోలీసు ఇంటెలిజెన్స్ అధికారులు ముంబై వెళ్లి ఆమెను ఈ కేసులో ఎలా ఇరికించాలో, ఎవరితో ఫిర్యాదు చేయించాలి అనే అంశాలను ప్లాన్ చేశారు. ఈ కేసులో ఐపీఎస్ అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా, విశాల్ గున్నీ ప్రమేయం ఉందని జత్వానీ చెప్పారు. ఈ కేసులో సూత్రధారి కుక్కల నాగేశ్వరరావు, ఆయన సన్నిహితులు.. చిందా వీర వెంకట నాగేశ్వరరావు, బోరుకాటి భరత్‌కుమార్‌ను విచారిస్తే అసలు నిజాలు నిగ్గు తేలుతాయని ఆమె చెబుతున్నారు. ఆమెకు వకాలత్ ఇచ్చినా బెయిల్ దొరక్కుండా చేయడం వెనుక బడా నాయకులు ఉన్నారని జత్వానీ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లిన తన సోదరుడిని కూడా ఈ కేసులో ఇరికించారని అంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా కొందరు పోస్టులు పెడుతున్నారని, వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని జత్వానీ చెబుతున్నారు.

- నర్రా శ్రీనివాసరావు, జత్వానీ న్యాయవాది

దక్షిణ ఆర్ఆర్ఆర్‌కు 3 నమూనాలు!

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర భాగం రహదారికి అనుసంధానం కానుంది. ఇది మొత్తం 189.2 కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. దీని నిర్మాణానికి దాదాపు 2వేల హెక్టార్ల భూమి అవసరమవుతుంది. భూ పరిహారం కింద రూ.7 వేల కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉండగా.. మొత్తం రోడ్డు నిర్మాణానికి రూ.16 వేల కోట్లకు పైగా నిధులు అవసరం కానున్నాయని అధికారుల ప్రాథమిక అంచనాల్లో తేలినట్టు సమాచారం. రోడ్డు నిర్మాణానికి సంబంధించి అలైన్‌మెంట్ సహా వివిధ అంశాలను అధ్యయనం చేసేందుకు ఢిల్లీకి చెందిన ఇంటర్ కాంటినెంటల్ కన్సల్టెంట్ అండ్ టెక్నోకార్ఫ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కన్సల్టెన్సీగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం.

ప్రస్తుతం ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో ప్రతి 1.5 కిలోమీటర్లు లేదా 2కిలోమీటర్లకు ఒక అండర్‌పాస్ నిర్మించాలని ప్రతిపాదించారు. దీంతో పాటు మొత్తం మార్గంలో రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు (ఆర్వోబీ)-04, మేజర్ బ్రిడ్జిలు- 13, మైనర్ బ్రిడ్జిలు-79, బాక్స్ కల్వర్టులు-317, పైప్ కల్వర్టులు- 159, లైట్ వెహికల్ అండర్‌పాస్‌లు-9, చిన్న వాహనాల అండర్‌పాస్‌లు- 91, పాదచారులు వెళ్లేందుకు వీలుగా (పీయూపీ) అండర్‌పాస్‌లు- 4, ఇంటర్‌సెక్షన్స్- 11, దాదాపు 10కిపైగా టోల్‌ప్లాజాలను నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో తాజాగా పునఃపరిశీలన జరుపుతున్న దక్షిణభాగంలోనూ ఎక్కడెక్కడ అండర్‌పాస్‌లు, బ్రిడ్జిలు, ఇంటర్‌చేంజ్‌లతో సహా వంతెనలను నిర్మించాల్సి ఉంటుందనే దానిపై అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా ఈ రోడ్డు నిర్మాణం మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లు సహా ఇతర యుటిలిటీస్‌కు సంబంధించిన వివరాలనూ సేకరిస్తున్నారు.

విద్యాసాగర్ పెళ్లి చేసుకుంటానన్నాడు

- కాదన్నాననే నన్ను వేధిస్తున్నాడు
- మీడియాతో నటి కాదంబరి జత్వానీ

విజయవాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తనను పెళ్లిచేసుకుంటానన్నాడని.. తాను నిరాకరించినందునే తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ముంబై నటి కాదంబరి జత్వానీ చెప్పారు. ముంబైలో సుమారు 15 మంది ఏపీ పోలీసు అధికారులు తనను కిడ్నాప్ చేశారని వెల్లడించారు. తన అరెస్టుకు కారణమైన డాక్యుమెంట్ ఫోర్జరీదని.. దానిని విద్యాసాగరే సృష్టించాడని తెలిపారు. విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'విద్యాసాగర్ నాకు 2015లో పెళ్లి ప్రతిపాదన చేశాడు. ఆయన వివాహేతర సంబంధాల కారణంగా తిరస్కరించాను. అప్పటి నుంచి నన్ను వేధింపులకు గురిచేస్తున్నాడు. నన్ను ముంబైలో అరెస్టు చేసే సమయంలో ఏపీ పోలీసులు నిబంధనలు పాటించలేదు. అక్కడ కిడ్నాప్ చేసి విజయవాడ తీసుకొచ్చారు. నాటి విజయవాడ సీపీ కాంతిరాణా టాటా అక్రమంగా కేసులో ఇరికించారు' అని వాపోయారు. పోలీసులు తీవ్రంగా వేధించారని.. సుమారు 45 రోజులపాటు తన జీవితాన్ని దుర్భరం చేశారని అన్నారు. తన తల్లిదండ్రుల ఆరోగ్యం దెబ్బతిందన్నారు. జైలులో తన తండ్రి బంగారు ఉంగరం పోయిందన్నారు. 'డబ్బుల కోసం ఓ మహిళపై ఇలాంటి అక్రమ కేసు పెట్టి వేధిస్తారా? నన్ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారని నిరూపించే ఆధారాలు పోలీసులకు ఇచ్చాను. ఫోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించింది విద్యాసాగరే.. ఆ డాక్యుమెంట్‌లో పేర్కొన్న ఆస్తి కూడా అప్పటికే బ్యాంకు తనఖాలో ఉంది. అలాంటి ఆస్తిని నేను వేరే వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నించానని ఎలా చెబుతారు? నేను పలువురు పారిశ్రామికవేత్తలను బ్లాక్‌మెయిల్ చేశానని ప్రచారం చేస్తున్నారు. అలా చేస్తే వారు నాపై కేసులు పెట్టేవారుగా' అని జత్వానీ ప్రశ్నించారు.

పక్కా స్కెచ్‌తోనే..

జగన్ మనుషులను కాపాడేందుకు మహిళ బలి

- జత్వాని కేసులో నిబంధనలు తుంగలోకి
- నాడు తాడేపల్లి డైరెక్షన్‌లో సాగిన కథ
- ఎస్సై వెళ్లే కేసులో ఎస్పీ స్థాయి అధికారి
- నోటీసివ్వకుండా వారెంట్‌తో ముంబైకి
- జత్వానీ కేసులో ట్విస్టుల మీద ట్విస్టులు
- ముంబై కేసు తర్వాత జగన్‌తో సజ్జన్ భేటీ
- ఆ తర్వాత ఏపీలో జత్వానీపై కేసు
- అనంతరం ముంబైలో సజ్జన్ కేసు క్లోజ్
- విద్యాసాగర్ భూముల్ని రాయించుకోవడం కట్టుకథే

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పక్కా స్కెచ్‌తోనే ముంబై నటి కాదంబరి జత్వానీని వేధించారు. నాటి ముఖ్యమంత్రి జగన్ తన సొంత మనుషులను కాపాడుకోవడం కోసం ఓ మహిళను బలి చేశారు. ఐపీఎస్ అధికారులు, పోలీసులు 24 గంటల్లో కథ నడిపారు. నిబంధలనకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు. నాటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు దారుణం వ్యవహరించిన తీరు తాజాగా వెలుగులోకి వచ్చింది. సాధారణంగా పదేళ్ల లోపు శిక్ష పడే కేసు, సివిల్ కేసులో మహిళను విచారించేందుకు నోటీసు ఇవ్వాలి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం విచారించాలి. అయితే ఆ నిబంధనలన్నీ తుంగలోకి తొక్కారు. ఈ కథ మొత్తం తాడేపల్లి డైరెక్షన్‌లో సాగింది. పోలీసులు ఆగమేఘాలపై వారెంట్ తీసుకుని ముంబై వెళ్లారు. ఎస్ఐ స్థాయి అధికారి వెళ్లాల్సిన ఈ కేసులో ఎస్పీ స్థాయి అధికారి వెళ్లారు. కాదంబరి జత్వానీతో పాటు ఆమె తల్లిదండ్రులను విజయవాడకు తీసుకొచ్చి ఎన్నో విధాలుగా వేధించారు.

ఇదీ అసలు విషయం

మిత్రుడు సజ్జన్ జిందాల్‌కు సహాయ పడేందుకు నాటి జగన్ సర్కారు ఆడించిన డ్రామాలో అసలు విషయం బట్టబయలైంది. ఎక్కడో ముంబైలో వైద్యురాలు, సినిమాల్లో నటించే జత్వానీ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం సమీపంలో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ భూముల్ని దౌర్జన్యంగా తన పేరిట రాయించుకున్నారని అల్లిన కథ పూర్తి కట్టుకథగా తేలింది. అయితే నాడు వైసీపీ పెద్దలు వేసిన స్కెచ్‌ను నిజమని నిరూపించేందుకు పోలీసు అధికారులు అత్యుత్సాహం చూపారు. అంతర్జాతీయ స్థాయి నేరస్థురాలు అయినట్టు ఎస్పీ స్థాయి అధికారి ముంబైకు వెళ్లి ఓ మహిళపై తమ ప్రతాపం చూపారు. ఎక్కడా నిబంధనలు పాటించలేదు. సజ్జన్ జిందాల్‌ను రేప్ కేసు నుంచి రక్షించడం కోసం జత్వానీ కుటుంబాన్ని వేధింపులకు గురి చేశారు. పోలీసు అధికారులు తాము అనుకున్నది చేశాక గుట్టుచప్పుడు కాకుండా కేసు క్లోజ్ చేశారు. బాధితులను బెదిరించి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుని విడిచిపెట్టారు.

జత్వానీ, సజ్జన్ మధ్యలో జగన్

ముంబైలో బాంద్రా కుర్లా కాంప్లెక్స్ స్టేషన్‌లో 2023 డిసెంబరు 17న సజ్జన్ జిందాల్‌పై కేసు నమోదయింది. ఆ తరువాత 12 రోజులకు అంటే 2023 డిసెంబరు 29న సజ్జన్ జిందాల్ తాడేపల్లిలో జగన్‌ను కలిశారు. 2024 ఫిబ్రవరి 2న కుక్కల విద్యాసాగర్ ఇబ్రహీంపట్నం పోలీసులకు జత్వానీపై ఫిర్యాదు చేశారు. 3వ తేదీన పోలీసులు ముంబై నుంచి జత్వానీని తీసుకొచ్చారు. పోలీసులు చెప్పిన వాటికన్నింటికీ జత్వానీ తల్లిదండ్రులు పూర్తిగా అంగీకరించిన తరువాతే ఆమెకు ఫిబ్రవరి 14న బెయిల్ వచ్చింది. ఆ మరుసటి రోజు.. ఫిబ్రవరి 15న కడపలో జరిగిన స్టీల్ ప్లాంట్ భూమి పూజా కార్యక్రమంలో సజ్జన్ జిందాల్ పాల్గొన్నారు. పోలీసులు చెప్పినట్టుగా... ముంబైలో సజ్జన్‌పై పెట్టిన కేసు విచారణకు జత్వానీ హాజరు కాలేదు. దీంతో ముంబై పోలీసులు మార్చి 15న కేసు క్లోజ్ చేశారు.

డ్రామా మిస్ ఫైర్

జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైన ఈ కుట్రకోణంలో బయటికి వస్తున్న వాస్తవాలు వింటుంటే మాఫియా డాన్‌లను మించిన స్కెచ్‌లు వేశారు. నాడు వైపీఎస్ అధికారులు ఆడిన డ్రామా మిస్ ఫైర్ అయింది. పట్టణాలు, నగరాల్లో సెటిల్మెంట్లు చేసే రౌడీలు, గూండాల వద్దకు ఎవరైనా వచ్చి మంచి ఆఫర్ ఇస్తే అవతలి వారిది తప్పా ఒప్పా అనేది చూడరు. వెంటనే తమ మనుషుల్ని పంపించి లాక్కొచ్చి తన్ని సెటిల్ చేస్తారు. ముంబై నటి కాదంబరి కేసులో విజయవాడ పోలీసులు ఇదే చేశారు. జగన్ రెడ్డి స్నేహితుడైన సజ్జన్ జిందాల్‌ను రేప్ కేసు నుంచి రక్షించడం కోసం ఆయన పార్టీకి చెందిన కుక్కల విద్యాసాగర్‌తో ఇబ్రహీంపట్నం పోలీసులకు ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఫిర్యాదు చేయించారు. ముంబై నటికి విజయవాడ సమీపంలో భూమి కొనాల్సిన అవసరం ఏముందనే విషయాన్ని పూర్తిగా పక్కన బెట్టేశారు. ఆమెతో పాటు తల్లిదండ్రులను అరెస్ట్ చేసి తీసుకొచ్చారు. తాజాగా బెజవాడ పోలీసుల దర్యాప్తులో ఇవన్నీ బయటికి వస్తుండటంతో వైసీపీ నేతలతో పాటు జగన్ మీడియా రంగంలోకి దిగి ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తే పారిశ్రామికవేత్తలు పారిపోతారంటూ వార్తలు వండటం మొదలు పెట్టింది. నాడు అంతా సక్రమంగానే జరిగిందని, జగన్ ప్రభుత్వం సుద్దపూస అంటూ ఆయన రోత పత్రిక శుక్రవారం సంచికలో వండి వార్చిన వికృత కథనం అబద్ధాల పుట్టగా తేలింది.

లేడీస్ హాస్టల్ బాత్‌రూమ్‌లలో
రహస్య కెమెరాలు!

ఏపీలోని కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినుల తీవ్ర ఆందోళన

మచిలీపట్నం/గుడ్లవల్లేరు/జేఎన్టీయూకే, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఏపీలోని కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రి ఇంజనీరింగ్ కళాశాల బాలికల వసతి గృహం వాష్‌రూమ్‌లలో 'హిడెన్' కెమెరాల కలకలం రేగింది. బాలికల వసతి గృహంలోని మూడు బాత్‌రూమ్‌లలో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి వీడియోలు తీశారని ఆరోపిస్తూ విద్యార్థినులు గురువారం అర్ధరాత్రి వసతిగృహం నుంచి బయటకొచ్చి పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వాష్‌రూమ్‌కు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందంటూ హిడెన్ కెమెరాలు ఏర్పాటు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించారు. పూర్తిస్థాయి విచారణ చేయాలని, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. కాగా, తమకు న్యాయం చేయాలంటూ శుక్రవారం రోజు రోజంతా విద్యార్థినులు ఆందోళన చేశారు. కాగా విద్యార్థినులు వాష్‌రూమ్‌లోకి వెళ్లిన సమయంలో హిడెన్ కెమెరాల ద్వారా తీసిన వీడియోలు అదే కళాశాలకు చెందిన బాలుర వసతిగృహంలోని కొందరికి అందినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు 300 వరకు వీడియోలు తీశారని ఆరోపిస్తున్నారు. విద్యార్థినులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు బాలికల వసతి గృహానికి వెళ్లి వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. హిడెన్ కెమారాలు ఏర్పాటు చేశారనే అంశంలో అనుమానితుడి ల్యాప్‌టాప్‌ను, అతడికి సహకరించిందనే ఆరోపణలున్న మరో విద్యార్థి ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రకాశం జిల్లా పుల్లలచెరువుకు చెందిన బీటెక్ విద్యార్థితో పాటు మరో ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థినుల తల్లిదండ్రుల సమక్షంలో పోలీసులు హిడెన్ కెమెరాల కోసం నాలుగు గంటలపాటు వసతిగృహంలోని ప్రతిగదిని, బాత్‌రూమ్‌లనూ నిశితంగా పరిశీలించారు. అయితే ఎలాంటి కెమెరాలు లభించలేదని పోలీసులు తెలిపారు. దీంతో విద్యార్థినులు సంతృప్తి చెంది తమ నిరసనను విరమించారు. కళాశాల బాలికల వసతి గృహంలో హిడెన్ కెమెరాలు అమర్చిన ఘటనపై దర్యాప్తునకు జిల్లా ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాగా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని నిష్పక్షపాతంగా పూర్తిస్థాయి విచారణ చేయాలని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర.. కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. విద్యార్థినులతో మంత్రి మాట్లాడారు.

ప్లీజ్.. నన్ను విడిచి వెళ్లొద్దు!

- ఎంపీలకు జగన్ వేడుకోలు
- మరో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్సీలు గుడ్‌బై
- కర్రి పద్మశ్రీ, కల్యాణ చక్రవర్తి రాజీనామా

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దెబ్బమీద దెబ్బ తగులుతోంది. రాజ్యసభకు ఎంపీలు మోపిదేవి వెంకట రమణారావు, బీద మస్తాన్‌రావు రాజీనామా చేయడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. తనకు సన్నిహితులుగా ఉన్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, గొల్ల బాబూరావుతో పాటు మేడా రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య కూడా రాజీనామాలు చేయబోతున్నారని భారీ ఎత్తున ప్రచారం సాగుతుండడంతో కలతచెందిన మాజీ సీఎం.. బుజ్జగింపు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పార్టీని, తనను వదిలిపోవద్దని అభ్యర్థించారు. రాజ్యసభలో వైసీపీకి ఉన్న బలం వల్లే ఢిల్లీలో తనను గౌరవిస్తున్నారని.. మీరు రాజీనామా చేస్తే.. ఉప ఎన్నికల్లో ఆ పదవులన్నీ టీడీపీకి వెళ్లిపోతాయని చెప్పారు. రాజీనామా చేయడం తనకు వెన్నుపోటు పొడవడమేనని నిష్ఠూరం కూడా ఆడినట్లు సమాచారం. ఈ బుజ్జగింపుల ప్రభావమో ఏమో..అయోధ్యరామిరెడ్డి, బోస్ శుక్రవారం తాడేపల్లి ప్యాలెస్ ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ముందుకొచ్చి మాట్లాడారు. తాము జీవితాంతం జగన్ వెంటే ఉంటామన్నారు. తనకు వ్యక్తిగతంగా నష్టాలు, కష్టాలూ ఉన్నా వైసీపీని వీడడం లేదని.. రాజ్యసభకు రాజీనామా చేయడం లేదని అయోధ్యరామిరెడ్డి చెప్పారు. గొల్ల బాబూరావు, రఘునాథరెడ్డి కూడా పార్టీని వదిలివెళ్లరని అన్నారు. మీడియాకు ఈ విషయం చెప్పాలని జగన్ సూచించారని బోస్ వెల్లడించారు. తాము రాజ్యసభకు రాజీనామా చేస్తే ఆ పదవులు టీడీపీకి వెళ్లిపోతాయని.. అది ఒక విధంగా జగన్‌కు వెన్నుపోటు పొడవడంతో సమానమని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జగన్‌కు మరో షాక్ తగిలింది. కాకినాడ జిల్లాకు చెందిన కర్రి పద్మశ్రీ (గవర్నర్ కోటా), ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన బల్లి కల్యాణచక్రవర్తి (ఎమ్మెల్యే కోటా) శుక్రవారం మండలికి, పార్టీకి రాజీనామా చేశారు. ఇప్పటికే పోతుల సునీత (ఎమ్మెల్యే కోటా) కూడా ఎమ్మెల్సీ పదవికి, వైసీపీకి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మోపిదేవి, మస్తాన్‌రావుల రాజీనామాలను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గురువారమే ఆమోదించగా.. సునీత, పద్మశ్రీ, కల్యాణ చక్రవర్తిల రాజీనామాలను ఆమోదించకుండా మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు పెండింగ్‌లో పెట్టడం గమనార్హం. ఆమోదిస్తే ఇవి టీడీపీ కూటమి ఖాతాలోకి వెళ్లిపోతాయి. కాగా.. కొందరు వైసీపీ ముఖ్య నేతల వ్యవహార శైలినీ జగన్ శంకిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల తర్వాత వారు తాడేపల్లి ప్యాలెస్ వైపే రావడం లేదు. అడపాదడపా వస్తున్న నాయకులు కూడా ఇప్పుడు ముఖం చాటేస్తారేమోనన్న అనుమానంతో ఆయన ఆందోళన చెందుతున్నారు.

అంచనా వ్యయం ఎలా పెరిగింది?

'వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి'పై విజిలెన్స్ ఆరా.. ఆస్పత్రిని సందర్శించిన అధికారుల బృందం

వరంగల్ మెడికల్, ఆగస్టు 30: వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం సందర్శించింది. ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయాన్ని ఒకేసారి రూ.625.95 కోట్లు పెంచడంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇక్కడికి వచ్చారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు వరంగల్ అధికారి బాలకోటి నేతృత్వంలోని బృందం ఆస్పత్రి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించింది. భవన నిర్మాణ కాంట్రాక్టు సంస్థ అయిన ఎల్అండ్‌టీ ఇంజనీరింగ్ సిబ్బందితో వారు మాట్లాడారు. ఆర్అండ్‌బీ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి నిర్మాణానికి సంబంధించిన రికార్డులను తెప్పించుకొని పరిశీలించి.. వాటిలో కొన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని రూ.1,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించగా.. తర్వాత దానిని రూ.1,725.95 కోట్లకు పెంచడం తెలిసిందే. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల వరంగల్ నగర పర్యటనలో భాగంగా ఈ ఆస్పత్రిని సందర్శించి.. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే అంచనా వ్యయాన్ని పెంచడమేంటని అనుమానాలు వ్యక్తం చేశారు. ఇందులో ఏదో మతలబు ఉందంటూ విచారణకు ఆదేశించారు. ఈ ఆస్పత్రితోపాటు రాష్ట్రంలోని మరో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అంచనా వ్యయం పెంపుపైనా ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

రూ.2 వేల కోట్ల రుణం పైనా ఆరా

సీఎం ఆదేశాలతో తాజాగా ఆస్పత్రిని సందర్శించిన అధికారుల బృందం.. ఇప్పటివరకు జరిగిన పనుల ప్రగతిపై ఆరా తీసింది. భవన నిర్మాణ పనులపై ఇప్పటివరకు ఎంత వరకు ఖర్చు చేశారు? ఇంకా ఎంత ఖర్చు చేయాల్సి ఉంది? పనులు ఏ మేరకు జరిగాయి.? తొలుత ఆమోదించిన డిజైన్ల ప్రకారమే పనులు జరుగుతున్నాయా? వంటి వివరాలపై ఆరా తీశారు. భవన నిర్మాణం జరుగుతున్న సెంట్రల్ జైలు స్థలాన్ని గత ప్రభుత్వం బ్యాంకులో తనఖా పెట్టి రూ.2 వేల కోట్ల రుణం తీసుకోవడంపైనా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. బ్యాంకు రికార్డులను, ఇతర సంబంధిత పత్రాలను సేకరిస్తున్నారు. విచారణ పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని బాలకోటి తెలిపారు.

చనిపోయిన భార్య గుర్తుగా హ్యాండ్ కాస్టింగ్



అశోక్, పద్మశ్రీ (ఫైల్)



పెనుబల్లి, ఆగస్టు 30: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమెకు గుర్తుగా హ్యాండ్ కాస్టింగ్ తయారుచేయించి తన ప్రేమను చాటుకున్నడా భర్త. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఎడ్లబంజర గ్రామానికి చెందిన అశోక్ కన్నా.. 2006లో పద్మశ్రీని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అశోక్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబంతో కలిసి సత్తుపల్లిలో స్థిరపడ్డాడు. వీరికి ఓ కుమార్తె ఉంది. ఎంతో ఆనందంగా ఉన్న ఈ కుటుంబంలో ఒక్కసారిగా పెను విషాదం అలుముకుంది. కొద్దిరోజుల క్రితం పద్మశ్రీ అనారోగ్యానికి గురైంది. విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమెను ప్రేమించి పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుని.. తానే సర్వసంగా బతుకుతున్న అశోక్ ఈ ఘటనతో తీవ్ర విషాదంలో మునిగిపోయాడు. భార్య స్మృతులను శాశ్వతంగా నిలుపుకొనేందుకు అంత్యక్రియల రోజే భార్య చేయిని.. తన చేయిని, కుమార్తె చేయిని కలిపి విజయవాడ నుంచి ప్రత్యేకంగా రప్పించిన కాస్టింగ్ నిపుణులతో హ్యాండ్ కాస్టింగ్ తయారుచేయించాడు. ఇప్పుడాయన దాన్ని తన గుర్తుగా పదిలపర్చుకున్నాడు.

భారతీయుల్లో సూక్ష్మపోషకాల కొరత

- ఆహారంలో ఐరన్, కాల్షియం తగినంత ఉండటం లేదు
- లాన్సెట్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తగిన స్థాయిలో సూక్ష్మపోషకాహారాన్ని భారతీయులు తీసుకోవడం లేదని తాజాగా జరిగిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా ఐరన్, కాల్షియం, ఫోలేట్‌లను ఆరోగ్యానికి అవసరమయ్యేంత స్థాయిలో తీసుకోవడం లేదని తెలిసింది. లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ఈ అధ్యయనం తాలూకు వివరాలు ప్రచురితమయ్యాయి. భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా 185 దేశాల్లో ఈ సర్వే జరిగింది. మనిషి ఆరోగ్యానికి అవసరమైన 15 రకాల సూక్ష్మపోషక పదార్థాల వినియోగం ఆయా దేశాల్లో ఎలా ఉందన్నది పరిశీలించారు. ప్రపంచ జనాభాలో దాదాపు 70 శాతం (అంటే 500 కోట్ల మంది) ప్రజలు తగినంతగా అయోడిన్, విటమిన్ ఈ, కాల్షియం తీసుకోవడం లేదని పరిశోధకులు గుర్తించారు. మహిళల్లో అయోడిన్, విటమిన్ బీ 12, ఐరన్ కొరత అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. పురుషుల్లో మెగ్నీషియం, విటమిన్ బీ 6, జింక్, విటమిన్ సీ కొరత ఉన్నట్లు తేలింది. దక్షిణాసియా, ఆగ్నేయాసియా, సహారా ఆఫ్రికాలలో సూక్ష్మపోషకాల కొరత అత్యధికంగా ఉంది.

2026 మార్చి నాటికి దేవాదుల పూర్తి

సోనియా ఆధ్వర్యంలోనే ప్రారంభం.. ఇక 300 రోజులు పంపింగ్.. 60 టీఎంసీలను ఎత్తిపోస్తాం: మంత్రి ఉత్తమ్

- వివిధ కారణాలతో రుణమాఫీలో రూ.13వేల కోట్లు పెండింగ్
- 40 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు..

ధరణిని ప్రక్షాళన చేస్తాం: పొంగులేటి



దేవాదుల పైలాన్ వద్ద ఉత్తమ్, శ్రీనివాసరెడ్డి, సీతక్క, కడియం

ములుగు/యాదాద్రి, ఆగస్టు 30: దేవాదుల ప్రాజెక్టును 2026 మార్చి నాటికి పూర్తిచేసి 5.57 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీటిని అందిస్తామని, నాడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సోనియా గాంధీ ఆధ్వర్యంలోనే పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గత సర్కారు రూ.లక్ష కోట్లు ఖర్చుచేసిందని.. ప్రస్తుతం మేడిగడ్డ, సుందిళ్ల అన్నారం బ్యారేజీల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. కాళేశ్వరానికి రూ.లక్ష కోట్లు, పాలమూరు-రంగారెడ్డికి రూ.25వేల కోట్లు, ఎస్సారెస్పీకి రూ.8వేల కోట్లు.. ఇతర అన్ని ప్రాజెక్టులకు కలిపి మొత్తంగా రూ.1.8 లక్షల కోట్లు ఖర్చుచేసినా అదనంగా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు. శుక్రవారం ఆయన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టు, సమ్మక్క బ్యారేజీలను సందర్శించి.. సమీక్ష నిర్వహించడంతో పాటు యాదాద్రి జిల్లా భువనగిరిలో ఆ లోక్‌సభ నియోజకవర్గం స్థాయి ఇరిగేషన్ ప్రాజెక్టుల సమీక్ష నిర్వహించారు. దేవాదుల, భువనగిరి కార్యక్రమాల్లో ఉత్తమ్‌తో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. దేవాదుల కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి కోసం అవసరమైన రూ.17,500కోట్ల నిధుల మంజూరు కోసం త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని, దేవాదులతోపాటు సీతారామ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు కాలపరిమితిని నిర్దేశించుకుంటామని వెల్లడించారు. 71మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం ఉంటేనే ఏడాదిలో 170 రోజుల పాటు 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసే ఉద్దేశంతో దేవాదుల ప్రాజెక్టును డిజైన్ చేశారని, కానీ, దిగువన నిర్మించిన సమ్మక్క బ్యారేజీ వద్ద నీటికి అడ్డుకట్ట వేయడం ద్వారా ఇక నుంచి దేవాదుల ద్వారా 300రోజులు పంపింగ్ చేస్తామని.. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు భువనగిరి, కరీంనగర్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల రైతులకు సాగునీటిని అందిస్తామని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పొంగులేటి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రైతు రుణమాఫీకి రూ.18వేల కోట్లు విడుదల చేశామని.. వివిధ కారణాలతో రూ.13వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 40 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తామన్నారు. ధరణిని ప్రక్షాళన చేసి, కొత్తగా వచ్చే ఆర్వోఆర్ రోల్ మోడల్ అవుతుందని పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు కింద భూములను త్యాగం చేసిన ములుగు జిల్లా రైతాంగానికి మాత్రం గోదావరి జలాలు అందడం లేదని, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాలలో లిఫ్టులను ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క కోరారు.

ఉత్తమ్ సీఎం అవుతారు: రాజగోపాల్

భువనగిరిలో జరిగిన సమీక్ష సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి ఉత్తమ్‌ను ముఖ్యమంత్రి గారు అని సంబోధించారు. ఆ వెంటనే సవరించుకుని మంత్రిగారు అన్నారు. అయితే భవిష్యత్తులో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం అవుతారని, ఇప్పటికే సీఎం పదవి మిస్ అయ్యిందని, తన వ్యాఖ్యలు నిజమవుతాయని చెప్పారు.

పోలీసులపై నకిరేకల్ ఎమ్మెల్యే ఆగ్రహం

నల్లగొండ జిల్లా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భువనగిరిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు హెలీప్యాడ్ వద్దకు వెళ్లిన ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో.. ఎమ్మెల్యేను గుర్తుపట్టే స్థాయిలో పోలీసులు లేరా? అంటూ ఆయన మండిపడ్డారు.

వీసా రాలేదని మనస్తాపం..

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



మహేశ్ (ఫైల్)

కాటారం, ఆగస్టు 30: విదేశాల్లో ఉన్నతోద్యోగం చేయాలనే ఆ యువకుడి కల నెరవేరలేదు. వీసా కోసం దరఖాస్తు చేసుకోగా అది రిజెక్ట్ అయింది. ఆ ఆవేదనతోనే అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఈ విషాదం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన ముల్కల్ల లక్ష్మయ్య ఇద్దరు సంతానంలో చిన్నవాడైన మహేశ్ (27) బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో రెండేళ్ల పాటు రెండు సంస్థల్లో ఉద్యోగాలు చేశాడు. మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లాలని నిర్ణయించుకొని హైదరాబాద్‌లోనే ఉంటూ కొన్నాళ్లుగా వీసా కోసం ప్రయత్నిస్తూ ఇంటర్వ్యూలకు హాజరవుతున్నాడు. రాఖీ పండగకు హైదరాబాద్ నుంచి ఇంటికొచ్చాడు. గురువారం తల్లిదండ్రులను బైక్‌పై పొలం వద్ద దింపి ఇంటికొచ్చాడు. పనులు ముగించుకున్న తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి తిరిగొచ్చేసరికి మహేశ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు. మహేశ్ సెల్‌ఫోన్‌ను పరిశీలించగా వీసా కోసం ఓ కన్సల్టెన్సీకి చెందిన వ్యక్తితో మాట్లాడినట్టుగా ఉంది. వీసా రిజెక్ట్ అయినట్టు వేరే ఫోన్ నంబర్ నుంచి వచ్చిన మెసేజ్ ఉంది.

డెంగీతో ఇద్దరి మృతి

- మృతుల్లో ఒకరు ఐదో తరగతి విద్యార్థి






సుతారి కనకవ్వ, వడ్ల హర్షిత్(ఫైల్)

సిద్దిపేటఅర్బన్/పాపన్నపేట, ఆగస్టు 30 : డెంగీతో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇద్దరు చనిపోయారు. వారిలో ఒకరు మహిళ కాగా, మరొకరు ఐదో తరగతి విద్యార్థి. సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లికి చెందిన సుతారి కనకవ్వ(28)కు రెండు నెలల క్రితం తీవ్ర జ్వరం వచ్చింది. పరీక్షలు చేయించగా డెంగీగా నిర్ధారణ అయ్యింది. అప్పటి నుంచి చికిత్స పొందుతోంది. పది రోజుల క్రితం సిద్దిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఆమె కోలుకోలేదు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందింది. ఈమెకు భర్త నర్సింహులు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. రోజువారీ కూలీతో కనకవ్వ కుటుంబం జీవిస్తుందని, ఆసుపత్రి ఖర్చులకే రూ.25 లక్షలకు పైగా అప్పులు అయ్యాయని గ్రామస్థులు తెలిపారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం చీకోడ్ గ్రామానికి చెందిన వడ్ల రాజు పెద్ద కుమారుడు వడ్ల హర్షిత్(11) స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజుల క్రితం జ్వరం రావడంతో పరీక్షలు నిర్వహించగా డెంగీ అని తేలింది. మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేసినా తగ్గకపోవడంతో కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయినా తగ్గకపోవడంతో గురువారం నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అదే రోజు సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందాడు.

శ్రీశైలం జలాశయానికి భారీ వరద

ఎగువ నుంచి మరో ఐదు రోజులపాటు రాక.. హెచ్చరించిన కేంద్ర జల సంఘం



శ్రీశైలం డ్యాం నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

హైదరాబాద్, అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణా పరివాహక ప్రధాన జలాశయాలన్నీ ఆకస్మిక భారీ వరదలతో ఉప్పొంగుతున్నాయి. ఎగువన ఆలమట్టి నుంచి శ్రీశైలం జలాశయానికి భారీ ప్రవాహం వచ్చి చేరుతోంది. నాగార్జున సాగర్, పులిచింతల గరిష్ఠ మట్టానికి చేరాయి. ఆలమట్టిలో 129.72 టీఎంసీలకు గాను 122.1 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 1,66,760 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంటే.. కేంద్ర జల సంఘం హెచ్చరికల నేపథ్యంలో 1,76,540 క్యూసెక్కులను కిందకు వదిలేస్తున్నారు. నాగార్జున సాగర్‌లోనూ వరుసగా రెండోరోజు మొత్తం 26 గేట్లనూ ఎత్తి ఉంచారు. ఎగువ నుంచి మరో ఐదు రోజులు భారీ వరద రానుందని కేంద్ర జల సంఘం అప్రమత్తం చేసింది. తుంగభద్ర నుంచి కూడా భారీగా వరద వస్తే పెను నష్టం సంభవిస్తుందని.. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహ వేగాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు చేపట్టకపోతే భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

నేడు, రేపు ఈ జిల్లాల్లో అతి భారీ వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం రాష్ట్రంలో శని, ఆదివారాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కొన్ని జిల్లాల్లో భారీ, మరి కొన్ని జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్‌లో.. ఆదివారం ఉమ్మడి ఖమ్మంలో.. అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. సెప్టెంబరు 2, 3 తేదీల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం ఖమ్మం జిల్లాలో ఖమ్మం నగరంతో పాటు పలు మండలాల్లో వర్షం దంచికొట్టింది. బోనకల్లులో అత్యధికంగా 6.92 సెంమీ, మధిరలో 3.44 సెంమీ వర్షపాతం నమోదైంది. జగిత్యాల జిల్లా మేడిపల్లి 8.6, జగిత్యాలలో 8.46 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఆలమట్టి	129.72	122.10	1,75,000	1,75,000
నారాయణపూర్	37.64	31.97	1,85,000	1,78,500
జూరాల	9.657	8.3	3,21,000	3,31,047
తుంగభద్ర	105.79	92.94	31,061	10,444
శ్రీశైలం	215.807	213.882	3,29,203	3,82,112
నాగార్జున సాగర్	312.05	309.057	3,48,024	3,12,097
పులిచింతల	45.77	38.646	2,65,287	3,11,648
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	3,36,169	3,36,169

(గమనిక: నిల్వ టీఎంసీల్లో.. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో)

ఆ 15,000 కోట్లూ గ్రాంటే

- అమరావతి నిర్మాణానికి కేంద్రం సాయం

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన రూ.15,000 కోట్లను గ్రాంటుగా భావించాల్సి ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ చెప్పారు. ఈ రూ.15,000 కోట్లను కేంద్రం విదేశాల నుంచి అప్పుగా తెచ్చి రాష్ట్రానికి ఇస్తుందని తెలిపారు. తిరిగి ఆ అప్పును పూర్తిగా 100 శాతం కేంద్రమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రాష్ట్రంపై ఎలాంటి భారం పడబోదని చెప్పారు. శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... సాధారణంగా విదేశీ అప్పుల్లో 90:10, 70:30, 85:15 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్రం వాటాలుంటాయని, కానీ ఏపీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆ మొత్తం భారాన్ని కేంద్రమే భరిస్తోందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'నికోబార్' భయాలు

దాదాపు డెబ్బైవేల కోట్ల రూపాయల 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్' మళ్ళీ చర్చలోకి వచ్చింది. మాజీ పర్యావరణ మంత్రి జైరామ్ రమేష్‌కీ, ప్రస్తుత మంత్రి భూపేందర్ యాదవ్‌కూ మధ్య ఇటీవల రేగిన వాగ్వాదం పర్యావరణ ప్రేమికులకు మరోమారు ఈ ప్రాజెక్టుమీద తమ భయాలు, అభ్యంతరాలు పంచుకోవడానికి అవకాశం ఇచ్చింది. విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, ఎంత అప్రదిష్టపాల్జేసినా ఈ ప్రాజెక్టు ఆగదని ప్రభుత్వం అంటోంది. ప్రాజెక్టుకు సంబంధించి వివిధ అంశాలపై తన అభ్యంతరాలు తెలియచేస్తూ పర్యావరణమంత్రికి జైరామ్ రమేష్ రాసిన సుదీర్ఘ లేఖలను పాలకులు ఏ విధంగా తీసుకున్నప్పటికీ, పర్యావరణ ప్రేమికులు మాత్రం స్వాగతిస్తున్నారు.

నేషనల్ సెంటర్ ఫర్ సస్టయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీఎస్‌సీఎమ్) తన నివేదికలో ప్రస్తావించిన అంశాలను, ఈ ప్రాజెక్టు ఎట్టిపరిస్థితుల్లోనూ కోస్టల్ రెగ్యులేషన్ జోన్–1ఎ లోపలకు విస్తరించకూడదన్న ఆ హెచ్చరికలను, కార్యక్షేత్రంలో అందుకు పూర్తిభిన్నంగా వ్యవహారం సాగుతున్న విషయాన్నీ రమేష్ తన లేఖలో ప్రస్తావించారు. ప్రాజెక్టు అమలు జరుగుతున్న ప్రాంతాల్లో ఎన్ని పగడపు దీవులున్నాయో, అరుదైన తాబేళ్ళు, పక్షుల సంతానోత్పత్తి స్థావరాలు ఎలా ప్రమాదంలో పడ్డాయో వివరించారు. ఈ కీలకమైన, సున్నితమైన ప్రాంతాల వర్గీకరణల్లోనూ, నిర్వచనాల్లోనూ అత్యున్నతస్థాయి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మార్పుచేర్పులు ప్రజలకు తెలియచేయాల్సి ఉండగా, రక్షణపరంగా కీలకమైన అంశం అంటూ వాటిని దాచిపెడుతున్నారన్నది ఆయన ఆరోపణ. ఈ ప్రాజెక్టులో అధికభాగం ఆర్థిక, వాణిజ్యపరమైనదేనని ఆయన గుర్తుచేస్తున్నారు. ఒకభాగమైన ఓడరేవుకు స్థలాన్ని ఎంపికచేయడంలో కేవలం సాంకేతిక, ఆర్థిక ప్రయోజనాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారని, పర్యావరణాంశాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని నిపుణుల కమిటీ 2021ఏప్రిల్ నివేదికలో వ్యాఖ్యానించిన విషయాన్ని ఆయన గుర్తుచేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఇతర ప్రాంతాల ప్రజల, పర్యాటకుల రాకపోకల వల్ల ఇక్కడి అరుదైన షోంపెన్ తెగలవారి ఉనికికి ముప్పు ఏర్పడటం ఖాయమనీ, స్థానిక ఆదివాసీ తెగల మనోభిప్రాయాన్ని ప్రభుత్వం గౌరవించలేదనీ జైరామ్ రమేష్ చేస్తున్న విమర్శను భూపీందర్ యాదవ్ కొట్టిపారేస్తున్నారు.

ఈ ప్రాజెక్టుకు మీ మంత్రిత్వశాఖ ఇచ్చిన అన్ని అనుమతులనూ రద్దుచేయండి అంటూ పర్యావరణమంత్రికి జైరామ్ రమేష్ రాసినలేఖతో మొదలై, అనేకరోజులుగా సాగుతున్న ఈ వివాదం ఇప్పట్లో ముగిసేట్టు లేదు. రాష్ట్రపతి ఏడాదికాలంలో రెండుసార్లు ఇక్కడకు వెళ్ళిరావడం, రక్షణపరంగా, వ్యూహాత్మకంగా ఈ ద్వీపం మనకు ఎంత ముఖ్యమో సైనికాధికారులనుంచి తెలుసుకోవడం పాలకుల పట్టుదలకు నిదర్శనం. ఇక్కడ ఓ నౌకాస్థావరాన్ని ఏర్పాటు చేస్తే చైనామీద కన్నువేయవచ్చునని, కీలకమైన సముద్ర రవాణామార్గాలను నియంత్రించవచ్చునని భారత ప్రభుత్వం ఆలోచన. వ్యూహాత్మకంగా, రక్షణపరంగా ఈ ప్రాజెక్టు మనకు ఎంతోముఖ్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అత్యధికమేలు అస్మదీయులకేనని విపక్షాల అనుమానం. నికోబార్ ద్వీపంలో పదిహేనుశాతం అటవీప్రాంతాన్ని ప్రభావితం చేసే ప్రాజెక్టు ఇది. లక్షలాదిచెట్లు కూల్చి, మూడువందల హెక్టార్ల మేరకు సముద్రాన్ని మధించి, ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ కంటైనర్ టెర్మినల్, ఒక టౌన్‌షిప్, సౌర విద్యుత్ కేంద్రం అభివృద్ధిచేస్తారు. భారీ నిర్మాణాలకోసం సంవత్సరాల తరబడి డ్రెడ్జింగ్, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్‌లతో ఈ ప్రాంతం దద్దరిల్లబోతున్నది. స్వచ్ఛమైన ఆ నేల, నీరు, గాలి తీవ్రంగా కలుషితం కాబోతున్నాయి. పర్యావరణానికి కానీ, గ్రేట్ నికోబార్‌లో ఉన్న ఏకైక తెగ మనుగడకు కానీ ఏ లోటూ ఉండదన్న ప్రభుత్వం వాదనను పర్యావరణవేత్తలు ఎవరూ నమ్మడం లేదు. పర్యావరణం అంశాన్ని పక్కనబెట్టినా, రెండుదశాబ్దాలక్రితం సునామీ తీవ్రతను అధికంగా చవిచూసిన, భూకంపాలకు పుట్టినిల్లయిన ఈ ప్రదేశంలో ఒక నౌకాస్థావరాన్ని నెలకొల్పడం సరైనదేనా అన్నది ప్రశ్న.

పెన్షన్ చిక్కుల్లో ప్రభుత్వాలు, పార్టీలు

కేంద్రంలోని అధికార పక్షంతో సహా రాజకీయ పార్టీలు, ముఖ్యమంత్రులు ఇప్పుడు ఒక ఉభయ సంకటంలో ఉన్నారు. వారు ఎదుర్కొంటున్న సందిగ్ధత పెన్షన్ (పింఛన్) పథకానికి సంబంధించినది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక కొత్త పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అనే ఆ కొత్త పింఛన్ పథకం వచ్చే ఆర్థిక సంవత్సరం (1, ఏప్రిల్, 2025) నుంచి అమలులోకి వస్తుంది. 'ఇది ఉద్యోగుల గౌరవం, ఆర్థిక భద్రతకు భరోసా ఇచ్చే పథకం' అని ప్రధాని మోదీ అన్నారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఉద్యోగ విరమణ వయసు దాటిన భారత పౌరులు అందరూ పెన్షన్ పొందడం లేదు. ఆ మాటకొస్తే అసలు ఎటువంటి పింఛన్ పొందనివారే దేశ జనాభాలో అత్యధికంగా ఉన్నారు. కారణమేమిటి? ఒక పౌరుడికి అతని వృద్ధాప్యంలో పెన్షన్‌ను ప్రసాదించే సామాజిక భద్రతా సదుపాయం ఏదీ మన దేశంలో లేదు ప్రైవేట్ రంగంలో ఉద్యోగులుగా ఉన్న కోట్లాది పౌరులు ఉద్యోగ విరమణ అనంతరం ఎటువంటి పింఛన్‌కు నోచుకోవడం లేదు. చివరకు దేశ సరిహద్దులను కాపాడే సాయుధ బలగాలలోని స్వల్ప కాలిక సర్వీస్ కమిషన్డ్ అధికారులకు సైతం పెన్షన్ సదుపాయం లేదు.


దేశ ప్రజల సగటు జీవిత కాలం తక్కువగా ఉన్నప్పుడు పెన్షన్ ఒక సమస్య కాలేదు. ఆ సామాజిక భద్రతకు ఎవరూ ప్రాధాన్యమివ్వలేదు. కొద్ది మంది మాత్రమే పెన్షన్ పొందేవారు. ఉద్యోగ విరమణ అనంతరం దీర్ఘకాలం జీవించే వారూ తక్కువే. 1947లో స్వతంత్ర భారతదేశం ఆవిర్భవించినప్పుడు భారతీయుల సగటు జీవితకాలం కేవలం 35 సంవత్సరాలు మాత్రమే. ఇప్పుడు మన సగటు ఆయుర్దాయం 70 సంవత్సరాలకు పై మాటే. ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ చెల్లించాల్సిన బాధ్యత సగటున పది లేదా పన్నెండు సంవత్సరాల దాకా ఉంటుంది. కుటుంబ పెన్షన్ సదుపాయముంటే అతడు/ ఆమె చనిపోయిన తరువాత భార్య/ భర్తకు పెన్షన్ చెల్లించడం తప్పనిసరి అవుతుంది. ఈ కారణంగానే చాలా మంది యజమానులు పెన్షన్ కల్పనకు విముఖత చూపడం కద్దు. అయితే ఉద్యోగులు విధిగా పెన్షన్‌ను కోరుకోవడం కూడా అంతే కద్దు. ఇది అత్యంత సహజం. ఉద్యోగులు పెన్షన్‌ను కోరుకోవడం పూర్తిగా సమర్థనీయం. సుదీర్ఘకాలం, విధేయంగా సేవలు అందించిన తరువాత జీవన భద్రతకు పెన్షన్ అవసరం. పెన్షన్ అనేది వాయిదా వేసిన వేతనం. మరింత స్పష్టంగా చెప్పాలంటే పెన్షన్ ఒక హక్కు. ఈ హక్కు ప్రతి పౌరుడికీ ఉండాలి. విశ్రాంత జీవితంలో గౌరవప్రదంగా, భద్ర భావనతో జీవించేందుకు పెన్షన్ అనేది ఒక సుగమ బాట.

ప్రభుత్వోద్యోగుల విషయంలో 'పెన్షన్ హక్కు' వాదన గెలిచింది. అది సరైన వాదన. కనుక న్యాయమైన తీర్పు. మరి పెన్షన్ హక్కు లేని వారి మాట ఏమిటి? (ఇటువంటి వారే దేశ జనాభాలో అత్యధికంగా ఉన్నారని మనం మరచిపోకూడదు). ఆ ప్రశ్నకు సమాధానం పెన్షన్ హక్కును ఆ అసంఖ్యాక పౌరులకు కూడా కల్పించడమే అని నిస్సంకోచంగా చెప్పి తీరాలి. నిజానికి మన సమాజంలోని అన్ని వర్గాలవారూ ప్రయోజనం పొందేలా ఒక సార్వజనీన పెన్షన్ పథకం ఉండి తీరాలి.

ప్రభుత్వోద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ భరోసా సంపూర్ణంగా, సుస్థిరంగా లభించిన తరువాత స్థిరపడిన తరువాత బీమా చేసిన కనీస పింఛన్ భావన కూడా ప్రభవించి బలపడింది. ఈ భావన ప్రకారం ఉద్యోగ కాలం చివరి సంవత్సరంలో పొందిన మూల వేతనం + కరువు భత్యం (బేసిక్ శాలరీ + డీఏ)లో 50 శాతాన్ని పెన్షన్‌గా చెల్లించేందుకు నిర్ణయం జరిగింది. 2004లో పాత పింఛన్ పథకం (ఓల్డ్ పెన్షన్ స్కీమ్ – ఓపీఎస్) స్థానంలో కొత్త పింఛన్ పథకం (న్యూ పెన్షన్ స్కీమ్ – ఎన్‌పీఎస్) అమలులోకి వచ్చింది. ఈ ఎన్‌పీఎస్, పెన్షన్ సదుపాయం రెండు ఆధారాలకు భంగం కలిగించింది: నాన్ కంట్రిబ్యూటరీ డిఫైన్డ్ బెనిఫిట్ స్కీమ్ (దీని ప్రకారం ఉద్యోగి రిటైర్మెంట్ ప్రయోజనాలకు అవసరమైన మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వమే చెల్లించాలి. ఉద్యోగి ఏమీ చెల్లించనవసరం లేదు)ను పూర్తిగా ఒక డిఫైన్డ్ కంట్రిబ్యూషన్ స్కీమ్ (దీని ప్రకారం పెన్షన్ కోసం ఉద్యోగీ, ప్రభుత్వమూ నిర్దిష్ట మొత్తాలను పెన్షన్‌కై చెల్లించవలసి ఉంటుంది. ప్రావిడెంట్ ఫండ్ మేనేజర్లు ఆ సొమ్మును మదుపు చేసి, వచ్చే రాబడి, పన్ను మినహాయింపుతో ఉద్యోగి పెన్షన్ మొత్తాన్ని నిర్ణయిస్తారు)కు మార్చి వేసింది; కనీస పెన్షన్ భావనను ఎన్‌పీఎస్ పూర్తిగా త్యజించింది.

ఎన్‌పీఎస్‌ను మరింత సులభరీతిలో వివరిస్తాను: ఎన్‌పీఎస్‌లో ఉద్యోగులు తమ మూలవేతనంలో 10 శాతాన్ని పెన్షన్ కోసం చెల్లిస్తారు. ప్రభుత్వం కూడా తన వంతుగా 10 శాతం మొత్తాన్ని జమ చేస్తుంది. ఇలా జమ చేసిన డబ్బుతో ప్రభుత్వం ఎంపిక చేసిన బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలకు చెందిన ఫండ్ మేనేజర్లు వివిధ మార్గాల్లో మదుపు చేస్తారు. ఆ మదుపుల ద్వారా వచ్చే రాబడి ఒక్కోసారి ఒక్కో విధంగా ఉంటుంది. ఇంత రాబడి వస్తుందనే భరోసా ఉండదు. ఈ కారణంగానే ఉద్యోగులు ఎన్‌పీఎస్‌ను వ్యతిరేకించారు. పెద్ద ఎత్తున నిరసనలు ప్రజ్వరిల్లాయి. నాటి ప్రధాని వాజపేయి ఉద్యోగుల ఒత్తిడికి లొంగలేదు. ఆయన తరువాత ప్రధానమంత్రి అయిన మన్మోహన్‌సింగ్ కూడా ఎన్‌పీఎస్ అమలుకే కట్టుబడి ఉన్నారు. పది సంవత్సరాల పాటు ఉద్యోగుల డిమాండ్‌ను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ వచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ సైతం పది సంవత్సరాల పాటు ఉద్యోగుల డిమాండ్‌కు ససేమిరా అంటూ వచ్చారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. మోదీ ప్రభుత్వం యూపీఎస్‌ను తీసుకువచ్చింది.

ఆగస్టు 3, 2022న ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఖ్య 69,76,240. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో వీరికి పింఛన్లు చెల్లించేందుకు బడ్జెట్ పరమైన వ్యయం రూ.2,43,296 కోట్లు. మీడియా వార్తల ప్రకారం మార్చి 2023 నాటికి ఎన్‌పీఎస్‌లో 23.8 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు, 60.7 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. 2024లో వీరి సంఖ్య కొంచెం అటూ ఇటూగా ఉండవచ్చు. అయితే దేశ జనాభాలో వీరి సంఖ్య చాలా చాలా స్వల్పమనేది ఒక సునిశ్చిత వాస్తవం.



యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించే ముందు రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రతింపులు జరిపారా? ఉద్యోగుల సంఘాలూ సంప్రదింపుల్లో పాల్గొన్నాయా? ఎన్‌పీఎస్, యూపీఎస్ ఉభయ సంకటం నుంచి ప్రభుత్వాలు, రాజకీయపక్షాలు ఎలా బయటపడనున్నాయి? పెన్షనర్లకు ఆర్థిక భద్రత ఏ ఏరకు సమకూరనున్నది?

నిధులు సమకూర్చని పెన్షన్ పథకం (అన్‌ఫండెడ్ పెన్షన్ స్కీమ్)తో సమస్యేమిటంటే అది ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించే ప్రమాదమున్నది. పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) అలాంటి పథకమే. ప్రభుత్వాలు ఉద్యోగి రిటైర్ అయినప్పుడు అతనికి దక్కవలసిన రిటైర్‌మెంట్ ప్రయోజనాలను కరెంట్ రెవెన్యూ రాబడి నుంచి చెల్లించలేవు. 'పే యాజ్ యు గో' రీతిలో చెల్లించడం అసాధ్యం. అందుకు నిధులు సమకూర్చడం అత్యవసరం. ఎవరు సమకూర్చాలి? ప్రభుత్వం సమకూర్చాలి. లేదంటే ఉద్యోగులు సమకూర్చాలి. లేదా ప్రభుత్వమూ ఉద్యోగులూ ఇరువురూ సమకూర్చాలి. ప్రభుత్వమూ, ఉద్యోగులూ నిధులు సమకూర్చే పెన్షన్ పథకమే ఎన్‌పీఎస్. ఈ కొత్త పెన్షన్ పథకానికి ప్రభుత్వం తన వాటాగా 14 శాతాన్ని, ఉద్యోగి తన వాటాగా 10 శాతాన్ని సమకూరుస్తున్నారు. 'నిధులు సమకూర్చడమనేది భద్రమైన ఆర్థిక వ్యవహారం.

యూపీఎస్ పెన్షనర్లకు ఆర్థిక భద్రత సమకూరుస్తుందని మోదీ ప్రభుత్వం ఘంటాపథంగా చెప్పుతోంది. ఈ పథకానికి ఉద్యోగులు చెల్లించే వాటా (10 శాతం) యథావిధిగా ఉంటుంది. ప్రభుత్వ వాటా 18.5 శాతానికి పెరుగుతుంది. కనీస పెన్షన్ చెల్లింపునకు యూపీఎస్ హామీపడుతోంది. 25 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసినవారు రిటైర్ అయ్యే ముందు 12 నెలలపాటు తీసుకున్న సగటు మూల వేతనంలో 50 శాతాన్ని కనీస పెన్షన్‌గా నిర్ణయిస్తారు. హీనపక్షం నెలకు రూ.10 వేలు పెన్షన్‌గా లభించే అవకాశం ఉన్నది.

ఈ వ్యాసం రాస్తున్న సమయానికి చాలా రాష్ట్ర ప్రభుత్వాలు యూపీఎస్‌పై తమ వైఖరి ఏమిటో వెల్లడించలేదు. అసలు ఎలాంటి ప్రకటనలు చేయలేదు. కాంగ్రెస్‌తో సహా ప్రధాన రాజకీయ పక్షాలు యూపీఎస్‌పై తర్జనభర్జనలు చేస్తున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాలు అనేకం పెన్షన్ నిధికి ఉద్యోగుల విధిగా తమ వాటాను చెల్లించవలసిన నిబంధనను వ్యతిరేకిస్తున్నాయి.

ప్రభుత్వాలు, రాజకీయ పక్షాలు, ఉద్యోగుల సంఘాలు పరిపూర్ణ సందిగ్ధావస్థలో ఉన్నాయి కోశ సంబంధ దృక్కోణం నుంచి మాట్లాడితే యూపీఎస్‌ను తిరస్కరించవలసిన అవసరం లేదు అయితే కొన్ని ప్రశ్నలు : ప్రస్తుతం పెన్షన్ నిధికి ప్రభుత్వ, ఉద్యోగుల వాటా మధ్య ఉన్న 8.5 శాతం వ్యత్యాసం భవిష్యత్తులో మరింతగా పెరుగుతుందా?; 'లోటును ప్రభుత్వం భర్తీ చేస్తుందని ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి టి.వి. సోమనాథన్ (ఈయనే యూపీఎస్‌ను సిఫారసు చేసిన కమిటీకి నేతృత్వం వహించారు) ఇది ఇంచుమించు 'పే యాజ్ యు గో' వంటి పరిస్థితిని ప్రభుత్వానికి కల్పించదా?; 10+10 వాటాల మొత్తాన్ని మదుపు చేసే బాధ్యతను ఆమోదం పొందిన పెన్షన్ ఫండ్ మేనేజర్లకు అప్పగిస్తూ 8.5 శాతం ప్రభుత్వ కంట్రిబ్యూషన్ మొత్తాన్ని ఎవరు ఎక్కడ మదుపు చేస్తారు?; యూపీఎస్ అమలుకు తొలి సంవత్సరానికి గాను అదనంగా ఇచ్చిన రూ.6,250 కోట్లు చాలా తక్కువగా కనిపిస్తోంది. ఇది నిజంకాదా?; కొత్త పెన్షన్ పథకాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించే ముందు రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రతించారా? ఉద్యోగుల సంఘాలూ ఆ సంప్రదింపుల్లో పాల్గొన్నాయా? ఎన్‌పీఎస్, యూపీఎస్ ఉభయ సంకటం నుంచి ప్రభుత్వాలు, రాజకీయపక్షాలు ఎలా బయటపడనున్నాయి? పెన్షనర్లకు ఆర్థిక భద్రత ఏ మేరకు సమకూరనున్నది?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,

విగ్రహాల ఏర్పాటులో ఔచిత్యం ఉండొద్దూ?

ఈ మధ్య చాలామంది గొప్ప తెలుగువారు చనిపోయారు. వారంతా ప్రజల హృదయాలలో జీవిస్తున్నవారే. రచయితలు, భాషావేత్తలు, నృత్య గురువులు, చిత్రకారులు, రాజకీయ నాయకులు... ఇలా వీరంతా సమాజాన్ని ప్రేమించినవారు, సమాజంలో సాంస్కృతిక చైతన్యం, అభ్యుదయ పరంపర అన్ని దిశలకూ వ్యాపించాలని తమజీవితకాలంలో ఘనమైన కృషిచేసినవారనడంలో సందేహంలేదు.

వారంతా వారి వారి రంగాలలో ఎంతో పేరొందినవారు, సంఘానికి ఎన్నో సేవలందించినవారు. ఎన్నో విషయాలలో ఎంతోమందికి మార్గదర్శకులు. గురజాడ వారన్నట్టు స్వంత లాభం కొంత మానుకొని పరుల మేలుకు పాటుపడినవారు.

పుట్టినాక చనిపోవడం ఎలాగూ తప్పదు. చనిపోయిన వాళ్లలో మంచివారూ ఉంటారు, చెడ్డవారూ ఉంటారు, అయినవారూ ఉంటారు, కానివారూ ఉంటారు. చనిపోయిన వారి విగ్రహాలు నెలకొల్పునపుడు ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో, సంఘానికి వారు చేసిందేమిటో బేరీజు వేసుకొని విగ్రహాలు నెలకొల్పాలి కాని ఎవరికిష్టమైనట్లు వారు, ఏ పార్టీకి ఇష్టమైతే ఆ పార్టీ వారివి, అధికారాన్ని ఆసరాగా తీసుకొని నెలకొల్పడం ఎంతమాత్రం సమంజసం కాదు.

ఒక విగ్రహాన్ని నెలకొల్పడానికి అతడేమి చేశాడన్నది కారణం కావాలి కాని అతడేమయినాడన్నది కారణం కాకూడదు. ఒకడు పదేపదే శాసనసభ్యుడు కావచ్చు, మంత్రి కావచ్చు, ముఖ్యమంత్రి కావచ్చు, మరేమైనా కావచ్చు. అదే విధంగా అలాంటివారు రాజకీయరంగంలోనే కాక మరోరంగంలో కూడా ఉండవచ్చు. విగ్రహావిష్కరణకు కారణం సంఘసేవ కావాలి కాని, స్వసేవ మాత్రమే కాకూడదు కదా?

విగ్రహాలు నెలకొల్పుటకు ఆయా రంగాలకు చెందిన సుప్రసిద్ధులతో కొన్ని కమిటీలు వేయాలి. ఎవరి విగ్రహాలైతే పెట్టాలని అనుకుంటారో వారి బయోడేటా ఆ కమిటీ సభ్యులకు అందజేయాలి. ఆ కమిటీవారు సచ్ఛీలురను, సమర్థులను ఎంపిక చేసి సమర్పించాలి. వారినుండి ప్రభుత్వం ఎంపిక చేయాలి. ఆ ఎంపిక చేసినవారిని రాష్ట్ర శాసనసభ లేక కేంద్ర పార్లమెంటు ఆమోదించాలి. అలా ఆమోదించినవారి విగ్రహాలు మాత్రమే నెలకొల్పాలి. అప్పుడది రాజ్యాంగబద్ధమౌతుంది. అందువలన వాటిని ఇష్టానుసారం మార్చడానికి కాని, పాడుచేయడానికి కానీ వీలుండదు.

అలా నెలకొల్పని వాటికి శాసనపరమైన, పరిపాలనాపరమైన రక్షణ కాని, స్థిరత్వం కానీ ఉండదు. అందువలన అలా నెలకొల్పినవి పరిహాసాలపాలయ్యే అవకాశముంటుంది. అలా పరిహాసాలపాలయిన ఉదాహరణలు మనకు ఎన్నో కనిపిస్తాయి.

ఎవరిష్టానుసారం వారు విగ్రహాలు నెలకొల్పితే, మార్చితే ఎలా? సంఘం సరే అనాలి కదా! విగ్రహాలు నెలకొల్పుటకు కూడా అర్హతలుండాలి. ఆయా రంగాలకు చెందిన అర్హులు ఆయా రంగాల కొరకే ఎంపిక చేయబడాలి కాని మరో రంగాలకు కాదు. ఇప్పుడు రాష్ట్రస్థాయి, దేశస్థాయి పద్మ అవార్డులకు, తదితర అవార్డులకు ఒక పద్ధతిగ ఎంపిక చేస్తున్నారు కదా! అలాగే స్థాయిలను బట్టి విగ్రహాలను ఎంపిక చేయాలి. విగ్రహాలను మార్చుటకు వీలుకాకుండా, పాడుచేయకుండా నియమాలు రూపొందించాలి.

ఈ సందర్భంగా ఒక్క ఉదాహరణ తీసుకుందాం. ప్రత్యేక తెలంగాణ కొరకు ఎన్నో ఏళ్లు, ఎంతోమంది కృషి చేశారు. ఎంతోమంది ఎన్నో త్యాగాలు చేశారు, చనిపోయారు. చనిపోయినవారి విగ్రహాలు పెట్టడం సమంజసమే. అలాగే ఉద్యమాన్ని తగు స్థాయిలో నడిపినవారి విగ్రహాలు పెట్టడం కూడా.

ఇప్పుడు 'తెలంగాణ తల్లి' విగ్రహం ఒకటి పెట్టాలనుకుంటున్నారు. ఈ తల్లి ఎవరు? నన్నడిగితే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఎవరయితే ఫైరింగ్‌లో ప్రాణాలు కోల్పోయారో వారు కావాలి దానికి అర్హులు. తొలినాటి ఉద్యమంలో ఒక సిటీ కాలేజ్ విద్యార్థిని బుల్లెటుకు గురయి చనిపోయింది. వాస్తవానికి ఆమె విగ్రహమే పెట్టాలి. మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి చనిపోయాడు. ఆయన విగ్రహం పెట్టాలి. ఇంకా ఎంతోమంది చనిపోయారు కాని వారందరి విగ్రహాలు పెట్టలేం కదా!

ఒకప్పటి ఫ్రాన్స్ దేశపు చాలా గొప్ప ఉద్యమాలలో ఎంతోమంది పనిచేశారు, చనిపోయారు. కాని ఒక్క 'జోన్ ఆఫ్ ఆర్క్' విగ్రహాన్ని మాత్రమే నెలకొల్పారు, ఆమె త్యాగం అత్యున్నత త్యాగం కనుక. అలా మనం కూడా చేయాలి. లేకపోతే లెక్కలేనన్ని విగ్రహాలు నెలకొల్పడం కుదరదు, సమంజసంగా ఉండదు.

ఒక మ్యూజియం లాంటిది ఏర్పరచి దానిలో చాలామంది త్యాగాలు చేసినవారి, మరణించిన వారి విగ్రహాలు పెట్టవచ్చును. అది అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. వీధుల్లో విగ్రహాలు నెలకొల్పితే వాటి రక్షణ సంరక్షణలు కష్టం. అది ఇప్పుడు కనబడుతూనే ఉంది. నన్నడిగితే వీధులలో విగ్రహాలు నెలకొల్పడం మానుకొని మ్యూజియంలో పెట్టడమే ఉత్తమం. అలాగే విద్యారంగాలలో త్యాగాలు చేసిన వారి విగ్రహాలు విద్యాలయాలలో, వినోదరంగాలలో విజయాలు సాధించిన వారి విగ్రహాలు వినోదాలయాలలో, తక్కిన రంగాలవారివి ఆయా రంగాలకు చెందిన వాటిలో పెట్టవచ్చును. అలాగే పెట్టాలి కూడా.

ఇప్పుడు ఆలోచిస్తున్నట్లు రాష్ట్ర అసెంబ్లీ ముందర కూడా పెట్టదలచుకుంటే అదనంగా పెట్టవచ్చు.

– డా. వెలిచాల కొండలరావు
పూర్వ సంచాలకులు, తెలుగు అకాడమి

కెకె (కె. కనకాచారి) స్మారక ఉపన్యాసాలు

సమసమాజ స్వప్నాలతో మన సామాజిక, వృత్తిపర, ఉద్యమ ఆచరణను ప్రభావితం చేసిన మనిషి కె.కనకాచారి. ఆయన స్మారకంగా కె.కె.మెమోరియల్ ట్రస్టు ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఈ సంవత్సరం భారత జాతీయోద్యమంలో ముస్లింల పాత్రను, కేంద్రం తెచ్చిన నూతన న్యాయచట్టాల పర్యవసానాలను చర్చించనున్నాం. సెప్టెంబరు 1 ఆదివారం నాడు, మహబూబ్‌నగర్ టీఎన్‌జీవో భవన్‌లో ఉదయం 10గంటలకు కార్యక్రమం ఆరంభమవుతుంది. మొదటి సెషన్‌లో 'భారత జాతీయోద్యమంలో తెలంగాణ ముస్లింయోధుల కృషి–నశీర్ అహమద్ రచనల పరిశీలనతో' అంశంమీద న్యాయవాది జహరా, సామాజిక కార్యకర్త ఖలీదా పర్వీన్ మాట్లాడతారు. కె.వామన్‌కుమార్, డి. నర్సయ్య అధ్యక్షత వహిస్తారు. ప్రొ. జి.హరగోపాల్ అధ్యక్షతన జరిగే రెండోసెషన్‌లో '2023 భారత న్యాయచట్టాలు–పర్యవసానాలు' అంశంపై 'వీక్షణం' సంపాదకులు ఎన్.వేణుగోపాల్ ప్రసంగిస్తారు.

– కె.కె.మెమోరియల్ ట్రస్ట్

నైపుణ్యానికి నెలవుకానున్న తెలంగాణ

తెలంగాణ శాసనసభలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ ఆఫ్ తెలంగాణ' బిల్లును ఆమోదించి, దానికి ప్రఖ్యాత వాణిజ్యవేత్త ఆనంద్ మహీంద్రాను చైర్మన్‌గా నియమించి మన రాష్ట్ర యువత భవిష్యత్తుకు సుస్థిరమైన రూట్ మ్యాపుని నిర్దేశించింది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం. వేల కోట్ల విలువైన ముచ్చర్లలో 50 ఎకరాల సువిశాల ప్రాంగణంలో భూమి పూజ నిర్వహించుకుని, ఇదే ఏడాది ఆరు కోర్సులు ప్రారంభించుకున్న ఈ స్కిల్ యూనివర్శిటీ ద్వారా ప్రతీ రంగం కొత్త సాంకేతికతతో సరికొత్త పుంతలు తొక్కుతుంది.



ఉద్యోగాలు ఇచ్చే ఇండస్ట్రీలకు, అటు చదువులు నేర్పే విద్యాలయాలకు ఉన్న అంతరం తొలగిపోవాలి. డిగ్రీల కోసం వర్సిటీలు కాదు, అవి ఉద్యోగ కల్పనకు కేంద్రాలు కావాలి. ఈ దిశగానే 'యంగ్ ఇండియా సిల్క్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ' కృషి చేస్తుందనే ప్రగాఢ విశ్వాసాన్ని తెలంగాణ యువతలో కల్పిస్తున్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.

స్కిల్ యూనివర్శిటీ బిల్లును ప్రవేశపెడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు ప్రస్తావించినట్టుగా– ఇటు ఉద్యోగాలు ఇచ్చే ఇండ[illegible]లకు, అటు చదువులు నేర్పే విద్యాలయాలకు ఉన్న అంతరం తొలగిపోవాలి. డిగ్రీల కోసం వర్సిటీలు కాదు, అవి ఉద్యోగ కల్పనకు కేంద్రాలు కావాలి. ఈ దిశగానే మన అసెంబ్లీ ఆమోదించిన 'యంగ్ ఇండియా సిల్క్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ' కృషి చేస్తుందనే ప్రగాడ విశ్వాసాన్ని తెలంగాణ యువతలో కల్పిస్తున్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.

మహాత్మాగాంధీ నడిపిన 'యంగ్ ఇండియా' పత్రికే స్ఫూర్తిగా స్కిల్ యూనివర్శిటీ పేరును పెట్టడం ఆ స్ఫూర్తిని మనలో రగిలిస్తుందనేది అక్షర సత్యం. అసలు కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల, బడుగు బలహీనవర్గాల పక్షపాతి అన్న సత్యాలను నాటి జవహర్‌లాల్ నెహ్రూ మొదలు నేటి తెలంగాణ ప్రభుత్వం వరకూ నిరూపిస్తూనే ఉంది. మనతో పాటే స్వాతంత్ర్యం పొందిన దేశాలు సామాజికం, ఆర్థికం అనే తేడా లేకుండా అన్నింట్లో వెనుకబడుతుంటే ఈ సువిశాల భారతదేశం మాత్రం తనదైన రీతిలో ముందుకు వెళ్లడం వెనుకాల ఉన్నది నాటి బలమైన పునాదులే. నాడు పంచవర్ష ప్రణాళికలు తీసుకువచ్చి వ్యవసాయం, విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇందిరాగాంధీ చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇచ్చి ప్రోత్సహించారు. రాజీవ్‌గాంధీ దేశానికి సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రపంచంతో పోటీపడే అవకాశాల్ని మన యువతకు అందించారు. హైదరాబాద్‌లో ఐటీ రంగ అభివృద్ధికి సైతం పునాదులు వేసింది ఆనాడు రాజీవ్‌గాంధీ హయాంలోని ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వమనేది ఈ సందర్భంగా మరోసారి గుర్తుచేసుకోవాలి. ఆ స్ఫూర్తితోనే నేడు రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేయడం, అందులో ఉద్యోగాలు కల్పిస్తున్న ఇండ[illegible]ను భాగస్వామ్యం చేయడం, నేటి కాలానికి ఏం కావాలో అందించడం మరింత సంతోషాన్ని కలిగిస్తుంది.

ఈ ఒరవడి చూస్తుంటే ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక సమాజంలో కనిపిస్తున్న స్పష్టమైన మార్పు ఏమిటో మరోసారి మనకు అవగతమౌతుంది, గతంలో కొద్దిమంది కోసం యూనివర్సిటీలు ధారాదత్తం చేసిన మాదిరిగా కాకుండా పీపీపీ మోడ్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ యూనివర్శిటీ ఏర్పాటు, అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల మాదిరిగా ఇందులోనూ రిజర్వేషన్ల అమలు, ఫీజులు సైతం సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా నిర్ణయించడం, ముఖ్యంగా ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు, ఇండ[illegible]నుంచి పారితోషికం రూపంలో విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందజేయడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద కవర్ కాని వారికి ఫీజు తగ్గించే అంశాన్ని సైతం ప్రభుత్వం పరిశీలించడం గొప్ప నిర్ణయం. యంగ్ ఇండియా యూనివర్సిటీలో 17 కోర్సులను నిర్వహిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

బిల్డింగులు కట్టడం కోసమనో, మౌలిక వసతులు సమకూర్చడానికనో ఏళ్లకు ఏళ్లు వృథా చేయకుండా ఈ విద్యా సంవత్సరం నుంచే ఆనంద్ మహీంద్రాను చైర్మన్‌గా ఒప్పించి, 2000 మందికి ఈకామర్స్ లాజిస్టిక్, బిఎఫ్ఎస్ఐ, కన్‌స్ట్రక్షన్, ఫార్మా, రిటైల్, ఆనిమేషన్ వంటి ఆరు కోర్సులను తాత్కాలికంగా నిర్వహించాలని నిర్ణయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీలో మూడేళ్ల పైబడి డిగ్రీ, ఏడాది నుండి రెండేళ్ల కాలవ్యవధితో కూడిన డిప్లమాతో పాటు మూడు నుంచి ఆరునెలల సర్టిఫికెట్ కోర్సులను సైతం విద్యార్థి, ఇండ[illegible] అవసరాలకు అనుగుణంగా అత్యుత్తమ ఫ్యాకల్టీలతో అందజేస్తామని చెప్పడం, ఎస్బీఐ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ కోర్సులకు ట్రైనింగ్, ఫార్మా విద్యార్థులకు ప్రతిష్ఠాత్మక రెడ్డీ ల్యాబ్స్ ద్వారా శిక్షణ ఇవ్వనుండటం, ట్రైనింగ్ తర్వాత ఆయా సంస్థల్లోనే విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామనడం, ఇంకా ఫ్లిప్‌కార్ట్, జీఎంఆర్, అపోలో, హెచ్ఎస్‌బీసీ వంటి ఎన్నో ప్రపంచస్థాయి కంపెనీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకొని పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌తో స్కిల్ యూనివర్శిటీ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే స్పష్టమైన రూట్ మ్యాప్‌తో తెలంగాణ ప్రభుత్వం సర్వసన్నద్ధం కావడం శుభపరిణామం.

నాడు రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన సాంకేతిక విప్లవంతో ప్రపంచంలో ప్రతీ పదిమంది భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలో నలుగురు మనవారే కావడం ఇప్పటివరకూ సాధించిన ప్రగతి ఐతే, రాబోయే రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ ద్వారా తెలంగాణ నుంచి వివిధ వృత్తి నిపుణులు ప్రపంచ నలుదిశల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొని మన ఖ్యాతిని సుస్థిరం చేస్తారన్న నమ్మకం ఉంది.

● బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి
సీఈవో, టీశాట్ నెట్‌వర్క్,
అధ్యక్షుడు, తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక

సెలెబ్రిటీలూ.. స్పందించండి!

చట్టాలు చుట్టాలై, మాట చెల్లినంత కాలం టాలీవుడ్ స్టార్ నాగార్జున గొంతు బయటకు వినపడలేదు. హైడ్రా చట్ట పరిధిలో 'ఎన్ కన్వెన్షన్' గోడలు బద్దలు కాగానే ఆయనకు కోపం వచ్చింది. 'స్టే' ఉన్న సందర్భంలో కూల్చివేతలు తగవని నాగార్జున తరఫున ఓ ప్రకటన వచ్చింది. తప్పు జరిగి వుంటే, తమకు చెప్పి ఉంటే, తామే అక్రమ కట్టడాన్ని కూల్చివుండేవారమని కూడా ప్రకటించారు. అదే నిజమైతే ఇంతకుముందు ప్రభుత్వాలు చెరువు ఆక్రమణకు గురైందని అందులో అక్రమంగా కట్టడాలు తప్పని నోటీసులు ఇచ్చినప్పుడు కోర్టు దాకా వెళ్లి స్టే ఎందుకు తెచ్చుకున్నట్టు?

సాంకేతికంగా చూస్తే తప్పు జరిగిందో లేదో తేల్చడానికి ప్రభుత్వ విభాగాలు, కోర్టులు ఉన్నాయి. అందుకే ఆ జోలికి వెళ్లడంలేదు కానీ ఇలాంటి కొందరు సెలబ్రిటీల వ్యవహార శైలి మాత్రం ఖచ్చితంగా వందకు వందశాతం స్వార్థపూరితమే! తాను చేసిన తప్పు బయటపడగానే వెంటవెంటనే రెండేసి ప్రకటనలు ఇచ్చి వ్యవస్థలు, జర్నలిస్టులు, అభిమానుల సహకారం కోరిన నాగార్జున ఇంతకు ముందెన్నడూ ప్రజల భావోద్వేగాలని, కష్టాల్ని, ఇబ్బందుల్ని గురించి ఒక్కసారైనా మాట్లాడిన సందర్భం లేదు. అందుకేనేమో ఇప్పుడు ఆయన బహిరంగ ప్రకటనలు చేస్తున్నప్పటికీ చివరకు అక్కినేని అభిమానులు కూడా ఆయనకు మద్దతుగా మాట్లాడడం లేదు. తప్పు జరిగిందని వారు కూడా నమ్ముతున్నారు. ఇక ఆయనతో పదేళ్లపాటు అంట కాగిన బీఆర్ఎస్ నాయకులు సైతం తమ ఇంట్లో మురికి కడుక్కోవడం మీద దృష్టి పెట్టారు తప్ప ఈయనకు అనుకూలంగా నోరు తెరిచే సాహసం చేయడం లేదు. ఎందుకంటే జరిగిందేమిటో, జరుగుతున్నదేమిటో, జరగబోయేదేమిటో కూడా వారికి బాగా అర్థమవుతోంది.



కొందరు హీరోలు తాము అందరికీ అతీతం అన్న భ్రమలో బతుకుతున్నారు. మనిషి సంఘజీవి అనే కనీసమైన అంశం వీళ్ళు ఎప్పుడో మర్చిపోయారు. మనం నివసించే భూమాత, చుట్టూ ఉండే సమాజం బాగుంటేనే, అందులో భాగమైన తాము కూడా హాయిగా ఉంటామన్నది జగమెరిగిన సత్యం. అయితే సమాజం కన్నా ఆర్థికంగా కాసింత ఎత్తులో ఉన్నంత మాత్రాన అన్ని సూత్రాలు తమకు అనుకూలంగా ఉండాలనుకోవడం తప్పు. తెలిసి తెలిసీ ఆ తప్పు చేస్తున్నారు కొందరు సెలబ్రిటీలు.

నాగార్జునతో పాటు కొందరు హీరోలు తాము అందరికీ అతీతం అన్న భ్రమలో బతుకుతున్నారు. మనిషి సంఘజీవి అనే కనీసమైన అంశం వీళ్ళు ఎప్పుడో మర్చిపోయారు. మనం నివసించే భూమాత, చుట్టూ ఉండే సమాజం బాగుంటేనే, అందులో భాగమైన తాము కూడా హాయిగా వుంటామన్నది జగమెరిగిన సత్యం. అయితే సమాజం కన్నా ఆర్థికంగా కాసింత ఎత్తులో ఉన్నంత మాత్రాన అన్ని సూత్రాలు తమకు అనుకూలంగా ఉండాలనుకోవడం తప్పు. తెలిసి తెలిసీ ఆ తప్పు చేస్తున్నారు కొందరు సెలబ్రిటీలు. వారు ఏ సమాజాన్ని అయితే చిన్నచూపు చూస్తున్నారో ఆ సమాజం మాత్రం వారిని కచ్చితంగా అంచనా వేస్తోంది. ఇందుకు ఉదాహరణ ఒకటి చెప్పాలి. నాగార్జున కుమారుడు నాగచైతన్య, శోభిత ఎంగేజ్‌మెంట్ తర్వాత వీరి వైవాహిక జీవితం బాగోదని జోస్యం చెప్పిన వేణుస్వామి మీద యావత్ సమాజం, మీడియా విరుచుకుపడింది. తమ సొంత ఇంటి మనిషిని అన్నంత స్థాయిలో ఈ సమాజం ప్రతిస్పందించింది. అదే సమయంలో ఎన్ కన్వెన్షన్ కూల్చివేత అంశంలో ప్రభుత్వ వైఖరిని ఏ ఒక్కరూ బహిరంగంగా తప్పు పట్టడం లేదు. ఈ ఒక్క విషయం చాలు ఈ సమాజం ఎంత విచక్షణాయుతంగా వ్యవహరిస్తుందో చెప్పడానికి. దాన్ని తక్కువ అంచనా వేస్తున్న వాళ్లే ఈ విషయంలో విచక్షణ లేకుండా స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచిన సమయంలో హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి ఒక్క సానుభూతి ప్రకటన రాలేదు. సరే, వారి మూలాలు ఆంధ్రలో ఉన్నాయి అనుకుందాం. అప్పట్లో జరిగిన సమైక్యాంధ్రకు అనుకూలంగా కూడా ఒక్క మాట మాట్లాడలేదు. వందలమంది యువకులు ఆత్మాహుతి అయినా నోరు మెదపలేదు. కనీసం ఆత్మార్పణ వద్దన్న పిలుపు కూడా ఇవ్వలేకపోయారు ఈ సెలబ్రిటీలు. పక్క మనిషి బాధ, ఆవేదన పట్టని ఈ హీరోలకి తమిళనాడు చిత్ర పరిశ్రమతో పాఠాలు చెప్పించాలి. 'నీట్' పరీక్షలతోపాటు జల్లికట్టు వంటి అంశాలపై వివాదం రేగినప్పుడు ప్రజల భావోద్వేగాలకు మద్దతుగా బహిరంగ ప్రకటనలు ఇవ్వడమే కాదు, తమిళనాట పెద్దపెద్ద హీరోలు సభలూ సమావేశాలు కూడా నిర్వహించారు. ఇక కావేరి జల వివాదం వచ్చినప్పుడు మధ్యేమార్గంగా మాట్లాడిన సూపర్ స్టార్ రజనీకాంత్‌ను తప్పుపట్టడానికి సైతం తమిళ నటీనటులు ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. ఇప్పుడు రాజకీయ పార్టీ పెట్టబోతున్న తమిళ హీరో విజయ్ గతంలో ఎన్నో సందర్భాల్లో ప్రజాసమస్యలపై స్పందించి ఆయా ప్రభుత్వాల నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేగాని ప్రజల కోసం మాట్లాడడం ఆపలేదు.

తమిళ చిత్ర పరిశ్రమల వలే ప్రభుత్వాల మీద గళం ఎత్తలేకపోయినప్పటికీ చాలామంది తెలుగు హీరోలు తమ స్థాయిలో ప్రజలకు సేవ చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా, బాలకృష్ణ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా ఎన్నో విధాలుగా సేవలందించారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఎందరో పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయించారు. మంచులక్ష్మి ఓ మహిళ అయినా విద్యారంగంలో తన వంతు సాయం చేయడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నారు. విద్య అవసరాన్ని గుర్తెరిగి అడుగులేస్తున్నారు. ఇక పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై స్పందించి తీవ్ర విమర్శలు, ఇబ్బందుల మధ్య కూడా తన వంతు సామాజిక బాధ్యత నెరవేర్చడానికి చేసిన ప్రయత్నం కళ్ళ ముందు కనబడుతూనే వుంది. ఇలా తెలిసి కొందరు, తెలియకుండా కొందరు తమ వంతుగా ప్రజలకు సేవ చేస్తున్నారు. వాళ్ళందరికీ శతకోటి వందనాలు. తమకు వస్తే కష్టం, ఇతరుల ఇబ్బంది చేతగానితనం అనుకునే సెలబ్రిటీలారా ఇకనైనా మారండి. ప్రజల భావోద్వేగాల మీద కోట్లు సంపాదిస్తున్న మీరు, వారి భావోద్వేగాలకు కనీస విలువ ఇవ్వండి. తాము చట్టాలకు, సమాజానికి అతీతం అనుకునే భ్రమ నుంచి బయటపడండి. లేదంటే ఇదే సమాజం, కాలం తమ పని తాము చేస్తూ పోతాయి. కాల ప్రవాహంలో నిజాలు నిగ్గుదేలుతాయి. అవినీతి, అక్రమ కోటలు బద్దలవుతాయి.

■ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
శాసనసభ్యులు, మహబూబ్‌నగర్



శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 కనిష్ఠం 22.7

డాన్‌గా ఎదగాలనే
తుపాకీ కొన్నా..
● గాజులరామారం కాల్పుల నిందితుడు నరేశ్
- ఆయన సహా 15 మంది అరెస్ట్

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం
32 ఎకరాల్లో..
● ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్డు కనెక్టివిటీ
● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

8

● వెలుగులోకి అక్రమ నిర్మాణాల లెక్కలు
● జలాశయాల్లో భవనాలు
● కూల్చివేతకు సిద్ధమవుతున్న అధికారులు
● రెవెన్యూ శాఖ నోటీసులతో నిర్మాణదారులు ఉక్కిరిబిక్కిరి
● మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని వేడుకుంటున్న పేదలు

సాగు, తాగునీటి అవసరాలను తీర్చే చెరువులను కొందరు అక్రమార్కులు చెరపట్టారు. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల నిమిత్తం బడావ్యక్తులు, వెంచర్ల కోసం బిల్డర్లు, ఆవాసం కోసం పేదలు.. ఇలా ఎవరికి తోచిన విధంగా వారు చెరువులను పూడ్చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో భారీ భవంతులు కట్టారు. కళాశాలలు, ఫంక్షన్ హాళ్లు నిర్మించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మహానగరంలోని 12 చెరువుల్లో భారీ భవనాలతో పాటు చిన్నాచితక నిర్మాణాలు 887 వరకు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వాటికి సంబంధించి నోటీసులు జారీ చేస్తున్నారు.



చినదామెర చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కళాశాల భవనాలు

12 చెరువులు.. 887 నిర్మాణాలు

హైదరాబాద్ సిటీ న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇక్కడ ఒక చెరువు ఉండేదని పెద్దలు.. తమ ఇళ్లలో పిల్లలకు చెప్పుకునే పరిస్థితి వచ్చేలా ఆక్రమణలకు గురయ్యాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 12 చెరువుల ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్లలోని నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే, నిర్మాణాల్లో బడాబాబులతో పాటు పేదల నివాసాలు కూడా ఉన్నాయి. దీంతో ఏళ్ల తరబడి నివాసముంటున్న తమను రోడ్డుపాలు చేయొద్దని పేదలు ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు.

ఏ చెరువులో ఎన్ని నిర్మాణాలు వెలిశాయంటే..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న 12 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో 887 వరకు నిర్మాణాలు ఉన్నట్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. మాదాపూర్‌లోని దుర్గం

మిగతా 8వ పేజీలో..

ప్రత్యామ్నాయం చూపాలి..



అత్తమామలు 50 ఏళ్ల క్రితం ఇల్లు కట్టారు. కూలుస్తామంటూ అధికారులు ఇప్పుడు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపిస్తేనే ఇల్లు ఖాళీ చేస్తాం.

- కందాడి వరలక్ష్మి, బైరామల్‌గూడ

ఇల్లు కూల్చుతామంటున్నారు



40 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చి పని చేసుకుంటూ ఉన్న ఊర్లో పొలం, జాగాలు అమ్మి 80 గజాలు కొనుక్కుని ఇల్లు కట్టుకున్నాం. ఈ వయస్సులో మమ్మల్ని రోడ్డు పాలు చేస్తే ఎవరు ఆదుకుంటారు. పేదల జోలికి రానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పేదలనే టార్గెట్ చేసింది.

- రాణి, హరిజనబస్తీ

ఆ చెరువులు నాడు అలా.. నేడు ఇలా..

మద్దెలకుంట

సరూర్‌నగర్ మండలం చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని సర్వే నంబర్ 16లో మద్దెలకుంట చెరువు ఉంది. దీని వాస్తవ విస్తీర్ణం తొలుత 6.64 ఎకరాలు. చెరువు కింద వందల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు పూర్వీకులు చెబుతుండేవారు. అయితే కాలక్రమేణా ఆక్రమణలకు గురై ప్రస్తుతం ఇక్కడ 4.50 ఎకరాల్లో మాత్రమే చెరువు ఉంది. ఎఫ్‌టీఎల్‌లో ఇళ్లు కట్టుకున్న వారు ఖాళీ చేయాలని ఇటీవల తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు.

సున్నం చెరువు

మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి మండలంలోని సున్నం చెరువు సుమారు 68 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. విస్తీర్ణం తొలుత 32.15 ఎకరాలు ఉండేది. ప్రస్తుతం ఇక్కడ 15.23 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ఇటీవల గుర్తించారు. పద్మావతినగర్ కాలనీ, గాయత్రీనగర్ వైపు అధికంగా చెరువును పూడ్చేశారు. నిసియట్ కాలనీ మాటున కొందరు కబ్జాకు ఒడిగట్టారు. లాక్‌డౌన్ సమయంలో చెరువు దక్షిణాన ఏకంగా 100 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేశారు.

బోయినిచెరువు

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఈ చెరువు వాస్తవ విస్తీర్ణం 72.16 ఎకరాలు. మానస సరోవర్ అపార్ట్‌మెంట్ల వెనక ఉన్న చెరువు బఫర్‌జోన్‌లో సుమారు 11 ఎకరాల స్థలాన్ని బీఆర్ఎస్ నేతల అండదండలతో ఓ మైనార్టీ నాయకుడు ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించాడు. మరో వ్యక్తి సుమారు 5 ఎకరాల స్థలంలో ఫంక్షన్ హాలు నిర్మించాడు. కాగా, బఫర్‌జోన్‌లో ఇళ్లు నిర్మించారని హరిజనబస్తీ, అంజయ్యనగర్‌కు చెందిన 125 మందికి ఇటీవల రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు.



ఫీర్జాదిగూడ పెద్ద చెరువు

వాట్ ఈజ్ హ్యాపెనింగ్..

● పారిశుధ్యం అధ్వానంగా ఉంది.. ● అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు
● రోడ్ల పక్కన చెత్త ఉండటంతో అధికారులపై దానకిషోర్ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న దానకిషోర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'వాట్ ఈజ్ హ్యాపెనింగ్. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇంత అశ్రద్ధ ఉంటే ఎలా' అంటూ జీహెచ్‌ఎంసీ అధికారులపై రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.1.25 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో బాలాగార్డెన్ ఫంక్షన్ హాల్ నుంచి గుర్రం చెరువు వరకూ 800 మీటర్లమేర నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణపనులను శుక్రవారం దానకిషోర్ పరిశీలించారు. ఆ పరిసరాల్లో రోడ్డుకు ఇరువైపులా

మిగతా 8వ పేజీలో..

పోలీసులను చూసి.. భయంతో నిందితుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓ కేసులో నిందితుడికి వారెంట్ జారీ కావడంతో ఇంటికొచ్చిన పోలీసులను చూసి భయంతో రెండంతస్తుల భవనం పైనుంచి దూకాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బండ్లగూడ సన్‌సిటీ ప్రాంతంలో నివాసముంటున్న అఫ్సరుద్దీన్ (55) పలు కేసుల్లో నిందితుడు. పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసుకు సంబంధించి వారెంట్ ఉండటంతో శుక్రవారం రాత్రి పోలీసులు అఫ్సరుద్దీన్ ఇంటికొచ్చారు. దీంతో భయపడిన ఆయన రెండంతస్తుల పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

తొలగిస్తారా.. తొలగించమంటారా?

● విద్యుత్ స్తంభాలపై ప్రమాదకర కేబుళ్లు
● షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలకు కారణమవుతున్న వైనం

8

• ఐఎఫ్ఎస్‌సి కోడ్ : IBKL0000094 ని ఉపయోగించి ఖాతా నెం.09434915010026 కి ఇఎండి చెల్లించబడుతుంది. బ్రాంచ్ పేరు: ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, రాజమండ్రి బ్రాంచ్, ఆర్‌టి.జి.ఎస్. ద్వారా మాత్రమే ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్‌కు అనుకూలంగా ఉంటుంది.
• ఆసక్తి గల బిడ్డర్లు చెల్లింపు రుజువుతో పాటు పాన్ కార్డు (తప్పనిసరి), ఆధార్‌కార్డ్, పాస్‌పోర్ట్ ఓటరుఐడి కార్డ్ డ్రైవింగ్ లైసెన్స్ వంటి కెవైసి డాక్యుమెంట్‌లతో పాటు (ఫోటో గుర్తింపు మరియు చిరునామా రుజువులు) పైన పేర్కొన్న చిరునామాలోని అధీకృత అధికారికి వ్యక్తిగతంగా సమర్పించాలి. బిడ్‌ల ఆనలైన్ సమర్పణ వినోదం మరియు తిరస్కరించబడదు. బిడ్డర్ పైన పేర్కొన్న చిరునామాలో ఎ.ఓ. ని సందర్శించడం ద్వారా వ్యక్తిగతంగా అవసరమైన డాక్యుమెంట్లు మరియు ఫిల్లింగ్ ఫార్మాట్‌లతోపాటు బిడ్‌ను సమర్పించాలి.
• ఆసక్తిగల బిడ్డర్లు చెల్లించే ఇఎండి మొత్తానికి వడ్డీ ఉండదు బిడ్డర్ వేలం వేయడం ద్వారా ఇ-వేలంలో పాల్గొనకపోతే ఇఎండి జప్తు చేయబడుతుంది. ఎఓ బిడ్‌లు తెరిచిన తేదీ నుండి 3 నెలల వరకు మొదటి మూడు బిడ్డర్‌ల ఇఎండి కలిగి ఉండవచ్చు
• ఇఎండి మరియు ఇతర నిర్దేశిత పత్రాలు అందిన తర్వాత మరియు అదే అన్ని విధాలుగా క్రమంలో కనుగొనబడితే అటువంటి ఆసక్తిగల బిడ్డర్లకు "యూజర్ ఐడి" అందించబడుతుంది. ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్ అంట్రార్స్ సిస్టమ్స్ లిమిటెడ్ ద్వారా వారి చెల్లుబడు అయ్యే ఇ-మెయిల్ చిరునామాలకు (ఇ-వేలం పాల్గొనడానికి ఇది తప్పనిసరి) ఇమెయిల్ ద్వారా తెలియజేయును.
• విజయవంతమైన బిడ్డర్ అమ్మకం ధృవీకరణ సమయంలో లేదా ఎఓ అంగీకరించిన విధంగా పొడిగించిన వ్యవధిలో అదేరోజున అమ్మకపు ధరలో 25% (జమచేసిన ఇఎండి మొత్తం) డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. విక్రయధర యొక్క మిగిలిన మొత్తాన్ని విక్రయం ధృవీకరించబడిన 15 రోజులలోపు లేదా ఎఓ అంగీకరించిన విధంగా పొడిగించిన వ్యవధిలో చెల్లించాలి. నిర్దేశ వ్యవధిలోగా విజయవంతమైన బిడ్డర్ ద్వారా బ్యాలెన్స్ మొత్తాన్ని డిపాజిట్ చేయడంలోవిఫలమైతే డిపాజిట్ చేసిన మొత్తం సహా.

నిబంధనల సారాంశం :
ఎ) స్థిరాస్తిని "ఎక్కడ ఉన్నదో అలాగే", "ఏమిటి ఉంది" మరియు ఆధారం లేకుండా" విక్రయించాలని ప్రతిపాదించబడింది.
బి) స్థిరాస్తిని రిజర్వ్ ధర కంటే తక్కువకు అమ్మబడదు.
సి) విజయవంతమైన బిడ్డర్ పేరు మీద ఆస్తి బదిలీని ప్రభావితం చేసే బకాయిలు మరియు అటువంటి బకాయిలు ఏవైనా ఉంటే, తేదీనాటికి బకాయిలు మరియు ఇంకా రావాల్సిన బకాయిలకు (చట్టబద్ధమైన లేదా ఇతరత్రా) ఎఓ బద్యత వహించరు. విజయవంతమైన కొనుగోలుదారుచే భరించబడుతుంది. ఐడిబిఐ దాని గురించి సమాచారాన్ని అందించడానికి ఎటువంటి బాధ్యత తీసుకోరు. విజయవంతమైన బిడ్డర్ స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఖర్చులు, పన్ను బాధ్యతలు వంటి అన్ని అవసరమైన ఖర్చులను భరించవలసి ఉంటుంది.
డి) బిడ్ డ్యాకుమెంట్‌లలో పేర్కొన్న స్థిరాస్తి ఐడిబిఐకి అనుకూలంగా రుణగ్రహీతలు/లు సృష్టించిన ఛార్జీలు/తనఖాలు, బిడ్ డాక్యుమెంట్‌లలో ఇవ్వబడిన వివరాలు ఆధారంగా ఉంటాయి. ఆసక్తిగల పార్టీలు స్థిరాస్తి వివరాలను ధృవీకరించాలని మరియు అభ్యర్థనపై ఎఓ వద్ద అందుబాటులో ఉన్న దానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేయాలని అభ్యర్థించారు.
ఇ) స్థిరాస్తి ఐడిబిఐ యొక్క ఛార్జీలు మరియు భారాల నుండి ఉచితంగా విక్రయించబడుతోంది.
ఎఫ్) ఇవేలం నమోదు / మద్దతు కోసం సంప్రదించండి: మెస్సర్స్ అంట్రార్స్ సిస్టమ్స్ లిమిటెడ్, 'హొంగసను', నెం. 137/3, బెంగుళూరు మైసూరు రోడ్, మెట్రో పిల్లర్ పి-696 ఎదురుగా, కెంగెరి, బెంగుళూరు-560060, ఫోన్: 080-45982100 లేదా వారి ప్రతినిధి కుమారి సుస్మిత మరియు శ్రీమతి మెరీన - 8951944383 / 9686196751, ఇ మెయిల్: sushmitha.b@antaressystems.com /marina.j@antaressystems.com మరియు వెబ్‌సైట్: www.bankeauctionwizard.com.
జి) ఆసక్తి గల బిడ్డరు/పార్టీలు బిడ్ డాక్యుమెంట్‌ను పొందవచ్చు. ఇందులో విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతులు, బిడ్ ఫారమ్‌లు మొదలైనవి ఐడిబిఐ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు (www.idbibank.in) లేదా ఎ.ఓ. ను సంప్రదించండి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, దానవాయిపేట పార్క్ రోడ్, రాజమండ్రి, ఇ మెయిల్ : n.rajesh@idbi.co.in మొబైల్: 9848773892 మరియు ఇ మెయిల్: gvs.rao@idbi.co.in / మొబైల్: 9176103848 కు సెప్టెంబర్ 02, 2024 నుండి సెప్టెంబర్ 18, 2024 వరకు ఏదైనా పని రోజున వ్యక్తిగతంగా పై చిరునామాలో సంప్రదించవచ్చును.
హెచ్) ఐడిబిఐ మరియు ఎఓ స్థిరాస్తిలో ఏవైనా లోపాలు/తప్పిదాలు/వ్యత్యాసాలు/లోటు మొదలైన వాటికి లేదా ఏదైనా అనుమతులు మొదలైన వాటికి లేదా చట్టం ద్వారా స్థాపించబడిన ఏదైనా అధికారం యొక్క బకాయిలకు బాధ్యత వహించవు. ఐడిబిఐ మరియు ఎఓ ఈ విక్రయ ప్రకటనలో ఏదైనా పొరపాటు సరికాని లేదా లోపానికి బాధ్యత వహించదు.
ఐ) ఏ కారణం(ల)ను కేటాయించకుండా ఏదైనా లేదా అన్ని బిడ్‌లను అంగీకరించే లేదా తిరస్కరించే హక్కు ఎఓకి ఉంది. ఒకవేళ అన్ని బిడ్‌లు తిరస్కరించబడినట్లయితే చట్టంలో సూచించిన విధంగా ఏదైనా పద్ధతిలో ఆస్తులను విక్రయించే హక్కు ఎఓకు ఉంది.
జె) కింది షరతులను ఏదైనా బిడ్డర్ ప్రత్యేకంగా గమనించవచ్చు: 1) వేలం కోసం ఉంచిన ఆస్తులు 2018 ఎఫ్ఐఆర్ నెం. ఆర్.సి 02(ఎ) ప్రకారం సిబిఐ, ఎసిబి, విశాఖపట్నం దర్యాప్తులో ఉన్నాయని మరియు విశాఖపట్నంలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో ఉన్నాయని గమనించాలని ఆసక్తిగల బిడ్డర్లు అభ్యర్థించారు. 2) సిబిఐ, ఎసిబి, విశాఖపట్నం 26-4-2018 మరియు 06-07-2021 నాటి లేఖ సిబిఐ నుండి నిర్దిష్ట క్లియరెన్స్ లేకుండా అసలు టైటిల్ డీడ్‌లను విడుదల చేయవద్దని బ్యాంక్‌కు సూచించింది, అయినప్పటికీ, విజయవంతమైన వేలం కొనుగోలుదారు పేరుమీద ఎస్ఆర్ఓలో సేల్ సర్టిఫికెట్ రిజిష్టర్ చేసుకోవడానికి అంగీకరించింది. 3) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విశాఖపట్నం 08-06-2018 నాటి లేఖ ద్వారా తనఖా పెట్టబడిన / తాకట్టు పెట్టిన ఆస్తుల అసలు ఆస్తి పత్రాలను బ్యాంక్ సురక్షిత కస్టడీలో ఉంచాలని మరియు వారి సమ్మతి లేకుండా విడుదల చేయవద్దని బ్యాంక్‌కి సూచించింది. 4) 2018 ఎఫ్ఐఆర్ నెం. ఆర్‌సి 02(ఎ) లో సబ్జెక్ట్ ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించి ఒరిజినల్ టైటిల్ డీడ్‌లు సిబిఐ వద్ద ఉన్నాయి.

తేది:30-08-2024,
ప్రదేశం : రాజమండ్రి
సం/- అధీకృత అధికారి,
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.

ఉపాధిని చూపే పాఠ్యప్రణాళికను ప్రవేశ పెట్టాలి : ప్రొఫెసర్ లింబాద్రి



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి

చార్మినార్ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధిని చూపే పాఠ్యప్రణాళికను పాఠశాలలు, కాలేజీల్లో ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి అన్నారు. దేశాభివృద్ధి పాఠ్య ప్రణాళికపై ఆధారపడి ఉంటుందన్న ఆయన, సామాజికశాస్త్రాల్లో ప్రవేశపెట్టాలని అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులకు నిర్వహిస్తున్న ఆరురోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లింబాద్రి మాట్లాడుతూ ప్రపంచమంతా వేగంగా మారుతున్నపుడు అందుకు అనుగుణంగా మన పాఠ్యప్రణాళికలను మార్చుకోవాలనే, తెలంగాణలో అనేక కొత్త డిగ్రీ కోర్సులను పరిచయం చేశామన్నారు. ఈ సంవత్సరం 'బీఏ పబ్లిక్ పాలసీ గవర్నెన్స్' డిగ్రీని కొన్ని ప్రభుత్వ కాలేజీలలో ప్రవేశపెట్టామన్నారు. ఈ కోర్సుకు సంబంధించిన సిలబస్‌పై అధ్యాపకులకు ఆరు రోజులపాటు అవగాహన కార్యక్రమాన్ని సిటీ కళాశాల నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న పార్థసారధి మాట్లాడుతూ సివిల్ సర్వీస్ పరీక్షలో ఎక్కువ మంది విద్యార్థులు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ని ఐచ్ఛిక అంశంగా ఎంపిక చేసుకుంటున్నారని తెలిపారు. సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ బాలభాస్కర్ మాట్లాడుతూ ఉద్యోగం, ఉపాధి కల్పించే 11 కొత్త డిగ్రీ కోర్సులను సిటీ కాలేజీలో ప్రవేశపెట్టామన్నారు. కార్యక్రమంలో డా.విప్లవదత్ శుక్లా, డా.యాదయ్య, డా.రవికుమార్, డా.కృష్ణవేణి, డా.మల్లిక, డా.ఆది రమేశ్, డా.రవీంద్రబాబు, రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుంచి 50 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దర్గా హజరత్ ఉర్సు వేడుకలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా హసన్‌నగర్‌లోని దర్గాహజరత్ మహ్మద్ ఖాసిం అలీ చిస్తీ ఉర్సు ఉత్సవాలు సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 1న ఉర్సు వేడుకలను ప్రారంభించి... సాయంత్రం 6 గంటలకు సందల్ ఊరేగింపు, 2వ తేదీన ఖవాలీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉర్సు ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి అవార్డు



మెమెంటోతో ఆర్యాఅగర్వాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(హెచ్‌సీయూ)లో ఎంబీఏ చదువుతున్న విద్యార్థిని ఆర్యాఅగర్వాల్ ప్రతిష్ఠాత్మకమైన డా.దినేష్ మెమోరియల్ అవార్డును అందుకున్నారు. వర్సిటీలో హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో రెండో సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం యశోద హాస్పిటల్స్‌లో జరిగిన డాటాకాన్ సదస్సులో పాల్గొని 'డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడం' అంశంపై ఆర్యాఅగర్వాల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈవెంట్, డేటా వినియోగం ద్వారా ఆరోగ్య సంరక్షణను పెంపొందించే విధానాలను హైలైట్ చేశారు. దినేష్ మెమోరియల్ అవార్డు కింద ఆర్యాఅగర్వాల్‌కు మెమెంటోతోపాటు రూ.10వేల నగదు పురస్కారం అందించారు.



హ్యాండీక్రాఫ్ట్ మేళాలో కొనుగోలు చేస్తున్న సందర్శకులు

హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్

నార్సింగ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్‌ను మణికొండ ఫైప్ లైన్ రోడ్డులోని సుందర్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్లో ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, బాగల్‌పూర్ శారీస్, డిజైనర్ శారీస్, కాంతా వర్క్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన శారీస్, కలంకారీ వారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్స్, లక్నో చికెన, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ సీట్స్, కొండపల్లి టాయ్స్ తదితర శారీస్‌ను మహిళలకు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాలో పాల్గొని కొనుగోలు చేయాలని తెలిపారు.



పర్యావరణ అనుకూల గణపతిపై అవగాహన కల్పిస్తున్న విభూతి బ్రదర్స్, కళాజాత ప్రదర్శన సభ్యులు

మట్టి గణపతిపై అవగాహన

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండగను పురస్కరించుకొని నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని గవర్నమెంట్ కాలేజ్ ఉమెన్స్ (ఏ)లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ అనుకూల గణేశ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని విభూతి బ్రదర్స్ కళాజాత ప్రదర్శన ద్వారా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మట్టి గణపతిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ బి.నాగేశ్వర్ రావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు మట్టితో గణపతిని చేసి పండుగను జరుపుకోవాలన్నారు. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా పర్యావరణాన్ని కలుషితం చేయకుండ ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఇందిరా ప్రియదర్శిని గవర్నమెంట్ డిగ్రీ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బి.ఎస్.రజిత, డాక్టర్ యు.అనిత పాల్గొన్నారు.



పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

రాజేంద్రనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండ చూసుకోవాలన్నారు. చెత్తను తడి పొడి చెత్తగా వేరుచేసి ఇంటి స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, నవ యువ యువజన సంఘం నాయకులు ఎర్ర కుమారస్వామి, కొంపల్లి జగదీశ్, రాజేంద్రనగర్ సర్కిల్ సిబ్బంది సురేశ్, శ్రీశైలం, వినోద్, తేజ పాల్గొన్నారు.



జల్‌పల్లి గౌడ కాలనీలో రోడ్లపై నిలిచిన మురుగు

జనావాసాల మధ్య మురుగు

పహాడీషరీఫ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని జలపల్లి గౌడ కాలనీలో మురుగు నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డులలో పారిశుధ్య పనులు చేయడం లేదని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న గౌడ కాలనీలో రోడ్లపై మురుగునీరు నిలవడంతో ప్రజలంతా ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు చొరవ తీసుకొని మురుగు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణ అనుకూలంగా ఫ్యాషన్ ఉండాలి

● వై ఫ్లో సదస్సులో వక్తలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ పరంగా నూతనంగా ఏది సృష్టించినా అది పర్యావరణంపై ప్రభావం చూపుతుందని బెహ్నో న్యూయార్క్ ఫౌండర్ శివమ్ పుంజ్యా అన్నారు. తన దృష్టిలో సస్టెయినబల్ ఫ్యాషన్ అంటే నిజాయితీగా ఉండటమేనన్నారు. శుక్రవారం మాదాపూర్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వై ఫ్లో) ఆధ్వర్యంలో సస్టెయినబల్ ఫ్యాషన్‌పై రౌండ్‌టేబుల్ చర్చ జరిగింది. వ్యాపారవేత్త పింకీరెడ్డి, ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్ షా, కాన్షియస్ ఎఫర్ట్ ఫౌండర్ సాచిబాల్ పాల్గొన్నారు. ప్రపంచమంతా ఫ్యాషన్ వైపు చూస్తోందని గౌరాంగ్ షా అన్నారు. ఇక్కడ లభించినంత చేనేత వస్త్ర వైవిధ్యం మరెక్కడా లభించదని పేర్కొన్నారు. వై ఫ్లో చైర్ పర్సన్ రిద్ధి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒకశాతం వస్త్రాలు మాత్రమే రీ సైకిల్ చేస్తుండడం ఆందోళనకరమన్నారు.

ఆటోలో ఎక్కించుకుంటారు.. ఫోన్ కొట్టేస్తారు

● ఒకే రోజు ముగ్గురి సెల్‌ఫోన్లు చోరీ

యూసుఫ్‌గూడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకే రోజు ఒకే తరహాలో ఆటోలో ముగ్గురి సెల్‌ఫోన్‌లు చోరీ అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ రెహ్మత్‌నగర్ సంతోష్‌గిరిలో నివాసం ఉంటూ వాల్‌పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం పని కోసం బ్రహ్మశంకర్‌నగర్ నుంచి యూసుఫ్‌గూడ బస్తీ వెళ్లేందుకు వచ్చాడు. అతడి ముందు ఓ ఆటో ఆగింది. వెనక సీట్లో ముగ్గురు కూర్చుని ఉన్నారు. డ్రైవర్ పక్కన కూర్చునేందుకు అజయ్ ప్రయత్నించాడు. డ్రైవర్ ముందు టైర్‌లో గాలి తక్కువగా ఉంది వెనక కూర్చోమని చెప్పాడు. సరేనని వెనక సీట్లోకి వెళ్లాడు. కూర్చునేందుకు ఇబ్బందిగా ఉండడంతో కార్మికనగర్‌లో దిగాడు. సెల్‌ఫోన్ చూసుకోగా కనిపించలేదు. అలాగే, రెహ్మత్‌నగర్‌లో ఉండే సాయికిరణ్ యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్దకు వెళ్లేందుకు ఆటో కోసం చూస్తుండగా ఓ ఆటో ఆగింది. వెనక సీట్లో ముగ్గురు ఉన్నారు. వెనక కూర్చోవడం ఇబ్బందిగా ఉందని ఆటో దిగాడు. సెల్‌ఫోన్ చూసుకోగా కనిపించలేదు. రెహ్మత్‌నగర్‌లో ఉండే కోటి సత్యం మైత్రివనం వెళ్లేందుకు హెడీఎఫ్‌సీ ఏటీఎం వద్ద ఆటో ఎక్కాడు. వెనక సీట్లో ముగ్గురు ఉన్నారు. కొంతదూరం వెళ్లాక వెనక కూర్చోవడం ఇబ్బందిగా ఉందని ఆటో దిగాడు. సెల్‌ఫోన్ చూసుకోగా కనిపించలేదు. ఈ మూడు సంఘటనలు గురువారం ఉదయం 8.40 గంటల నుంచి 9 గంటలలోపు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఎస్సీఆర్‌హిల్స్ నుంచి ఆటోలో వచ్చిన వారు సెల్‌ఫోన్‌లు చోరీ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

గణేశ్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలి

● నిర్వాహకులు, అధికారులతో డీసీపీ సమన్వయ సమావేశం



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా అన్నారు. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం రాజన్నబావి వద్ద గల రెడ్డి జనసంఘంలో వివిధ శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డీసీపీ స్నేహ మెహ్రా, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, జోనల్ కమిషనర్ వెంకన్నలు మాట్లాడుతూ ఉత్సవాల ప్రారంభంలోపు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భక్తితో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. దక్షిణ మండలంలో జరిగే ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. లలితాబాగ్ రైల్వే బ్రిడ్జి 13 అడుగుల ఎత్తు ఉంది కాబట్టి 8 అడుగుల లోపు విగ్రహాలు, ఉప్పుగూడ అండర్ బ్రిడ్జి 14 అడుగులు ఎత్తు ఉంది కావున 9 అడుగుల లోపు, బహదూర్‌పురా ఫ్లై ఓవర్ 18 అడుగుల ఎత్తు ఉంది కాబట్టి 12 అడుగుల లోపు వినాయక విగ్రహాలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. చిన్న వినాయక విగ్రహాలకు భారీ వాహనాల్లో నిమజ్జనం కోసం వెళ్తామంటే సహించేది లేదన్నారు. నిమజ్జనం కోసం బలవంతంగా భారీ వాహనాలు తీసుకునేందుకు అనుమతి లేదు. ఆర్టీఏ అధికారులను సంప్రదిస్తే వారు వాహనాలు కేటాయిస్తారన్నారు. టస్కర్ వంటి ఓపెన్ వాహనాలకు చుట్టూ తాత్కాలింగా ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి మండపంలో తప్పనిసరిగా సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గుంతలమయంగా మారిన రోడ్లను త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు. నిమజ్జనం రోజున ఆలస్యం చేయకుండా త్వరగా బయల్దేరాలని సూచించారు. ఉత్సవాల్లో మంచి నీటి కొదవ లేకుండా చేసుకుంటామని, మురుగు నీటి సమస్య తలెత్తకుండా, ప్రతి కిలోమీటర్‌కు ఒక్క మంచినీటి క్యాంప్ ఏర్పాటు చేస్తామన్నారు.

కార్యక్రమంలో గౌలిపుర కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, అడిషనల్ డీసీపీ షైక్ జహంగీర్, వాటర్ వర్క్స్ సీజీఎం వినోద్ భార్గవ్, డీజీఎం అప్పల నాయుడు, ఆర్డీఓ జ్యోతి, తహసీల్దార్ జయమ్మ, డీఈ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ntLWQtiలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తర్వాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఫోర్ట్‌వ్యూ కాలనీలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాజేంద్రనగర్ ఏఈ తెలిపారు. ఫోర్ట్‌వ్యూ కాలనీ, పరమారెడ్డి హిల్స్, హాపీహోమ్స్ కాలనీ, అశోక్ విహార్, జనచైతన్య ఫేజ్-2, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గణేశ్ విగ్రహాల ధ్వంసం

మంగళ్‌హాట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారాంబాగ్ బాలాజీ స్కూల్ ఎదురుగా పవన్ సింగ్ అనే వ్యక్తి గణేశ్ విగ్రహాలను తయారు చేసి షెడ్‌లో పెట్టాడు. ఈ నెల 26న గుర్తు తెలియని వ్యక్తి షెడ్‌లోకి ప్రవేశించి 10 విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేశాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



జీహెచ్‌ఎంసీకి కేటాయించిన స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ సిబ్బంది

రాజేంద్రనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాటేదాన్ టీఎన్‌జీఓస్ కాలనీ సర్వే నంబర్ 156/1 లో జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్‌కు కేటాయించిన 3000 గజాల స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన గదులను శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు తమ సిబ్బంది చేత కూల్చివేశారు. ౘ చిన్న చిన్న గదులు నిర్మించి పూర్తిగా ఆ స్థలాన్ని కాజేయాలని చూసిన అక్రమార్కుల ఆగడాలకు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ కళ్లెం వేశారు. ఇక ముందు జీహెచ్‌ఎంసీకి కేటాయించిన స్థలం జోలికి వస్తే కబ్జా దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు అధికారులను కోరారు. నాయకుల అండదండలతో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు సర్వే చేసి ప్రభుత్వ స్థలం ఎంత కబ్జాకు గురైందో తెలుసుకుని ఆ స్థలాన్ని తిరిగి రాబట్టాలన్నారు.



ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న ప్రసాద్

ఎంజీఐటీలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్

నార్సింగ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థిని విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలి కమ్యూనికేషన్ డీన్ సి.కె. ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కోర్సులు సృజనాత్మకంగా, వినూత్నంగా, కేరీర్‌ను చక్కదిద్దేందుకు ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నాయని వివరించారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ఇండస్ట్రీ, ఇనిస్టిట్యూట్ మధ్య అంతరాన్ని తగ్గించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్ట్‌సెట్ టాలెంట్ అక్విజిషన్ ఉపాధ్యక్షుడు అనుష్మ రంజన్, మైక్రాన్ సెంట్రల్ ఇంజనీరింగ్ ఆసియా హెడ్ డైరెక్టర్ శరత్ కె. దండాల, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



విద్యార్థులతో భోజనం చేస్తున్న కలెక్టర్ శశాంక

నార్సింగ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం కిస్మత్‌పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాలను జిల్లా కలెక్టర్ శశాంక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి వారితో కలిసి భోజనం చేస్తూ వారితో ముచ్చటించారు. అనంతరం అక్కడి సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఎదుగుదలకు అవసరమైన పౌష్టిక ఆహారం, మెడికల్ సదుపాయాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఉత్తీర్ణత శాతం మెరుగుపడే విధంగా, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో చదివించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఏఎన్ఎమ్, హెడ్‌కుక్, అడిషనల్ కుక్‌ల పని విధానాన్ని పరిశీలించారు. అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

రాజేంద్రనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక శుక్రవారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు ఎలాంటి భోజనం పెడుతున్నారు.. భోజనం బాగుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్ షెడ్ పూర్తి కాకపోవడాన్ని గమనించిన ఆయన పనులు ఎందుకు ఆగిపోయాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణను అడిగి తెలుసుకున్నారు. దానికి ఆమె కాంట్రాక్టర్‌కు బిల్లులు రానందున పనులు మధ్యలోనే ఆపాడని తెలపగా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఈఈని పిలిపించి మాట్లాడారు. విద్యార్థులు ఆడుకునేలా మైదానం చదును చేయాలని సూచించారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉద్యోగుల కార్యాచరణ సమితి ప్రతినిధులు

మహాధర్నాను విజయవంతం చేయండి

నార్సింగ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసి ఉద్యోగ పదోన్నతులు కల్పించాలని విద్యుత్ ఓసీ, బీసీ ఉద్యోగుల కార్యచరణ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4వ తేదిన మహా ధర్నాను చేపట్టనున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం మెహిదీపట్నం నానాల్‌నగర్‌లోని విద్యుత్ సైబర్ సిటీ ప్రతినిధులు వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ తాము ఏ వర్గానికి వ్యతిరేకం కాదని, సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకొని ఓసీ, బీసీలకు పదోన్నతుల్లో ఆర్డర్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఏవోలు రవికుమార్, వీరస్వామి, అకౌంట్స్ అధికారులు మురళీగౌడ్, మనోహర్, నాగరాజు పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీలు

● ముగ్గురి అరెస్ట్.. 9 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

అమీర్‌పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న వ్యక్తితోపాటు వాటిని కొనుగోలు చేస్తున్న ఇద్దరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా, బెస్తవారిపేట మండలం, పాతమల్లాపురం గ్రామానికి చెందిన బండ్లమూడి చిన్న అవులయ్య(30) ఎర్రగడ్డలో నివసిస్తూ మెట్రోస్టేషన్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేసేవాడు. కొవిడ్ సమయంలో స్వగ్రామానికి వెళ్లిపోయాడు. తిరిగి 2023లో నగరానికి వచ్చి గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో కొంతకాలం సెక్యూరిటీ గార్డుగా పని చేశాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీల బాట పట్టాడు. ఎస్ఆర్‌నగర్, బాపూనగర్ పరిసర ప్రాంతాల్లో హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడు. వీటిని నేరేడ్‌మెట్‌లో సెల్‌ఫోన్ మరమ్మతుల షాపు నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు చెందిన వెంకటకృష్ణ(33), అంబర్‌పేటలో ఉంటున్న బెస్తవారిపేటకు చెందిన మేకల వెంకటేశ్వర్లు(30)కు విక్రయించేవాడు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు అమీర్‌పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అవులయ్య, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.13 లక్షల విలువైన 9 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాత్, ఎస్ఐ రాజురాథోడ్ పాల్గొన్నారు.

సమాజహితాన్ని కోరే తిలక్ రచనలు



నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్, జనార్దనమూర్తి

చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బాలగంగాధర తిలక్ రచనలు కథలు, కవిత్వం సమాజహితాన్ని కోరతాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా శుక్రవారం రాత్రి ప్రముఖ అభ్యుదయ రచయిత దేవరకొండ బాలగంగాధర తిలక్ యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని తిలక్‌కు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తిలక్ రాసిన సాహిత్యం రాశిలో కొంచెమే అయినా.. వాసిలో మాత్రం అపురూపమని అన్నారు. తొలిరోజుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావంతో భావకవిత్వం వైపు పయనించినా తర్వాత కాలంలో సామాజిక చైతన్య ఆలోచనలతో అభ్యుదయ కవిత్వంలో మేటిగా తిలక్ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ, వచనకవితా ఉద్యమంలో కుందుర్తికి సహచరుడు తిలక్ అన్నారు. చిన్నవయసులోనే ఆయన మృతి తెలుగు సాహిత్యానికి తీరనిలోటు అన్నారు. కళాభిమాని వెంకటరావు, గాయని గరిమెళ్ల సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య.. 12 రోజుల తర్వాత పోస్టుమార్టం

రాజేంద్రనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బాలిక ఆత్మహత్యకు కారణమైన ఓ బాలుడిని శుక్రవారం మైలార్‌దేవుపల్లి పోలీసులు జువెనైల్ హోమ్‌కు తరలించారు. నందిగామ మండలం చేగూరుకు చెందిన ఓ కుటుంబం మైలార్‌దేవుపల్లి డివిజన్ దుర్గానగర్‌లో నివసిస్తోంది. వారికి ముగ్గురు సంతానం కాగా పెద్ద కుమార్తె శివరాంపల్లిలోని ఓ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె ఈ నెల 17న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామమైన చేగూరుకు తీసుకువెళ్లి 18వ తేదీన అంత్యక్రియలు పూర్తి చేశారు. అనంతరం బాలిక తండ్రి ఆమె చదువుతున్న కాలేజీకి వెళ్లి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశాడు. కాలేజీ యాజమాన్యం సూచన మేరకు ఆమె సెల్‌ఫోన్ చెక్ చేయగా ఓ నంబర్‌కు చాటింగ్ చేసినట్లు గుర్తించాడు. ఆ ఫోన్ నంబర్ దుబ్బచర్ల గ్రామానికి చెందిన బాలుడిదిగా గుర్తించారు. అతడు తన అమ్మమ్మ గ్రామం అయిన మహేశ్వరం మండలం నాగారంలో ఉంటాడని కనుగొన్నారు. మైలార్‌దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం చేగూరుకు డాక్టర్లతో కలిసి వెళ్లి సమాధి చేసిన బాలిక మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేశారు. బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం జువెనైల్ హోమ్‌కు తరలించారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికుల సలహాలు, సూచనలు, సమస్యలు వినేందుకు నేడు శనివారం సాయంత్రం 4 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫలక్‌నుమా ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ రమేశ్ తెలిపారు. 9959226131 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు ఇవ్వాలని కోరారు.

కవితపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

● సైబర్‌క్రైం పోలీసులకు బీఆర్‌ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కవితపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అధికార కాంగ్రెస్‌కు చెందిన సోషల్ మీడియా విభాగాలతోపాటు ఆ పార్టీ నాయకుల సోషల్ మీడియా ఖాతాల్లో అసభ్యకర పోస్టింగ్‌లు చేస్తున్నారని పేర్కొన్నారు.

పెట్టీ కేసులో వ్యక్తికి మూడు రోజుల జైలు

చార్మినార్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన ఓ వ్యక్తి కి మూడు రోజుల జైలు శిక్ష విధించారని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. భవాని నగర్ తలాబ్ కట్టకు చెందిన ఆమెర్‌పై ఈ-పెట్టీ కేసు నమోదు కాగా శుక్రవారం నాంపల్లి నాల్గవ స్పెషల్ జ్యూడిషల్ మజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా న్యాయ మూర్తి మూడు రోజుల జైలు విధించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నల్లకుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 95వ బీపీ, షుగర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కె. వీరయ్య తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం పక్కన హైదరాబాద్ జిందాబాద్ సంస్థ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు.

పటేల్‌గూడ నుంచి మెహిదీపట్నం వరకు
బస్సు సర్వీస్ ప్రారంభం



బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ నుంచి మెహిదీపట్నం వరకు రెండు సిటీ బస్సులు ప్రారంభించారు. శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ బస్సు సర్వీస్‌లను ప్రారంభించి కొంతదూరం ప్రయాణించారు. నగర శివారు ప్రాంతాల్లోని కాలనీలలో నివసించే ఐటీ ఉద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడేలా రెండు సర్వీస్‌లను ప్రారంభించామని, త్వరలోనే మరిన్ని పెంచుతామని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. బస్సులు పటేల్‌గూడ బీహెచ్‌ఈఎల్ మెట్రోకాలనీ నుంచి ప్రారంభమై బీరంగూడ, అశోక్‌నగర్, శేరిలింగంపల్లి, ఆల్విన్ క్రాస్‌రోడ్డు, కొండాపూర్, కొత్తగూడ, హైటెక్‌సిటీ, రాయదుర్గం మెట్రోస్టేషన్ మీదుగా టోలిచౌకీ, మెహిదీపట్నం వరకు బస్సు ప్రయాణిస్తుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిల్ షరీఫ్

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఆదిల్ షరీఫ్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ల సాధనకు మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని కార్య నిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ అన్నారు. సుమారు 200 మంది జీహెచ్‌ఎంసీలోని వివిధ విభాగాల ఉద్యోగులు శుక్రవారం మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులు, పెన్షన్, ఇళ్ల మంజూరు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో జరుపుతున్న చర్చలు త్వరలోనే సఫలీకృతం కానున్నాయని వెల్లడించారు. ఉద్యోగ సంఘం నేతలు శ్రీనివాస్, రామకృష్ణ, కె.రమేశ్, శివ కుమార్, మోజెస్, ఏవీఎస్ గాంధీ, మహిళా నాయకురాలు ఎల్ మెర్సీ పాల్గొన్నారు.



గౌలిపుర డివిజన్ గాంధీ బొమ్మ వద్ద గల శివ పార్వతీ ఫంక్షన్ హాల్ వీధిలో రు.2 లక్షలతో చేపట్టనున్న ఎస్‌డబ్ల్యు డ్రైన్ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మీ. - చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

నగరంలో నేడు

వాక్
అంశం : మాంటిస్సోరి వాక్
వేదిక : సంజీవయ్య పార్కు
సమయం : ఉదయం 6.45 గంటలకు

సమావేశం
అంశం: వేదిక్ నాలెడ్జ్ మోడ్రన్ టెక్నాలజీ
వేదిక : టీ-హబ్, రాయదుర్గం
సమయం : ఉదయం 9.15 గంటలకు

ప్రెస్‌మీట్
అంశం: మణిపూర్ సీఎం బీరెన్‌సింగ్ ఆడియో లీక్ నేపథ్యంలో..
వేదిక : బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ సమయం : మధ్యాహ్నం 12 గంటలకు

‘ప్రజావాణి’కి 680 దరఖాస్తులు

బేగంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 680 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేకాధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎస్సీ వెల్ఫేర్‌కు 21, విద్యుత్ శాఖకు 98, రెవెన్యూ 94, మైనార్టీ 90, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 64, ఇతర శాఖలకు సంబంధించి 119 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.

నిమ్స్‌లో ‘స్పెషలైజ్‌డ్ డిజార్డర్’ క్లినిక్ ప్రారంభం



క్లినిక్ ప్రారంభోత్సవంలో డైరెక్టర్ బీరప్ప, వైద్యులు

సనత్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పార్కిన్‌సన్స్, డెమెన్షియా వంటి వ్యాధులకు సత్వర చికిత్స అందించేందుకు నిమ్స్‌లో ప్రత్యేక విభాగం అందుబాటులోకి వచ్చింది. ‘స్పెషలైజ్‌డ్ డిజార్డర్’ పేరుతో ఏర్పాటు చేసిన ఈ విభాగాన్ని శుక్రవారం ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. నిపుణులైన వైద్యులు, అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులో ఉన్న ఈ క్లినిక్ ద్వారా మెదడుకు సంబంధించిన సమస్యలకు సంపూర్ణ చికిత్స అందిస్తామని తెలిపారు.

నేడు, రేపు ఇండియన్ బ్యాంక్ అసెట్స్ ఫెయిర్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇండియన్ బ్యాంక్ ప్రతినిధులు

పంజాగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్యాంకులో రెసిడెన్షియల్ ప్లాట్లు, ఇళ్లు, కమర్షియల్ ఆస్తులు, ఖాళీ స్థలాల కొనుగోలు కోసం రుణాలు తీసుకొని చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తుల వేలం వేసేందుకు శని, ఆదివారాల్లో అసెట్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు బ్యాంక్ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఫీల్డ్ జనరల్ మేనేజర్ రాజేశ్వరరెడ్డి తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్ జోన్లకు సంబంధించి సోమాజిగూడ జయా గార్డెన్స్‌లో ఈ ఫెయిర్ జరుగుతుందని వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 238 ఆస్తులను వేలం వేస్తామని, ఆసక్తి ఉన్నవారు స్వయంగా సందర్శించాలని సూచించారు.

‘పరస్పర సహకారంతోనే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట’



హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అన్ని విభాగాల పరస్పర సహకారంతోనే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని మహిళా భద్రత విభాగం చీఫ్ శిఖాగోయల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్(ఐజేఎం) సంయుక్తంగా హెచ్ఐసీసీలో రెండు రోజుల సదస్సు నిర్వహించాయి. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో మహిళల భద్రతకు రాష్ట్ర పోలీసులు తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు. ఈ సదస్సులో ఐఏఎస్‌లు, పోలీస్ అధికారులు, విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు సహా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 225 మంది పాల్గొన్నారు.

పొట్లపల్లి పారిశుధ్య కార్మికుడికి జాతీయ పురస్కారం

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 30: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు లక్ష్మణ్‌కు జాతీయ పురస్కారం లభించింది. తెలుగుభాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకొని బీజేపీ టీచర్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 29న విజయవాడలో పురస్కారాన్ని అందజేశారు. పంచాయతీ కార్మికుడిగా అంకిత భావంతో సేవలందించిన లక్ష్మణ్‌కు జాతీయ పురస్కారం రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

యూపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ వెంకటాచారి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఓఎంఆర్ ఆధారిత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 1న నిర్వహించనున్న యూపీఎస్సీ కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్స్-2024 పరీక్షను మూడు సెషన్లలో, నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ పరీక్ష రెండు సెషన్లలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 18 సెంటర్లలో ఈ పరీక్షలు జరుగుతాయని, యూపీఎస్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులకు సూచించారు.

తొలగిస్తారా.. తొలగించమంటారా?


విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను తొలగిస్తున్న సిబ్బంది

- విద్యుత్ స్తంభాలపై ప్రమాదకర కేబుళ్లు
- షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలకు కారణమవుతున్న వైనం
- తొలగించాలని గతంలోనే టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం
- పట్టించుకోని కొందరు ఆపరేటర్లు
- చర్యలు తీసుకుంటామని తాజాగా హెచ్చరికలు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలపై అడ్డదిడ్డంగా వేలాడదీస్తున్న ప్రైవేట్ తీగలతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఒక్కోసారి అవి తెగి రోడ్లపై పడుతూ స్థానికుల పాలిట ప్రాణాంతకంగా మారుతున్నాయి. దీంతో స్తంభాలపై ప్రమాదకరస్థాయిలో పేరుకుపోయిన కేబుళ్లను వెంటనే తొలగించాలని కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ గతంలోనే పలుమార్లు ఆదేశించారు. నెలరోజులు గడువిచ్చినా కొంతమంది ఆపరేటర్ల తీరు మారలేదు. దీంతో సంస్థపరంగా చర్యలు తీసుకుంటామని తాజాగా హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలపై పెద్దసంఖ్యలో ఉన్న కేబుళ్లను తొలగించాలంటూ జూలై 27, ఆగస్టు 7, 28 తేదీల్లో కేబుల్ సంస్థలు, ఇంటర్నెట్ ప్రొవైడర్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించినా కొంత మంది తీరు మారడం లేదన్నారు. ఆగస్టు 7న జరిగిన సమావేశంలో ప్రధాన రహదారుల్లో వారంలో, ఇతర రహదారుల్లో రెండు వారాల్లో నిబంధనల ప్రకారం కేబుళ్లను అమర్చేలా చర్యలు తీసుకోవాలని ఆపరేటర్లకు సూచించినట్లు ఫరూఖీ పేర్కొన్నారు. సమావేశాల్లో అంగీకరించినా కొంతమంది ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు తొలగింపు పనులు చేపట్టలేదన్నారు. కేబుల్, ఇంటర్నెట్ వినియోగదారులకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో ప్రొవైడర్ల యాజమాన్యాలకు తగినంత సమయం ఇచ్చినా నిర్లక్ష్యం వహిస్తున్నారని వెంటనే తొలగించకుంటే విద్యుత్ సిబ్బందే తొలగిస్తారని ఆయన హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు

గ్రేటర్ పరిధిలో 33/11 కేవీఎల్ విద్యుత్ స్తంభాలు 8 లక్షల వరకు ఉన్నాయి. ఆ స్తంభాలపై సామర్థ్యానికి మించి కేబుల్ బండిల్స్, పలురకాల బాక్సులు, టెలికాం పరికరాలు వేలాడదీయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పనిచేయని కేబుళ్లను తొలగించకపోవడం, గుట్టలు, గుట్టలుగా స్తంభాలపై వదిలేయడం, విద్యుత్ తీగలకు తగిలేలా కడుతుండడంతో ఎర్తింగ్ వచ్చి షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో కేబుళ్లు రోడ్లపై తెగిపడి వాహనాలకు చుట్టుకుని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. విద్యుత్ స్తంభాలపై సమస్యలు తలెత్తినప్పుడు కేబుళ్ల కారణంగా ఒక్కోసారి మరమ్మతులు చేయని పరిస్థితులు నెలకొంటున్నాయి.

డాన్‌గా ఎదగాలనే తుపాకీ కొన్నా..

● గాజులరామారం కాల్పుల నిందితుడు నరేశ్ ఒప్పుకోలు ● ఆయనతోసహా 15 మంది అరెస్ట్, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

జీడిమెట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గాజులరామారంలోని ఓ బార్ వద్ద జరిగిన కాల్పుల ఘటనలో ప్రధాన నిందితుడు మల్లంపేట నరేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనతో సహా 15 మందిని కటకటాల్లోకి నెట్టారు. వారి నుంచి నాటు తుపాకీ, 87 బుల్లెట్లు, తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం దీనికి సంబంధించిన వివరాలను డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు. ఈనెల 27న అర్ధరాత్రి చేబ్రోలు పూర్ణిమ (35), అజయ్‌చంద్ర, గౌతమ్ బైక్‌పై మల్లంపేట నుంచి గాజులరామారం వస్తుండగా ఎల్ఎన్ బార్ వద్ద వీరి వాహనంలో పెట్రోల్ అయిపోయింది. బార్ వద్ద వాహనాల్లో పెట్రోలు తీస్తుండగా సిబ్బంది వారించారు. దీంతో ఘర్షణ పెరగగా, పూర్ణిమ నరేష్, శివలకు ఫోన్ చేసి త్వరగా రావాలని కోరింది. దీంతో నరేశ్ తన గ్యాంగ్‌తో కలిసి బార్ వద్దకు వచ్చి నానా హంగామా చేశారు. ఆవేశంలో నరేశ్ తన వద్ద ఉన్న తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపాడు. అనంతరం పారిపోగా పోలీసులు గాలించి ప్రధాన నిందితుడు నరేశ్‌తోపాటు శివ, సోహెల్, శ్యాంసన్, నరేందర్, ఉజ్వల్ సహా 15 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డాన్‌గా ఎదగాలని, రియల్ వ్యాపారం చేస్తూ అడ్డొచ్చిన వారి భూములు లాక్కోవాలనే ఉద్దేశంతో తుపాకీ కొనుగోలు చేసినట్టు నరేష్ అంగీకరించాడు. ఆయనపై త్వరలో రౌడీషీట్ ఓపెన్ చేసి, పీడీ యాక్టు పెడతామని డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ హన్మంతరావు, ఎస్ఓటీ సీఐ శ్యామ్‌సుందర్, జీడిమెట్ల సీఐ మల్లేష్, ఎస్ఐ రవికిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఖాతాలోకి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్

● నూతన మేయర్‌గా అమర్‌సింగ్ ఎన్నిక


బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన మేయర్ అమర్‌సింగ్

పీర్జాదిగూడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరశివారు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ వశమైంది. నూతన మేయర్‌గా అమర్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ ఎన్నిక నిర్వహించారు. 26 మంది కార్పొరేటర్లకుగాను 21 మంది కాంగ్రెస్‌కు మద్దతివ్వడంతో అమర్‌సింగ్ మేయర్ పీఠం దక్కించుకున్నారు. తాజాగా పీర్జాదిగూడ కార్పొరేషన్‌తో కలిపి మేడ్చల్ నియోజకవర్గంలో మూడు కార్పొరేషన్లు హస్తం ఖాతాలోకి చేరినట్టు అయ్యింది. అనంతరం మేడిపల్లిలోని ఓ కన్వెన్షన్‌లో నూతన మేయర్‌ను కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు.

కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి సారిస్తాం

అరాచక, అవినీతి పాలనకు చరమగీతం పాడామని, ఇకపై పీర్జాదిగూడ నగరాభివృద్ధిపై దృష్టి సారిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి తెలిపారు. మేయర్ అమర్‌సింగ్‌కు సన్మానం సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కార్పొరేషన్ అభివృద్ధికి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం 32 ఎకరాల్లో..

● ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్డు కనెక్టివిటీ ● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


పోలీస్‌స్టేడియం గ్రౌండ్‌లో బైకుపై కలెక్టర్ అనుదీప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా నూతన ఆస్పత్రి భవన నిర్మాణాన్ని దాదాపు 32 ఎకరాల్లో చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. నగరం నడిబొడ్డున నిర్మించనున్న భవనాన్ని కార్పొరేట్‌కు దీటుగా చేపట్టి తెలంగాణకు రోల్ మోడల్‌గా ఉంచుతామన్నారు. గోషామహల్ పోలీస్‌స్టేడియంను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భవనాలు, పరిసర ప్రాంతాలు, రోడ్లు, నాలాను బైక్‌పై వెళ్లి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉస్మానియా నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశామన్నారు. ఆస్పత్రిని మరో వందేళ్లకు అవసరమయ్యే విధంగా నిర్మిస్తామన్నారు. గోషామహల్ పోలీస్ అకాడమీ, అనుబంధ శాఖలను బహదూర్‌పురా పేట్లబురుజులోని పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ కేంద్రంలోకి మార్చుతామన్నారు. హైదరాబాద్ నగరవాసులతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు ఉండకుండా ఆస్పత్రికి చేరుకునేలా కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ జ్యోతి, ఏసీపీ ఉదయ్ కృష్ణ, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సయ్యద్ సైదుద్దీన్, సర్వేయర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

‘దాశరథి’ అక్షరం..చైతన్యానికి ప్రతీక

● అధ్యాపకురాలు దేవేంద్ర


మాట్లాడుతున్న తెలుగు అధ్యాపకురాలు దేవేంద్ర

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి హృదయాల్లో ప్రజాకవిగా దాశరథి పేరు పదిలంగా నిలిచిపోతుందని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన రాసిన ‘నా తెలంగాణ-కోటి రతనాల వీణ’ మలిదశ ఉద్యమానికి అక్షరాయుధంగా నిలిచిందని గుర్తుచేశారు. దాశరథి కృష్ణమాచార్య శత జయంత్యుత్సవాల సందర్భంగా శుక్రవారం నిజాం కళాశాలలో ‘కథాత్మక వచన రచయితగా దాశరథి’ పేరుతో ప్రత్యేక సమావేశం జరిగింది. అధ్యాపకురాలు దేవేంద్ర మాట్లాడుతూ దాశరథి రచనల్లోని శైలి, శిల్పాల మీద ఈ తరం అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని, ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం సామాజిక చైతన్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రముఖ కవి రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య అకాడమీ సూచనతో దాశరథి సాహిత్య సమాలోచన పేరుతో అన్ని విద్యాసంస్థల్లో చర్చాగోష్ఠులు, సమావేశాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరైన ‘ఆంధ్రజ్యోతి’ ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న దాశరథి, ప్రజలను చైతన్యపరచడానికి పద్యాన్ని ఎంచుకొన్నారని, తద్వారా సమాజాన్ని కదిలించే రచనలెన్నో చేశారని అన్నారు. ‘ఈ తెలంగాణం రైతుదే! ముసలి నక్కకు రాచరికంబు దక్కునే’ అని నినదించిన దాశరథి, ప్రజల గొంతుకు మైకు అవుతానని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. దాశరథి సినీగీతాల్లోని మాధుర్యాన్ని అధ్యాపకుడు శరత్ వివరించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, ఓయూ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘు, చంద్రయ్య, సోమశిల తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్‌ప్లాజాలో నర్సరీ మేళా నిలిపివేత

● పోలీసుల అనుమతి లేకపోవడమే కారణం

ఖైరతాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ప్రారంభమైన నర్సరీ మేళా పోలీసుల అనుమతి లేకపోవడంతో మూసివేశారు. హెచ్ఎండీఏ అనుమతి తీసుకున్న నిర్వాహకుడు.. పోలీసుల నుంచి అనుమతి రాకముందే ప్రదర్శన ప్రారంభించడంతో శుక్రవారం నిలిపివేయించారు. సరైన పార్కింగ్ లేని కారణంగా పోలీసులు అనుమతి ఇవ్వలేదని తెలిసింది.

జేఎన్‌టీయూలో అరకొరగానే ‘స్పాట్’ అడ్మిషన్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో చివరి అంకమైన ‘స్పాట్’ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్‌లో మొత్తం 38 సీట్లు ఖాళీగా ఉండగా స్పాట్ ప్రక్రియలో 15 మంది అడ్మిషన్లు పొందారు. అన్ని అనుబంధ కాలేజీల్లో కలిపి మొత్తం 56 సీట్లకు 21 సీట్లే(37శాతమే) భర్తీ అయ్యాయి. శనివారం జగిత్యాల, మంథని జేఎన్‌టీయూ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మభ్యపెట్టి లైంగిక దాడి చేయడంతోపాటు పెళ్లి చేసుకున్న నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కన్నాయిపల్లికి చెందిన ఇరగదిండ్ల శివాజీ (20) రంగారెడ్డి జిల్లా కందుకూరు సమీపంలోని ఓ సంస్థలో కార్మికుడిగా పనిచేసేవాడు. అతడి నివాసానికి సమీపంలో ఉండే ఓ బాలికను ప్రేమ పేరుతో లొంగదీసుకొని పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు శివాజీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ చేపట్టిన రంగారెడ్డి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి.. నిందితుడు శివాజీకి జీవితఖైదుతోపాటు రూ.25 వేల జరిమానా విధించారు.

21న మిస్ అండ్ మిసెస్ హైదరాబాద్ పోటీల ఆడిషన్స్

పంజాగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో దాగి వున్న ప్రతిభను వెలికి తీయడానికి వివిధ విభాగాల్లో నిర్వహించే పోటీలు ఎంతో దోహదం చేస్తాయని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 21న నిర్వహించే మిస్ అండ్ మిసెస్ హైదరాబాద్ పోటీల ఆడిషన్స్ పోస్టర్‌ను శుక్రవారం ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్, అమల, స్వరూపలతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది ఆందోళన



ధర్నా చేస్తున్న కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది,కార్మికులు

పంజాగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్స్‌కు బేసిక్ పే నిర్ణయించి జీతాలు పెంచాలని, రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లకు పెంచాలని.. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిపై లింగ వివక్ష మానుకోవాలని ప్రగతిశీల కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం లక్డీకాపూల్‌లోని విద్యాశాఖ కమిషనరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పద్మ, అరుణ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ కేజీబీవీల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది రాష్ట్రంలోని ఇతర రెసిడెన్షియల్ పాఠశాల సిబ్బంది వేతనాల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారని తెలిపారు. అందరితో సమానంగా వేతనాలు పెంచకుండా స్కీమ్ పేరుతో వివక్షకు గురిచేయడం సరికాదన్నారు. అనంతరం కేజీబీవీ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

వాట్ ఈజ్ హ్యాపెనింగ్..

(5వ పేజీ తరువాయి)

చెత్తాచెదారం, వ్యర్థాలుండటంతో జీహెచ్ఎంసీ అధికారులపై దానకిశోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేరోడ్డులో బాలాపూర్ గణేష్ నిమజ్జన ఊరేగింపు జరుగుతుందని, పారిశుధ్యం, పరిశుభ్రతపై అలక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రెండురోజుల్లో బాలాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి డీఆర్‌డీఓ వెళ్లే రోడ్డు మార్గంతో పాటు బాలాపూర్ గణేష్ నిమజ్జన ఊరేగింపు మార్గంలో పారిశుధ్యం, పరిశుభ్రత నెలకొనేలా చూడాలన్నారు. ఈ మార్గంలో పెండింగ్ సీసీ, బీటీ రోడ్డు నిర్మాణపనులను మిషన్ మోడ్‌లో చేపట్టి పూర్తి చేయాలని, శాశ్వత వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ఊరేగింపు సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను సంబంధిత మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించాలని డీసీపీ సునీతకు సూచించారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ వాణి, ఉప కార్యనిర్వహణ ఇంజనీర్ వెంకన్నలకు సూచించారు. అనంతరం గుర్రం చెరువు రోడ్డు మార్గాన్ని పరిశీలించారు.

12 చెరువులు.. 887 నిర్మాణాలు



(5వ పేజీ తరువాయి)

చెరువు పరిధిలో 224 వరకు ఐదంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, దుకాణాలు, కాలనీలున్నట్లు గుర్తించారు. అల్వాల్‌లోని చిన్నరాయుని చెరువులో 185, కూకట్‌పల్లిలోని అంబీర్ చెరువులో 108, అల్లాపూర్‌లోని సున్నం చెరువులో 78, హస్మత్‌పేట్‌లోని బోయినిచెరువులో 125, గోపన్‌పల్లిలోని గోసానికుంటలో 34, పీర్జాదిగూడలోని పెద్ద చెరువులో 27, ఉప్పల్‌లోని నల్లచెరువులో 26, బైరామల్‌గూడలోని మద్దెలకుంటలో 12, దుండిగల్‌లోని చిన దామెర చెరువులో 7, చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువులో 60, నల్లగండ్లలోని నల్లగండ్ల చెరువులో 1 నిర్మాణం ఉన్నట్లు ఇటీవల గుర్తించారు.


చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని మద్దెలకుంట చెరువు

చిన్నరాయునిచెరువు

అల్వాల్ డివిజన్‌లోని చినరాయుని చెరువు దాదాపు 200 ఏళ్ల క్రితం ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించారు. తొలుత చెరువు విస్తీర్ణం 48 ఎకరాలు ఉండేది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. కొన్ని కాలనీలు ఏర్పడ్డాయి. చెరువు విస్తీర్ణం 24 ఎకరాలు ఉన్నట్లు అధికారులు ఇటీవల గుర్తించారు.

అంబీర్ చెరువు

కూకట్‌పల్లిలోని అంబీర్ చెరువు తొలుత 224 ఎకరాల్లో ఉండేది. 2022 లెక్కల ప్రకారం 154 ఎకరాలు ఉంది. ప్రస్తుతం 84 ఎకరాలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రగతినగర్‌కు వెళ్లేందుకు చెరువు మధ్యలో నుంచే రోడ్డు నిర్మించారు. దీంతో చెరువు రెండు ముక్కలుగా కనిపిస్తుంది. ఆల్విన్‌కాలనీ, తులసీనగర్, శ్రీరామ్‌నగర్, శంషీగూడ, శ్రీనివాస కాలనీ, శుభోదయ కాలనీ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ మెయిన్ రోడ్డు, లేక్‌వ్యూ కాలనీ, మధురానగర్ చెరువు స్థలంలోనే ఏర్పడ్డాయి.


అధికారులు నోటీసులు జారీ చేసిన హరిజన బస్తీ

చిన దామెర చెరువు

దుండిగల్ గ్రామంలోని చినదామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో కలిపి మొత్తం విస్తీర్ణం 114 ఎకరాలుంది. అయితే ఇందులో 8.24 గుంటలు కబ్జాకు గురై కాలేజీలు ఏర్పడ్డాయి. ఎంఎల్ఆర్ఐటీ, ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలల ప్రాంగణాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఉన్నట్లు ఇటీవల అధికారులు గుర్తించారు. యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.


అంబీర్ చెరువు బఫర్ జోన్‌లో వేసిన పిల్లర్లు

దుర్గం చెరువు

హైదరాబాద్ నగరానికి ప్రత్యేకమైన దుర్గం చెరువు భారీస్థాయిలో ఆక్రమణలకు గురైంది. 1974 ఇరిగేషన్, రెవెన్యూ రికార్డుల ప్రకారం గుట్టలబేగంపేట గ్రామంలో చెరువు విస్తీర్ణం 160.60 ఎకరాలు. అయితే ఈ సంఖ్యపై సందిగ్ధం నెలకొన్నది. ప్రస్తుతం 65.12 ఎకరాలు మాత్రమే ఉన్నది. ఈ లెక్కన చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోకి ఎన్ని ఆక్రమణలు వచ్చాయో అర్థం చేసుకోవచ్చు.

నల్లగండ్ల చెరువు

ఈ చెరువు 60 ఎకరాల్లో ఉండేది. పేదలతో పాటు రాజకీయ నాయకులు, వ్యాపారులు కబ్జా చేయడంతో కుంచించుకుపోయి.. ప్రస్తుతం 50 ఎకరాలు మిగిలింది.

గంగారం పెద్ద చెరువు

చందానగర్‌లోని పెద్ద చెరువులో 11.01 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తెలిసింది. అధికారులు ఇటీవల 60 మంది నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు.


ఓల్డు బోయినపల్లి హస్మత్‌పేట బోయిన్ చెరువు

ఉప్పల్ నల్ల చెరువు

సుమారు 200 సంవత్సరాల క్రితం ఈ చెరువు ఏర్పాటైంది. 103 ఎకరాలు ఉండాల్సిన చెరువు కబ్జాలతో ప్రస్తుతం 65 ఎకరాలకు చేరింది.

పీర్జాదిగూడ పెద్ద చెరువు

పీర్జాదిగూడలోని పెద్ద చెరువు (గూడెం చెరువు) సుమారు 150 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. నాడు 49 ఎకరాలు ఉండేది. ఆక్రమణలకు గురై ప్రస్తుతం 34 ఎకరాలు మిగిలింది. రెవెన్యూ అధికారులు ఇటీవల 130 మంది అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు.

గోసానికుంట

గోపన్‌పల్లిలోని గోసానికుంట వాస్తవ విస్తీర్ణం 6.25 ఎకరాలు. ఇప్పుడు 4.15 ఎకరాలకే పరిమితమైంది. కుంట ఉత్తరం, పడమర వైపున కేశవనగర్‌బస్తీ, తూర్పు, దక్షిణం వైపు విల్లాలు, కమర్షియల్ భవనాలున్నాయి.

శనివారం 31 ఆగస్టు 2024 ఆంధ్రజ్యోతి

నవ్య

9

కుటుంబ కదంబం



సగ్గుబియ్యం అంటే పాయసం గుర్తొస్తుంది. అయితే సగ్గుబియ్యంతో పరోటా, కిచిడీ, పునుకులు, హల్వానూ చేసుకోవచ్చు. వీకెండ్‌లో సులువుగా ఈ వంటలను చేసుకోండిలా...

సగ్గుబియ్యం రుచులు వారెవ్వా!

సగ్గుబియ్యం కిచిడి

కావాల్సిన పదార్థాలు:

సగ్గుబియ్యం- కప్పు, మీడియం సైజ్ బంగాళదుంప- 1, ఉల్లిపాయ-1 (మీడియం సైజ్), పల్లీలు- మూడు టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి- 3, జీలకర్ర- అరటీస్పూన్, ఉప్పు- తగినంత, తరిగిన కొత్తిమీర- టేబుల్ స్పూన్, కరివేపాకు- పది ఆకులు, నూనె- టేబుల్ స్పూన్, నిమ్మరసం- అరటీస్పూన్

తయారీ విధానం:

ముందుగా బంగాళదుంపను ఉడకబెట్టి తొక్క తీసి చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. పల్లీలను వేయించి పక్కన ఉంచుకోవాలి. ఇక సగ్గుబియ్యాన్ని మంచి నీళ్లతో కడిగి ఆ తర్వాత సగ్గుబియ్యానికి సరిపడ నీళ్లు వేసి నాలుగు గంటల పాటు నానబెట్టుకోవాలి. నాలుగు గంటల తర్వాత ఒకవేళ సగ్గుబియ్యంలో నీళ్లుంటే తీసేయాలి.

చిన్న మిక్సీ జార్‌లో సగం పల్లీలను పలుకులుగా ఉండేట్లు మిక్సీ పట్టాలి. బౌల్‌లో సగ్గుబియ్యం తీసుకుని ఇందులో సగం పల్లీల మిశ్రమాన్ని వేసి మిక్స్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, బంగాళదుంపల ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, ఉప్పు వేసి గరిటెతో వేయిస్తుండాలి. ఉల్లిపాయల రంగు మారిన తర్వాత పల్లీలు వేసి కలపాలి. చివరగా సగ్గుబియ్యం వేసి బాగా కలపాలి. లోఫ్లేమ్‌లో ఉంచి ప్యాన్‌పై మూత ఉంచి కుక్ చేయాలి. మూత చేసి గరిటెతో కలిపి నిముషం తర్వాత మరో రెండు నిముషాల పాటు మూత క్లోజ్ చేసి కుక్ చేయాలి. ఇందులో నిమ్మరసం, కొత్తిమీర వేసి కలపాలి. నిముషం పాటు కలిపి దించేసుకోవాలి. సగ్గుబియ్యం కిచిడీ రెడీ.

సగ్గుబియ్యం పునుకులు

కావాల్సిన పదార్థాలు

లావు సగ్గుబియ్యం- కప్పు, పుల్లని పెరుగు- కప్పు, తరిగిన కొత్తిమీర- ఒకటిన్నర టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, పచ్చిమిర్చి- 2 (సన్నగా తరగాలి), జీలకర్ర- టీస్పూన్, మీడియం సైజ్ ఉల్లిపాయ- 1 (సన్నగా తరగాలి), బియ్యం పిండి- 2 టేబుల్ స్పూన్లు, అల్లం ముక్క- చిన్నది (సన్నగా తరగాలి), నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం

ముందుగా సగ్గుబియ్యాన్ని శుభ్రం చేసుకోవాలి. బౌల్‌లో పెరుగు వేసి అందులో సగ్గుబియ్యంతో పాటు అరకప్పు నీళ్లు పోసి నాలుగైదు గంటల పాటు నానబెట్టుకోవాలి. సగ్గుబియ్యం నానిన తర్వాత ఈ మిశ్రమాన్ని పెద్ద బౌల్‌లోకి మార్చుకోవాలి. ఇందులో కొత్తిమీర, ఉల్లిపాయ ముక్కలు, బియ్యం పిండి, తరిగిన అల్లం వేసి బాగా కలపాలి. అవసరం అనుకుంటే కొద్దిగా నీళ్లు పోసి మాత్రమే కలపాలి. ఈ మిశ్రమాన్ని కలిపి పెట్టుకున్నాక.. గోళంలో నూనె వేయాలి. నూనె వేడయ్యాక పునుకులు వేసుకోవాలి. మీడియం ఫ్లేమ్‌లో మాత్రమే పునుకులను వేయించాలి. వేడి వేడి సగ్గుబియ్యం పునుకులను స్నాక్స్‌లా తినేయవచ్చు. అవసరం అనుకుంటే టమోటా కెచప్‌తో తినేయవచ్చు.



సగ్గుబియ్యం హల్వా

కావల్సిన పదార్థాలు: సగ్గుబియ్యం- కప్పు, బెల్లం- పావు కేజీ, ఇలాచి- కొద్దిగా, బాదం-10, జీడిపప్పు- 10, పొద్దు తిరుగుడు విత్తనాలు- పావు టీస్పూన్, నెయ్యి- 2 టీస్పూన్లు

తయారీ విధానం: సగ్గుబియ్యాన్ని కడిగి ఆ తర్వాత కప్పు నీళ్లు పోసి నాలుగు గంటలపాటు నానబెట్టుకోవాలి. ఆ తర్వాత సగ్గుబియ్యం తీసుకుని జార్‌లో వేసి మిక్సీ పట్టాలి. పావుకేజీ బెల్లాన్ని మెత్తగా పొడి చేసుకోవాలి. గుంత పాత్రలో బెల్లాన్ని వేసి.. ఇందులో చిన్న గ్లాసు నీళ్లు పోసి స్టవ్ మీద ఉంచి ఉడికించాలి. ఆ బెల్లం నీళ్లను ఫిల్టర్ చేసుకోవాలి. ఈ బెల్లం నీళ్లను ప్యాన్‌లో వేసి ఉడికించాలి. బెల్లం పొంగుతూ ఉడుకుతుంది. బెల్లం బాగా పాకం పట్టిన తర్వాత ముందుగా చేసుకున్న సగ్గుబియ్యం పిండిని కొంచెం కొంచెం పోసుకుంటూ కలపాలి. రెండు నిముషాలు బాగా కలిపాక.. ఆరెంజ్ ఫుడ్ కలర్ వేయాలి. ఆ తర్వాత గరిటెతో కదుపుతూ ఉండాలి. పొంగులా వస్తుంది. మూడు నిముషాల తర్వాత నెయ్యి పోసి కలపాలి. ఇందులో వేయించిన బాదం, జీడిపప్పు, పొద్దు తిరుగుడు విత్తనాలు వేసి కలపాలి. ఇలా కలుపుతూ ఉంటే గోళం నుంచి మిశ్రమం సపరేట్ అవుతున్నట్లు కనపడుతుంది. చతురస్రాకారం బాక్సులో అడుగుభాగంలో నూనె వేసి ఈ హల్వాను అందులో వేసి సమానంగా సర్దాలి. చల్లారిన తర్వాత ముక్కలుగా కట్ చేసుకుని తినాలి.



సగ్గుబియ్యం పరోటా

కావాల్సిన పదార్థాలు:

సగ్గుబియ్యం- 1 కప్పు, పల్లీలు- రెండు టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి- 4, వెల్లుల్లి రెబ్బలు- 3, బంగాళదుంపలు- 2 (మీడియం సైజ్), జీలకర్ర- అరటీస్పూన్, కొత్తిమీర- టేబల్ స్పూన్, కారం- టీస్పూన్, ఉప్పు- రుచికి సరిపడ, నూనె- మూడు టేబుల్ స్పూన్లు

తయారీ విధానం:

కప్పులో సగ్గుబియ్యం వేసి నీళ్లు పోయాలి. చేత్తో శుభ్రంగా కడిగితే సగ్గుబియ్యం మీద ఉండే పిండి పోతుంది. శుభ్రంగా కడిగిన సగ్గుబియ్యాన్ని మరో బౌల్‌లో వేసి సరిగ్గా కప్పు నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే సగ్గుబియ్యం పరోటా చేసుకోవటానికి ముందు సగ్గుబియ్యాన్ని చేత్తో పట్టుకుని చూస్తే మెత్తగా అయి ఉంటాయి. ఇక వెంటనే ప్యాన్ తీసుకుని అందులో పల్లీలు వేసి మీడియం ఫ్లేమ్‌లో వేయించాలి. మిక్సీ జార్‌లో పల్లీలు, పచ్చిమిర్చి, వెల్లుల్లి వేసి మరీ మెత్తగా కాకుండా మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమాన్ని సగ్గుబియ్యం బౌల్‌లో వేయాలి. ఇందులోనే బంగాళదుంపలను ఉడికించి వాటి మీద తొక్క తీసి ఆ దుంపలను తురుముకోవాలి. జీలకర్ర, కొత్తిమీర, కారం, ఉప్పు వేసి మెత్తగా కలపాలి.

చపాతీ పీట మీద పాలిథీన్ కవర్ వేసి కొద్దిగా నూనె వేసి చుట్టూ అప్లయ్ చేయాలి. ఇప్పుడు సగ్గుబియ్యం మిశ్రమాన్ని తీసుకుని పరోటాలా ఒత్తుకోవాలి. స్టవ్ ఆన్ చేసి మీడియం ఫ్లేమ్‌లో ఉంచి.. నూనె కొద్దిగా వేసి ప్యాన్ అంతా నూనెను స్ప్రెడ్ చేసి రెండు వైపులా కాల్చుకోవాలి. ఇలా కాల్చుకున్న తర్వాత ఈ సగ్గుబియ్యం పరోటాలను ఇట్లే తినేయవచ్చు లేదా పెరుగు చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.



ఆరోగ్యానికి అద్భుత సూపులు

తాం కండితాం దధివిమర్దిత ముద్గదాలిం
సంసాధితాం లవణగంధ సమాయుతాంచ
తే భుంజతే కుముదహాసకరార్థమూర్ధా
యేషాం సదా హృదయచారుగృహం నిషణ్ణ

సూపు అనగానే అది ఇంగ్లీషు వారి విదేశీ వంటకం అనే భ్రమలో చాలా ఇష్టంగా ఆస్వాదిస్తూ ఉంటాం. కానీ 'సూపం' పేరుతో రకరకాల సూపుల్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో పేర్కొన్నాడు. క్షేమశర్మ కాలం నాటికి ఈ దేశానికి ఆంగ్లేయులు రాలేదు. సూపులు రెండు రకాలు. చిక్కగా ఉండేవి (థిక్ సూప్స్), పలుచగా ఉండేవి (క్లియర్ సూప్స్). నిజానికి మన పప్పుచారు, చారు ఇలాంటి సూపులే. వాటిని అన్నంలో కలుపుకునే విధంగా మనం చేసుకుంటున్నాం. పులుపు, కారాలు తగ్గిస్తే తాగేందుకు వీలుగా ఉంటాయి. కొన్నింటిని వేడివేడిగా తాగితేనే బావుంటాయి. కొన్ని ఫ్రిజ్జులో పెట్టుకుని చల్లగా తాగితే కమ్మగా ఉంటాయి.

'సూపం' పలుచగానే ఉంటుంది. అందులో చిక్కబరిచే ద్రవ్యాల్ని కలిపితే చిక్కగా అవుతుంది. సూపులో కలిపే ద్రవ్యాలపై ఇది ఆధారపడి ఉంటుంది. ఫ్రెంచివాళ్లు 'ప్యూరీస్' పేరుతో కూరగాయల సూపులు చేసుకుంటారు. ఏ కూరగాయనైనా మెత్తగా మిక్సీ పట్టి, ఆ రసంలో కావలసిన పరిమళ ద్రవ్యాల్ని కలిపి కాచినది 'ప్యూరీ సూపు'. మనం ములక్కాడ చారు, టమోటా చారు వగైరాల్ని ఇలా సూపులా తాగేందుకు అనుకూలంగా చేసుకుంటే ఎక్కువ ఆరోగ్యకరం. ఆరు అంగుళాల సొరకాయ ముక్కని మిక్సీ పట్టి, ఆ రసంతో సూపు కాచుకుంటే పెద్ద గ్లాసుడు సొరకాయ సూపు తయారవుతుంది. పోషకాలతో పాటు చాలినంత ఫైబరు, జీర్ణశక్తిని పెంచే మిరియాలపొడి, ధనియాలు జీలకర్ర, సోంపు ఇలాంటివి ఇందులో ఉంటాయి. ఒక గ్లాసు సూపు తాగితే అది సంపూర్ణ ఆహారమే. క్రీమ్ కలిపితే మరింత రుచిగా ఉంటుంది. చిక్కదనం కావాలంటే బార్లీ, సగ్గుబియ్యం, శనగ, మొక్కజొన్న, సోయాబీన్ లాంటి ద్రవ్యాల పిండిని కలుపుతారు. కీరా, క్యారెట్, గుమ్మడి... ఇలా ఏ రకమైన కూరగాయతోనైనా సూపు చేసుకోవచ్చు.

> **'సుఖేనపీయతె సూపః'... కమ్మగా తాగటానికి వీలైనది 'సూపం'. బ్రాత్, సూప్, సాస్... ఇవన్నీ 'సూపం' ప్రతిరూపాలే. సూపు అనేది ఫ్రెంచ్ 'సూపే' నుంచి వచ్చిందని భాషావేత్తలు చెబుతారు. కానీ ఋగ్వేద కాలం నుంచీ 'సూపం' మనకు తెలుసు. 'సూపమే' సూపుకి మూలం.**

పెసరపప్పు సూపు...

పెసరపప్పుతో సూపు లేదా సూపం తయారు చేసుకునే విధానాన్ని క్షేమశర్మ ఇలా వివరించాడు:

'కండితం' అంటే పొట్టు తీసిన పెసరపప్పుని పెరుగులోగానీ మజ్జిగలోగానీ నానబెట్టి, మెత్తగా రుబ్బి, కావలసినన్ని నీళ్లు, కలిపి అందులో మీకు ఇష్టమైన పరిమళ ద్రవ్యాలు, సైంధవ లవణం చేర్చి కాచినది 'ముద్గ సూపం'. మూంగ్‌దాల్ సూప్ అని ఇంగ్లీషులో అంటారు. 'ముద్గసూపో లఘు గ్రాహీ కఫపిత్తహరో హిమః'... పెసరపప్పుతో ఇలా సూపు కాచుకుని తాగితే విరేచనాల వ్యాధిలో నీటి శాతాన్ని తగ్గిస్తుంది. చలవ చేస్తుంది. ఒంట్లో వేడిని చల్లబరుస్తుంది. దానిమ్మ గింజలు, ఎండు ద్రాక్ష, ఇతర డ్రైనట్స్ లాంటివి కలుపుకుని తాగితే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. కఫ పైత్యాల్ని తగ్గిస్తుంది. కంటికి మంచిది. పురుషులలో జీవకణాలను పెంచుతుంది.

పెసర, మినపప్పు సూపు...

ఇలాగే 'ముద్గ మాష కుల్మాష సూపం' అని మరొక సూపుని పేర్కొన్నాడు క్షేమశర్మ...

> **క్షేమశర్మ ఇక్కడ చెప్పిన రెండు సూపులూ ఉదాహరణార్థం మాత్రమే. వాటిని మనకు అనుకూలంగా మార్చుకుని, కమ్మని సూపుల్ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. పాలు పంచదార కలిపితే కీర్ అంటాం. ఉప్పు, కారం కలిపి వడగడితే సూపు అంటాం. పప్పు, కూరగాయలు లేదా ఆకుకూరలు అదనంగా కడుపులోకి చేరేందుకు ఇవి తోడ్పడతాయి.**

'అర్థ వికసితం స్విన్నాః కుల్మాషా ప ఎఎద్గ ప ాషజా! సైంధవేన స బాహ్లీకాః స్వాన్నస్యా తు గుణావహాః'... ఈ సూపు తయారు చేసుకోవటానికి క్షేమశర్మ, 'అర్థవికసితం స్విన్నాః'... అంటే సగం ఉడికిన ధాన్యం ఉపయోగిస్తారన్నాడు. 'కుల్మాషా' అంటే బార్లీ, సగ్గుబియ్యం లేదా బియ్యాన్ని సగం ఉడికించినది అని. పొట్టు తీసిన పెసరపప్పు, మినపప్పు, బార్లీ లేదా సగ్గుబియ్యం... వీటిని సమానంగా తీసుకుని



పైపైన ఉడికించండి. గంజి వార్చేసి మెత్తగా గుజ్జులా చేయండి. సూపు చిక్కగా లేదా పలుచగా ఉండేలా చాలినన్ని నీళ్లు కలిపి, పరిమళ ద్రవ్యాలు, ఉప్పు చేర్చి, చక్కగా ఉడికించి వడగట్టుకుంటే కమ్మని సూపు తయారవుతుంది. ఇంతకన్నా ప్రొటీన్ రిచ్ ఆహారం ఏముంటుంది! స్కూలు నుంచి రాగానే పిల్లలకు ఇస్తే తక్షణం శక్తి కలుగుతుంది. పుష్టిదాయకం. చిక్కిపోయేవాళ్లకి, ఆర్చుకుపోయేవాళ్లకి, తిన్నది వంటపట్టని వారికి ఇది మంచి ఆహారం.

కేవలం మినపప్పుతో కూడా ఇలానే సూపు కాచుకోవచ్చు. 'మాషసూపోథస్నిగ్ధోనిలాపః! ఉష్ణో సంతర్పణోబల్యః సుస్వాదూ రుచికారకః'... మినపప్పు సూపు శరీరానికి స్నిగ్ధత్వాన్నిస్తుంది. స్థూలత్వాన్ని కలిగిస్తుంది. పురుషత్వాన్ని పెంచుతుంది. వాత వ్యాధుల్లో చాలా మేలు చేస్తుంది. కీళ్లవాతం నడుము నొప్పి లాంటివి ఉన్నవారికి మినప సూపు మేలు చేస్తుంది. కొద్దిగా వేడినిస్తుంది. సమస్త పోషకాలూ ఇందులో ఉంటాయి. రుచికారకం. జీర్ణశక్తిని పెంచుతుంది.

• గంగరాజు అరుణాదేవి

సాహో రాధా...

కార్యదక్షత, సామాజిక బాధ్యత, నిరాడంబరత... రాధా వెంబు వీటన్నిటి కలయిక. "మన గురించి చెప్పాల్సింది మనం కాదు, మనం చేసే పని" అని గట్టిగా నమ్మే ఆమె ప్రచారానికి ఆమడదూరంలో ఉంటారు. 'స్వయంకృషితో ఎదిగిన అత్యంత సంపన్న భారతీయ మహిళ'గా మరోసారి 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్'లో చోటు దక్కించుకున్న రాధ వితరణ శీలిగానూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

సంపన్నులు, వ్యాపార సామ్రాజ్యాల అధిపతులు ఎంతో విలాసంగా ఉంటారనే ఊహలకు... రాధా వెంబు జీవనశైలి పూర్తి భిన్నంగా ఉంటుంది. సాధారణమైన చీర కట్టు, అక్కడక్కడ నెరిసిన జుట్టుతో సాధా



రణ గృహిణిగా కనిపించే యాభై రెండేళ్ళ రాధ... ఒక పెద్ద టెక్ కంపెనీకి చోదకశక్తి. మధ్యతరగతి కుటుంబం నుంచి ప్రారంభమై, స్వయంకృషితో సంపన్నురాలైన భారతీయ మహిళగా నిలవడం వరకూ ఆమెది స్ఫూర్తిదాయకమైన ప్రయాణం.

అప్పుడు వాళ్ళే వెతుక్కుంటూ వస్తారు...

తమిళనాడులోని తంజావూరులో పుట్టిన రాధ చదువు చెన్నైలో సాగింది. ఆమె తండ్రి సాంబమూర్తి మద్రాసు హైకోర్టులో స్టెనోగ్రాఫర్‌గా పనిచేసేవారు. రాధ.. మద్రాస్ ఐఐటిలో ఇండస్ట్రియల్ మేనేజిమెంట్ డిగ్రీ చేశారు. అప్పటికే ఆమె అన్న శ్రీధర్... 'అడ్వెనెట్' అనే టెక్ సంస్థను ఏర్పాటు చేశారు. తరువాత అదే 'జోహో కార్పొరేషన్'గా మారింది. జోహో.. ఒక సాఫ్ట్ వేర్ అభివృద్ధి సంస్థ. ప్రస్తుతం ఇ-మెయిల్ సేవలు అందించే ప్రసిద్ధ సంస్థల్లో ఒకటి. దానికి రాధ సహ-వ్యవస్థాపకురాలు. కానీ మామూలు ఉద్యోగిగానే చేరారు. తరువాత ప్రాజెక్ట్ మేనేజర్ అయ్యారు. తన అన్న శ్రీధర్‌ను గురువుగా, మార్గదర్శిగా భావించే రాధ... ఆ సంస్థను ఉన్నత స్థానంలో నిలపడానికి అపారమైన కృషిచేశారు. తెన్‌కాశీలోని తమ గ్లోబల్ కార్యాలయంలో కంపెనీ వ్యవహారాలను శ్రీధర్ చూసుకుంటూ ఉంటే.. చెన్నైతోపాటు దేశ విదేశాల్లోని తమ ఆఫీసుల నిర్వహణను రాధ చూసుకొనేవారు. క్రమంగా 'జోహో' విస్తరించింది. దానితోపాటే రాధ బాధ్యతలూ పెరిగాయి. ఉత్పత్తుల నిర్వహణ, ఉద్యోగ బృందాలతో సమన్వయం లాంటి పనులన్నీ ఆమె నిర్వహిస్తూ వచ్చారు. "మా అన్న, నేను ఎప్పుడూ టెక్ రంగం గురించే మాట్లాడుకొనేవాళ్ళం. నాణ్యతలో మన కంపెనీలు విదేశీ కంపెనీలతో పోటీ పడాలంటే ఏం చెయ్యాలని ఆలోచించేవాళ్ళం. ఒక కస్టమర్ మన దగ్గరకు వచ్చినప్పుడు.. మనం అందించే ఉత్పత్తి అతనికి ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించాలి. అప్పుడే మనం విజయం సాధించగలం. దానికోసం కంపెనీలో సాంకేతికతలను ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తూ ఉండాలి. అప్పుడు కస్టమర్లే మనల్ని వెతుక్కుంటూ వస్తారు." అంటారు రాధ. చాలా టెక్ కంపెనీల ప్రధాన కార్యాలయాలు విదేశాల్లోని పెద్ద నగరాల్లో ఉంటే.. 'జోహో' మాత్రం మన దేశంలోని చిన్న పట్టణాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

సంపదకోసం రాలేదు...

కొన్నేళ్ళుగా భారత దేశంలో సొంతంగా ఎదిగిన అత్యంత సంపన్నుల జాబితాల్లో రాధ పేరు చోటు చేసుకుంటోంది. గత రెండేళ్ళుగా ఆ జాబితాలో ఆమె అగ్రస్థానంలో ఉన్నారు. ఆమె నికర విలువ రూ.47,500 కోట్లుగా 'హురున్' పేర్కొంది. కానీ ప్రచారానికి ఎప్పుడూ ఆమె దూరంగా ఉంటారు. కొత్త ఆవిష్కరణలను సాదరంగా ఆహ్వానిస్తారు. తన చర్యలు, విలువల ద్వారా ఇతరులకు ఆదర్శంగా ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య ఆరోగ్యం తదితర కార్యక్రమాల కోసం నిధులు అందిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లోనూ ఆమె ముందుంటారు. కిందటి ఏడాది 14 కోట్ల రూపాయలను సామాజిక సేవ కోసం ఆమె ఖర్చు చేశారు. 'జోహో కార్పొరేషన్'లో ప్రధాన బాధ్యతల నిర్వహణతో పాటు... జానకి హైటెక్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్, హైలాండ్ వ్యాలీ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు ఆమె డైరెక్టర్. జోహోలో అత్యధిక వాటా ఆమెదే. రాధ భర్త రాజేంద్రన్ దండపాణి... అక్కడే డైరెక్టర్ ఆఫ్ ఇంజనీరింగ్‌గా ఉన్నారు. ఆదిత్య రాజేంద్రన్ వారి ఏకైక సంతానం. తోటపనులంటే రాధకు ఎంతో ఆసక్తి. అలాగే సంప్రదాయాలకు ఎంతో విలువనిస్తారు. "సంపన్నురాలిని కావాలనే కోరికతో నేను ఈ రంగంలోకి రాలేదు. నేను కొన్ని నియమాలు, సూత్రాలు పెట్టుకున్నాను. వాటికి అనుగుణంగానే నా పనితీరు ఉంటుంది. పర్యావరణానికి ఎలాంటి హాని చెయ్యకూడదనేది వాటిలో ఒకటి. మా కార్యాలయాలన్నిటినీ పర్యావరణానుకూలంగా రూపుదిద్దాం" అని చెబుతారామె. "జోహో విజయాలన్నిటి వెనుకా ఆమె ఆలోచనలు, శ్రమ చాలా ఉన్నాయి. సాదాసీదాగా కనిపిస్తారు కానీ... పరిస్థితులకు అనుగుణంగా కచ్చితమైన నిర్ణయాలు తీసుకొనే సారథి. పక్షపాతాలకు అతీతంగా... అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తారు. ఇదే ఆమె విజయరహస్యం" అనేది జోహో ఉద్యోగులు, ఆమె సన్నిహితుల మాట.

'హిడెన్ కెమెరా'... షాపింగ్ మాల్స్, హోటల్ గదులు, లేడీస్ హాస్టళ్లు... నిత్యం ఎక్కడో అక్కడ మహిళలు వీటి బారిన పడుతూనే ఉన్నారు. తాజాగా గుడ్లవల్లేరు కాలేజీ హాస్టల్ బాత్‌రూమ్‌లో రహస్య కెమెరాలు బయటపడడంతో ఆందోళనలు వెల్లువెత్తాయి. ఇలాంటి దారుణాలను అరికట్టేదెలా? అందుకు కఠినమైన చట్టాల అమలు ఒక్కటే మార్గమంటున్నారు హైదరాబాద్‌కు చెందిన వరలక్ష్మి. ఆ దిశగా అలుపెరుగని కృషి చేస్తున్న ఆమె... 'హెవెన్ హోమ్స్ సొసైటీ' పేరుతో స్పై కెమెరాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఆ వివరాలను 'నవ్య'తో పంచుకున్నారు.

ఆ కెమెరా కళ్లను చట్టంతో పొడవాలి

"బలాత్కరించి, హత్య చేస్తే గగ్గోలు పెట్టేస్తాం. ఉద్యమాలు, నిరసన ప్రదర్శనలతో బాధితులకు న్యాయం జరిగే వరకూ నిరంతరంగా పోరాడతాం. నిజానికి స్పై కెమెరాలతో చిత్రించే రహస్య వీడియోలతో మహిళలకు జరిగే నష్టం ఇంతకంటే ఎక్కువ. స్పై కెమెరాలతో చిత్రించే వీడియోలు ప్రపంచమంతా ప్రయాణించి కోట్ల మంది చేతులు మారతాయి. దీన్నే వ్యాపారంగా మలుచుకుని, స్పై కెమెరాలతో చిత్రించే రహస్య వీడియోలను కుర్రకారుకు అమ్ముకునేవాళ్లున్నారు. ఇదొక భారీ మాఫియా. కానీ గుట్టుచప్పుడు కాకుండా, చాప కింద నీరులా విస్తరిస్తున్న ఈ విష సంస్కృతికి అడ్డుకట్ట వేయడం కోసం నేను ఎంతోకాలంగా కృషి చేస్తున్నాను. 2016లో సెన్సార్ బోర్డు మెంబర్‌గా ఉన్నప్పుడే స్పై కెమెరా సమస్య నా ముందుకొచ్చింది. దాంతో ఈ సమస్య గురించి పరిశోధించి, నివేదికను రూపొందించి, హైకోర్టులో పిల్ వేశాను. అప్పటి నుంచి ఈ రోజు వరకూ స్పై కెమెరాలపై జాతీయ స్థాయిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నాను. కాలేజీలు, పని ప్రదేశాలు, బడులు, హాస్టళ్లలో మహిళల భద్రత గురించి క్యాంపెయిన్లు నిర్వహించాను. స్పై కెమెరాలను ఎలా, ఎక్కడ ఏర్పాటు చేస్తారు? వాటినెలా గుర్తించాలి? గుర్తించిన తర్వాత ఏం చేయాలి? అనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నాను.

ఊహించని చోట, ఊహించని రూపాల్లో...

తెలియని కొత్త ప్రదేశాల్లో మనందరం స్పై కెమెరాల గురించి అప్రమత్తతతో వ్యవహరిస్తాం. కానీ వాటి పరిధి పెద్దది. మనం ఊహించని వస్తువుల్లో, ఊహించలేని ప్రదేశాల్లో, ఊహించని విధానంలో మన వీడియోలను సంవత్సరాల తరబడి రికార్డు చేయగలిగే సామర్థ్యం వాటికి ఉంటుంది. మనం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ నిర్మాణ సమయంలోనే ఈ ఏర్పాట్లన్నీ జరిగిపోతూ ఉండవచ్చు. సాన్నిహిత్యంగా గడిపిన దంపతుల వీడియోలు బజారు పాలవడానికి ఇలాంటి రహస్య కెమెరాలే కారణం. నిజానికి ఈ స్పై కెమెరాల పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తూ, భయంభయంగా బతకడం అందరికీ, అన్ని సందర్భాల్లోనూ సాధ్యం కాకపోవచ్చు. కుటుంబ పెద్దకు గుండెపోటు వస్తే సమర్థమైన చికిత్స మీదే దృష్టి పెడతాం తప్ప అదే ఆస్పత్రి బాత్‌రూమ్‌లో బిగించిన రహస్య కెమెరా మీదకు ఆలోచన వెళ్లదు కదా! ఒత్తిడితో, ఆందోళనతో కూడుకున్న జీవనశైలిలో అనుక్షణం ఏమరుపాటుగా వ్యవహరించడం ఎంతవరకూ సాధ్య పడుతుంది? కాబట్టే స్పై కెమెరాల అమ్మకాలను నియంత్రించడంతో పాటు, ఆ నేరాలకు పాల్పడిన వ్యక్తులకు నిర్భయ చట్టం కింద బెయిలుకు వీలులేని శిక్షలు అమలు పరచవలసిందిగా నేను ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నాను. హైకోర్టులో పిల్ వేయడంతో ఆగిపోకుండా కేంద్ర ప్రభుత్వానికి కూడా నివేదిక సమర్పించాను. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో మహిళల ఫొటోలు తీసినా, షేర్ చేసినా కఠిన నేరంగా పరిగణించాలని హైకోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నాను. స్పై కెమెరాలను ఎవరు, ఎందుకు కొంటున్నారు? కొన్నవాటిని ఏ అవసరాల కోసం ఎక్కడ ఉపయోగిస్తున్నారు? అనే ప్రామాణికాలను అనుసరించే చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

> **పసిగట్టలేకపోతున్నాయి...**
>
> బల్బులు, లైట్లు, ఫ్యాన్లు, గిఫ్ట్ ఆర్టికల్స్, టెడ్డీ బేర్స్, బటన్స్, కీచైన్స్... దేన్లోనైనా అమర్చే వీలున్న స్పై కెమెరాలు ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి. ఈ కెమెరాలను కనిపెట్టడం కష్టం. వీటిని ఎవరికివారు ఆన్‌లైన్‌లో కూడా కొనుగోలు చేసుకుని వాడుకునే వీలుంది. ఈ కెమెరాలను కనిపెట్టే హిడెన్ కెమెరా యాప్స్, గ్యాడ్జెట్స్ కూడా అందుబాటులో ఉన్నప్పటికీ, అవి అనుకున్నంత సమర్థంగా పసిగట్టలేక పోతున్నాయి. రహస్య కెమెరాకు ఎంతో చేరువగా ఉంచినప్పుడు తప్ప ఆ యాప్స్, గ్యాడ్జెట్స్ వాటిని గుర్తించలేకపోతున్నాయి.

ఇప్పుడు ప్రభుత్వం వంతు...

గత నెల జెఎన్‌టియులో జరిగిన ఓ అవగాహన కార్యక్రమంలో డ్రగ్స్, ట్రాఫిక్, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, స్పై కెమెరాలు... ఈ నాలుగు అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన సమస్యలుగా గుర్తించింది. కానీ ఈ నాలుగు అంశాల్లో స్పై కెమెరాల అంశం ఒక్కటే గుర్తింపునకు నోచుకోకుండా ఉండి



పోతోంది. రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. నా వంతుగా నేను 300 మంది పీటీమ్స్‌కు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శిక్షణ ఇప్పించాను. శిక్షణ తీసుకున్న ప్రతి ఇద్దరు పిల్లలు, వాళ్ల వాళ్ల కాలేజీల్లోని ఎన్ఎస్ఎస్ బృందాలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. షీటీమ్స్ కూడా వీళ్లకు సహకరించాలని కోరాం. కానీ ప్రభుత్వం మిగతా అంశాల పట్ల కనబరుస్తున్న శ్రద్ధను స్పై కెమెరాల విషయంలో కనబరచడంలేదు. నేను హైకోర్టులో వేసిన పిల్ ఇప్పుడు కౌంటర్‌కు వచ్చింది. అయినా ప్రభుత్వం ఇప్పటివరకూ అక్రమ స్పై కెమెరాల అడ్డుకట్టకు తీసుకున్న చర్యల గురించిన వివరాలను సమర్పించకపోవడం శోచనీయమే. కేవలం షాపింగ్ కాంప్లెక్స్‌లకు వెళ్లి అక్కడి దుకాణాలను వెతికి, అక్రమ స్పై కెమెరాలు లేవనే ఒక గుర్తింపు స్టిక్కర్‌ను అంటించడంతోనే సరిపెట్టుకుంటే, అది మొక్కుబాటు చర్య అవుతుంది.

పర్యవేక్షణ కీలకం...

గత మేలో నిజామాబాద్ స్కానింగ్ సెంటర్‌లో ఇలాంటి స్పై కెమెరా బయటపడినప్పుడు, జిల్లా కలెక్టర్ వేగంగా స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ ఆ తర్వాత నిందితులను పట్టుకున్నదీ లేనిదీ ఎవరికీ తెలియదు. ఒకవేళ పట్టుకున్నా, మరుసటి రోజే బెయిల్ మీద బయటకు వచ్చేస్తున్న సందర్భాలున్నాయి. మహిళల మీద ఎన్నో రకాల అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఎంతోమంది మహిళలు కనిపించకుండా పోతున్నారు. ఈ నేరాలన్నిటిలో ఏదో ఒకచోట స్పై కెమెరాల ప్రమేయం ఉంటోంది. ప్రత్యేకించి మిస్సింగ్ కేసులకూ... స్పై కెమెరాలకు కచ్చితంగా సంబంధం ఉంటుంది. లీక్ అయిన అసభ్య వీడియోల గురించి ఎవరికీ చెప్పుకోలేక, ముఖం చూపించలేక, అవమానంతో, భయంతో ఆత్మహత్యలకు పాల్పడే అమ్మాయిలు కూడా ఉన్నారు. వేరొకరితో సన్నిహితంగా గడిపిన వీడియోలు లీక్ కావడంతో గొడవలు పడి విడిపోతున్న దంపతులూ ఉన్నారు. బ్లాక్‌మెయిల్‌ను తట్టుకోలేక ప్రాణాలు తీసుకుంటున్నవాళ్లూ ఉన్నారు. ఈ దారుణాలకు అడ్డుకట్ట పడాలంటే స్పై కెమెరాల విక్రయాల మీద పర్యవేక్షణ ఉండాలి. ఈ అక్రమ కెమెరాల కళ్లను చట్టంతో పొడవాలి."

- గోగుమళ్ల కవిత

మిలిటరీ స్కూళ్లలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలు



దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: పరీక్షలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.rashtriyamilitaryschools.edu.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BfBWd3tలో చదవండి.

ఇఫ్లూలో సంస్కృతం కోర్సు

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)- 'ప్రొఫిషియెన్సీ కోర్స్ ఇన్ శాన్‌స్క్రిట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 25 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి 50 గంటలు. తరగతులు సెప్టెంబరులో ప్రారంభమవుతాయి. బుధవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

కోర్సు వివరాలు: కోర్సులో భాగంగా సంస్కృత భాషకు సంబంధించి వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం నేర్పిస్తారు. ప్రాథమిక వ్యాకరణం, పదాలు, వాక్యాల నిర్మాణం తదితరాలకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత: పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులకైతే ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. వీరికి వీసా, రెసిడెంట్ పర్మిట్ తప్పనిసరి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

1న ఐడీపీ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

యూకే, యూఎస్, ఐర్లాండ్ వంటి దేశాల్లో విదేశీ విద్యను అభ్యసించాలనుకునే వారి కోసం ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ ఐడీపీ సెప్టెంబరు 1 ఆదివారం రోజున హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తోంది. వివిధ దేశాలకు చెందిన సుమారు 80 ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు ఇందులో పాల్గొంటున్నాయి. అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, అర్హతలు, స్కాలర్‌షిప్స్, వీసా పొందడం తదితర అంశాలపై సంబంధిత వర్సిటీల ప్రతినిధులు అభ్యర్థులకు అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా కోర్సు పూర్తయిన తరవాత ఉండే ప్లేస్‌మెంట్స్ గురించి కూడా వివరిస్తారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్‌లో ఉన్న హోటల్ 'ద పార్క్'లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది.

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో

బీవీఎస్సీ & ఏహెచ్



ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాదిపాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్‌న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

నవ్య | చిత్రజ్యోతి

బాలకృష్ణ స్వర్ణోత్సవ సభకు అతిరథమహారథులు



నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. సెప్టెంబర్ ఒకటిన నోవాటెల్ హోటల్‌లో ఈ వేడుకలకు అతిరథమహారథులు హాజరవుతున్నారు. ఇప్పటికే ఎంతో మందికి ఆహ్వానాన్ని అందించారు. ఇంకా కొంతమందికి పిలుపులు వెళ్లలేదని వస్తున్న వార్తలపై శుక్రవారం సాయంత్రం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి క్లారిటీ ఇచ్చింది. కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు చిత్రపరిశ్రమలోని అన్ని శాఖలు కలసి ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారు. ఇతర భాషల సినీ ప్రముఖులు కూడా వస్తారు. ఫిజికల్‌గా ఎవరికైనా ఇన్విటేషన్ అందకపోయినా ఇదే మా వ్యక్తిగత ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలి' అని కోరారు. ఈ కార్యక్రమంలో చదలవాడ శ్రీనివాసరావు, సి.కల్యాణ్, మాదాల రవి, భరత్‌భూషణ్, ప్రసన్నకుమార్, శివబాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, అశోక్‌కుమార్, మాధవపెద్ది సురేశ్, అనిల్‌కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ కూడా అలాంటి కమిటీ వేయాలి

మాలీవుడ్‌లో కొనసాగుతున్న కీచకుల అకృత్యాలను బయట పెట్టిన జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌ను హీరోయిన్ సమంత స్వాగతించిన విషయం తెలిసిందే. తెలుగు చిత్ర పరిశ్రమలోని లైంగిక వేధింపులపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించాలనీ, జస్టిస్ హేమ కమిటీ తరహాలో ఇక్కడ కూడా ఓ కమిటీ వేయాలని సమంత కోరారు. వేధింపులకు గురికాకుండా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం అప్పుడే మహిళా ఆర్టిస్టులకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.



'తెలుగు చిత్రపరిశ్రమలో మహిళలుగా మేమంతా జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌కు స్వాగతం పలుకుతున్నాం. అలాగే కీచకులపై పోరాటం చేస్తున్న డబ్ల్యూసీసీ చర్యలను అభినందిస్తున్నాం. మాలీవుడ్‌లో మహిళల హక్కుల కోసం డబ్ల్యూసీసీ విజయవంతమైన పోరాటం చేసింది' అని సమంత అన్నారు.

చిరంజీవి సినిమాలో నటిస్తున్నా



● చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

మెగాస్టార్ చిరంజీవితో కలసి సినిమాలో నటించే అవకాశం లభించనుందని కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి తాను పెద్ద అభిమానినని అన్నారు. ఆయనకు తనపై ప్రేమ ఉందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు హైదరాబాద్‌లోని ఇంటికి పిలిపించి సన్మానం చేశారని అన్నారు. పవన్ కల్యాణ్ గెలిచినప్పుడు తాను ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా చేస్తున్నారని, అది ముగిశాక ప్రారంభమయ్యే మరో సినిమాలో తాను నటిస్తానని తెలిపారు. తన పాత్ర ఏమిటనేది భవిష్యత్తులో తెలుస్తుందని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

శ్రీరంగపురంలో కల్యాణం



వనపర్తి జిల్లా శ్రీరంగపురంలోని రంగనాథ స్వామి ఆలయం మా కుటుంబానికి చాలా ప్రత్యేకం. సిద్ధార్థ్‌తో నా నిశ్చితార్థం అక్కడే జరిగింది. త్వరలో మా పెళ్లి కూడా అక్కడే జరుగుతుంది' అని కథానాయిక అదితీ రావ్ హైదరీ చెప్పారు. మార్చిలో వారిద్దరికీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తమ ప్రేమ, పెళ్లి గురించి అదితీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెళ్లి తేదీని పెద్దలు నిర్ణయిస్తారు, మేం ఇద్దరం కలసి ప్రకటిస్తామని చెప్పారు. 'మహాసముద్రం' సినిమా చిత్రీకరణ సమయంలో సిద్ధార్థ్, అదితీ ప్రేమలో పడ్డారు.

అవసరమైతే కోర్టుకు వెళ్తా



బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల ముంగిట వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను నిషేధించాలంటూ పలు సిక్కు సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యయిక పరిస్థితి ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిది. ఇందిరా గాంధీ పాత్రను పోషించడంతో పాటు కంగనే ఈచిత్రానికి దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 06న 'ఎమర్జెన్సీ'ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు కంగన సన్నాహాలు చేశారు. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల సందిగ్ధంలో పడింది. తమ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కంగన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమాను విడుదల చేసేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని ఆమె చెప్పారు. సినిమాలను విడుదల చేస్తే చంపేస్తామంటూ వస్తున్న బెదిరింపుల గురించి మాట్లాడుతూ 'నన్ను భయపెట్టాలని చూసినంత మాత్రాన చరిత్ర మారిపోదు కదా' అని కంగన అన్నారు. సంజయ్ గాంధీ పాత్ర పోషించిన విశాక్ నాయర్‌కు సైతం బెదిరింపులు వచ్చాయి.



ఇటీవల కర్నాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకుని ఒక్కటైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ రిసెప్షన్ శుక్రవారంహైదరాబాద్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



అభిమానుల ప్రేమలో తడిసి ముద్దయ్యారు హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఏంజెలీనా జోలీ. వెనీస్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఆమె నటించిన 'మరియ' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. షో పూర్తవ్వగానే అందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో ఆమె నటనను అభినందించారు. దాదాపు ఎనిమిది నిమిషాల పాటు థియేటర్ అంతా మార్మోగింది. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమతో ఉద్వేగానికి లోనైన ఏంజెలీనా కన్నీళ్లను ఆపలేకపోయారు. సహనటుడు ఫియర్స్ ఫావినో ఆమెను సముదాయించారు. అభిమానులకు ఏంజెలీనా ధన్యవాదాలు తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎన్నో కష్టాలు అనుభవించి ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు అని అభిమానులు ఏంజెలినాను ప్రశంసిస్తున్నారు.

అభిమానుల ప్రేమకు ఆనంద భాష్పాలు

టీవీ రంగంలోనూ లైంగిక వేధింపులు

● సీనియర్ నటి కుట్టిపద్మిని



తమిళ చిత్రసీమతోపాటు టీవీ రంగంలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు కొదువలేదని సీనియర్ నటి కుట్టిపద్మిని ఆరోపించారు. ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సినిమాల్లోనే కాదు టీవీ సీరియల్స్‌లో నటించే యువతులు కూడా లైంగిక వేధింపులకు గురవడం సహజంగా మారిపోయింది. అలా వేధింపులకు గురయ్యేవారు సమాజానికి భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయడం లేదు. పారితోషికాలు పెద్ద మొత్తంలో లభిస్తుండటంతో కొంతమంది ఈ లైంగిక వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసేవారికి మళ్లీ సినిమాల్లో నటించే అవకాశాలు లభించడం లేదు. నటుడు సురేశ్ గోపీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఎక్కడున్నాయంటూ కొంతమంది అడుగుతున్నారు, ఆధారాలు ఎవరిస్తారు?' అని ఆమె ప్రశ్నించారు. దీనికి సీబీఐ విచారణ లాగా లై డిటెక్టర్లతో పరీక్షల చేయడం మినహా మరో మార్గం లేదన్నారు. దర్శకులు, సాంకేతిక నిపుణుల నుండి మహిళలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని, అవి భరించలేక ఎంతోమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కుట్టి పద్మిని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నా



తెలుగు సినిమాల్లో తండ్రి పాత్రలు దాదాపు ఒకేలా ఉంటున్నాయి. అయినా తనకు ఇచ్చిన పాత్రల్లో వైవిధ్యం చూపించడానికి కృషి చేస్తున్నారు నటుడు ఆనంద చక్రపాణి. 'దాసి' చిత్రంతో తొలిసారిగా తెరపై కనిపించి లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ 'మల్లేశం' సినిమాలో తండ్రి పాత్రతో ఎంట్రీ ఇచ్చారు. ఒకే ఒక్క ఛాన్స్ జీవితాన్ని మలుపు తిప్పుతుందని చాలా సందర్భాల్లో నిజమైన విషయం. అలాగే 'మల్లేశం' చిత్రం ఆనంద చక్రపాణి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఇప్పటికి 45పైగా చిత్రాల్లో నటించేలా చేసింది.. అవన్నీ విభిన్న పాత్రలు కావడం తన అదృష్టం అంటూ ఆనంద చక్రపాణి చెప్పిన విశేషాలు ఇవి.

- చిన్నప్పటి నుంచి నాకు నటన అంటే ఇష్టం. మంచి నటుడుగా పేరు తెచ్చుకోవాలనే కోరిక ఉండేది. మంచి బ్రేక్ కోసం ఎదురు చూశాను. అది 'మల్లేశం' రూపంలో వచ్చింది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. ఒక పెద్ద హిట్ పడితే అందరి దృష్టిలో పడతాను. 'రాజు యాదవ్' చిత్రంలో నా పాత్రకు మంచి పేరు వచ్చింది. సినిమా తేడాగా ఉండడంతో ఆడలేదు. ఒక్కోసారి మనం ఎంత బాగా చేసినా సినిమా ఆడకపోతే ప్రయోజనం ఉండదు కదా 'మల్లేశం' స్థాయి పాత్ర నాకు మళ్లీ 'అనగనగా ఒక అతిథి' సిరీస్‌లో వచ్చింది. అందులో నాలుగే నాలుగు పాత్రలు. అందులో తండ్రి పాత్ర కూడా నాకు మంచి పేరు తెచ్చింది.
- ఇంతకుముందు అడ్వర్‌టైజ్‌మెంట్ రంగంలో ఉన్నాను. యాడ్ ఫిల్మ్స్ డైరెక్ట్ చేశాను. ఇప్పుడు మాత్రం నటన మీదే దృష్టి పెట్టాను. నాకు ఇచ్చిన పాత్రకు పూర్తి న్యాయం చేకూర్చడానికి చాలా హోమ్ వర్క్ చేస్తుంటాను. ఆ పాత్రలో ప్రవేశించడానికి మానసికంగా స్ట్రగుల్ అవుతాను. అందరూ అలాగే చేస్తుంటారు కానీ నాకు కూడా ఆ గుణం ఉంది. అందుకేనేమో ఎమోషనల్ ఫాదర్ వేషం అంటే నాకే పిలుపు వస్తుంది.
- పాత రోజుల్లో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన చిత్రాలన్నీ వదిలిపెట్టకుండా చూసేవాణ్ణి. ఆర్ట్ ఫిల్మ్స్‌తోనే నా నడక మొదలైంది కనుక ఆ తరహా చిత్రాలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లో షబానా అజ్మీ, నజీరుద్దీన్ షా, ఓంపురి, స్మితాపాటిల్ నటించిన సినిమాలు ఎక్కువగా వచ్చేవి. ఆ చిత్రాల ప్రభావం నా మీద బాగా ఉండేది. ఈమధ్య కాలంలో నవాజుద్దీన్, ఇర్ఫాన్ ఖాన్ వంటి నాచురల్ ఆర్టిస్టులు ఎంతో అద్భుతంగా నటిస్తున్నారు. పాత్రలో రాణించడానికి చాలా హోమ్ వర్క్ చేస్తారు. అవన్నీ చూసి ప్రేరణ పొంది, నాచురల్‌గా నటించడానికి కృషి చేస్తున్నాను. మెలో డ్రామా నాకు నచ్చదు.
- ప్రస్తుతం నాలుగు చిత్రాలు షూటింగ్ దశలో, మరో రెండు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ'లో మంచి పాత్ర చేస్తున్నాను. అలాగే పర్యావరణం మీద చేస్తున్న 'గాంధీతాత జట్టు' కూడా నాకు మంచి పేరు తెస్తుందనే ఆశతో ఉన్నా.

డబుల్ ఫన్..థ్రిల్



విజయం సాధించిన 'మత్తు వదలరా' చిత్రానికి సీక్వెల్‌గా 'మత్తు వదలరా 2' వస్తోంది. శ్రీసింహా కోడూరి లీడ్ రోల్‌లో, సత్య సైడ్ కిక్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకుడు. మైత్రీ మూవీస్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా, సునీల్, అజయ్, రోహిణి ఇతర ముఖ్య పాత్రధారులు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అనంతరం హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'డబుల్ ఫన్, థ్రిల్ ఉండేలా సెకండ్ పార్ట్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదలవుతుంది' అని చెప్పారు. ఫస్ట్ పార్ట్‌లోనే ఒక ఐడియాను ప్లాంట్ చేసి దాని నుంచి డైరెక్ట్‌గా సీక్వెల్ చేశామని దర్శకుడు చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

కోర్టు రూమ్ డ్రామా



త్రిగుణ్ ప్రధాన పాత్ర పోషించిన 'ఉద్వేగం' చిత్రం టీజర్‌ను రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో లుకలపు మధు నిర్మించారు. 'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులో చాలా తక్కువ చిత్రాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చూసిన తర్వాత సిన్సియర్ ఎఫర్ట్ అనీ, అందరూ సహజంగా నటించారనీ అర్థమవుతోంది' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. నటుడు ఆదిత్యకు, త్రిగుణ్‌కు ఇది 25వ చిత్రమనీ, చట్టాన్ని బేస్ చేసుకుని రూపొందించిన ఈ సినిమా విడుదల తేదిని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

పెళ్లి విందులు.. చిందులు



పెళ్లిలో జరిగే విందులు, చిందుల్ని కన్నుల విందుగా చూపిస్తున్న చిత్రం 'లగ్గం'. సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. రమేశ్ చెప్పాల దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన హీరో ఆది సాయికుమార్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'కథ, కథనం ఈ సినిమాకు బలం. ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలసి చూసేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. కథ నచ్చి ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత తెలిపారు. 'లగ్గం' సినిమా చేయడం తన అదృష్టం అని సాయిరోనక్ చెప్పారు.

డిసెంబర్‌లో విడుదల



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రలు పోషించిన 'విడుదల 2' చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. గతంలో వచ్చిన 'విడుదల' చిత్రానికి ఇది కొనసాగింపు. గౌతమ్ వాసుదేవ్ మీనన్, అనురాగ్ కశ్యప్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషించారు. ఎల్రెడ్ కుమార్ నిర్మాత. సంగీతం: ఇళయరాజా, సినిమాటోగ్రఫీ: ఆర్ వేల్‌రాజ్.

బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి'




ప్రతిష్ఠాత్మక బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి' వెబ్‌సిరీస్ నామినేట్ అయింది. ఉత్తమ ఓటీటీ ఒరిజినల్, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో ఇది నామినేట్ అయింది. బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తన సిరీస్ నామినేట్ అవ్వడం పట్ల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఆనందం వ్యక్తం చేశారు. 'ఈ చిత్రోత్సవాలకు రెండు విభాగాల్లో నామినేట్ అవ్వడం మా టీమ్‌కు గర్వకారణం' అని ఆయన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ సారి ఇండియా నుంచి బూసాన్ చలన చిత్రోత్సవాలకు ఎంపికైన ఏకైక ప్రాజెక్ట్ గా 'హీరామండి' నిలిచింది. మనీషా కొయిరాలా, అదితీరావ్ హైదరీ, సోనాక్షి సిన్హా తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది.



అవని.. బంగారు గని

రెండో పారాలింపిక్ గోల్డ్‌తో చరిత్ర

షూటర్లు మనీశ్‌కు రజతం, మోనాకు కాంస్యం



అవనీ లేఖారా

100 మీటర్ల రేసులో ప్రీతి కంచు మోత

భారత్ ఖాతాలో ఒకేరోజు 4 పతకాలు



మనీశ్ నర్వాల్

పారాలింపిక్స్‌లో భారత్ రెండో రోజు నుంచే పతకాల వేట ఆరంభించింది. టార్గెట్-25 మెడల్స్ ధ్యేయంతో బరిలోకి దిగిన మన అథ్లెట్లు అంచనాలకు మించి రాణిస్తూ ఒక్క రోజే నాలుగు పతకాలతో ఖుషీ చేశారు. మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో 'డబుల్' ఆనందాన్ని పంచారు. షూటర్ అవనీ లేఖారా వరుసగా రెండో పారాలింపిక్ గోల్డ్ మెడల్‌తో అద్భుత: అనిపించగా, మరో షూటర్ మోనా అగర్వాల్ కాంస్యం అందుకుంది. ఎయిర్ పిస్టల్‌లో మనీశ్ నర్వాల్ రజతంతో మురిపించగా, దేశ పారాగేమ్స్ చరిత్రలో తొలిసారిగా మహిళల 100 మీటర్ల రేసులో ప్రీతి పాల్ కాంస్యం సాధించడం మరో విశేషం.

గురి తప్పని గన్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

స్టార్ షూటర్ అవనీ లేఖారా అంచనాలను అందుకుంది. టోక్యోలో సాధించిన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. 11 ఏళ్ల వయస్సులో కారు ప్రమాదానికిగురై..నడుము కింది భాగం వరకు చచ్చు పడిపోయిన స్థితి నుంచి వరుసగా రెండు పారా విశ్వక్రీడల్లో పసిడి పతకాలు కొల్లగొట్టే స్థాయికి చేరడం ఆమె అంతులేని ఆత్మవిశ్వాసానికి, ప్రతిభకు నిదర్శనం. లేఖారా అంతర్జాతీయ పారా షూటర్‌గా రూపుదిద్దుకోవడం వెనుక నవీ ముంబైలోని లక్ష్య షూటింగ్ క్లబ్ వ్యవస్థాపకురాలు సుమ షిరూర్ కృషి ఎంతో ఉంది. ఒలింపిక్స్ ఫైనలిస్ట్, వరల్డ్ రికార్డు హోల్డర్ సుమ వద్ద 2018 నుంచి లేఖారా శిక్షణ పొందుతోంది. సంవత్సరంలో నాలుగుసార్లు క్లబ్‌కు వచ్చి సుమ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తర్ఫీదు పొందుతోంది.. అలా టోక్యోలో మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం, 50 మీ. ఎయిర్ రైఫిల్ కాంస్య పతకాలను అవని దక్కించుకుంది. తద్వారా ఒకే పారాలింపిక్స్‌లో రెండు మెడల్స్ చేజిక్కించుకున్న భారత మహిళా పారా అథ్లెట్‌గా చరిత్ర పుట లకెక్కింది. టోక్యో క్రీడల తర్వాత పారా షూటింగ్ వరల్డ్ కప్‌లోనూ అవని పసిడి పతకం సొంతం చేసుకుంది. ఇక..జూనియర్, సీనియర్ స్థాయిల్లో ప్రపంచ రికార్డులు సృష్టించడం ద్వారా పారా షూటింగ్ భవిష్య అంతర్జాతీయ స్టార్‌గా మన్ననలు అందుకొంది. తన ప్రతిభకు వన్నెలద్దుతూ పద్మశ్రీ, ఖేల్‌రత్న, యంగ్ ఇండియన్ షూటర్, పారా అథ్లెట్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు లేఖారాను వరించాయి. అవని విజయాలను గుర్తించిన రాజస్థాన్ ప్రభుత్వం ఆమెను అటవీ శాఖలో అసిస్టెంట్ కన్జర్వేటర్‌గా నియమించింది. అలాగే 'బేటీ బచావ్, బేటీ పడావో'కు లేఖారా బ్రాండ్ అంబాసిడర్ కావడం విశేషం.

> పారాలింపిక్స్‌లో స్వర్ణంతో మురిపించిన అవనీ లేఖారా, రజతం సాధించిన మనీశ్, కాంస్య పతకాలు నెగ్గిన మోనా అగర్వాల్, ప్రీతిల అంకితభావం, ప్రతిభను చూసి దేశం గర్వపడుతోంది. - ప్రధాని నరేంద్ర మోదీ

పారిస్: పారాలింపిక్స్‌లో భారత్ పతకాల బోణీ ఘనంగా జరిగింది. టోక్యో గేమ్స్‌లో 19 మెడల్స్‌తో మురిపించిన పారా అథ్లెట్లపై ఈసారి భారీ అంచనాలే నెల కొనగా.. దానికి తగ్గట్టుగానే అద్భుత ప్రదర్శన చూపుతున్నారు. గేమ్స్ ఆరంభమైన రెండో రోజు శుక్రవారం నాలుగు పతకాలతో మురిపించారు. దీంతో ప్రస్తుతం భారత్ ఖాతాలో ఓ స్వర్ణం, రజతం, రెండు కాంస్యాలు చేరాయి.

డబుల్‌తో బోణీ: మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్1 ఫైనల్లో మొదట భారత్‌కు రెండు పతకాలు లభించాయి. ఇందులో 22 ఏళ్ల షూటర్ అవనీ లేఖారా 249.7 స్కోరుతో చాంపియన్‌గా నిలిచింది. ఆమెకిది రెండో పారాగేమ్స్ స్వర్ణం కావడం విశేషం. టోక్యో గేమ్స్‌లోనూ అవని విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. దీంతో రెండు పారాలింపిక్స్ స్వర్ణాలు సాధించిన తొలి భారత మహిళా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించింది. ఇక ఫైనల్ రౌండ్ ఉత్కంఠభరితంగానే సాగింది. తొలి రౌండ్ నుంచి కొరియా షూటర్ లీ యున్రీ ముందంజలో ఉండి గట్టి పోటీనిచ్చింది. అయితే అవని ఫైనల్ షాట్‌ను 10.5 పాయింట్లతో ముగించగా.. యున్రీ మాత్రం 6.8 పాయింట్లకే పరిమితమైంది. దీంతో 1.9 మార్జిన్‌తో అవని విజేతగా నిలువగా.. లీకి రజతం దక్కింది. ఈక్రమంలో .1 తేడాతో అవని తన బెస్ట్ పారాగేమ్స్ స్కోరును కూడా సాధించింది. ఇక ఇదే విభాగంలో మరో భారత షూటర్ మోనా అగర్వాల్ 228.7 స్కోరుతో కాంస్యం అందుకుంది. అంతకు ముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో అవని రెండు, మోనా ఐదో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

అథ్లెటిక్స్‌లో 'ప్రీతి'కరం: తొలిసారిగా పారా అథ్లెటిక్స్‌లో భారత్ పతకం సాధించింది. మహిళల 100 మీ. పరుగు టీ35 ఫైనల్‌లో ప్రీతి పాల్ 14.21 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం సాధించింది. అలాగే ప్రీతికిది పర్సనల్ బెస్ట్ టైమ్. శుక్రవారం భారత్ సాధించిన మూడో పతకమిది. 23 ఏళ్ల ప్రీతి మేలో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ కాంస్యంతో ఆకట్టుకుంది.

మనీశ్‌కు రజతం: షూటర్ మనీశ్ అగర్వాల్ రూపంలో భారత్‌కు నాలుగో పతకం అందింది. టోక్యో గేమ్స్‌లో మిక్స్‌డ్ టీమ్ 50మీ. పిస్టల్‌లో స్వర్ణం అందుకున్న తను పారిస్‌లోనూ సత్తా చాటాడు. ఈసారి మనీశ్ 10మీ. ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్ 1లో 234.9 పాయింట్లతో రజతం సాధించాడు. తొలుత స్వర్ణం ఖాయమనుకున్నా చివర్లో లయ తప్పాడు. ఆఖరిదైన 24వ షాట్‌లో మనీశ్ 8.9, 9.9 స్కోరు చేయగా, ప్రత్యర్థి జోంగ్డు (కొరియా) 10.8, 8.7తో గోల్డ్ మెడల్ అందుకున్నాడు. దీంతో మనీశ్ రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మరోవైపు మిక్స్‌డ్ 10మీ. ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్2లో శ్రీహర్ష 0.1 తేడాతో తొమ్మిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత కోల్పోయాడు.



మోనా అగర్వాల్

పోలియోను లెక్క చేయక..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పారా ఒలింపిక్స్‌లోనూ షూటర్లే భారత్‌కు పతక బోణీ చేశారు. మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ కేటగిరీలో అవనీ లేఖారా బంగారు పతకంతో మెరిస్తే ఇదే విభాగంలో 37 ఏళ్ల మోనా అగర్వాల్ కాంస్యంతో సత్తా చాటింది. అవని మాదిరే మోనా కూడా రాజస్థాన్ షూటరే. సికార్‌కు చెందిన మోనా తొమ్మిది నెలల వయస్సులో పోలియో బారిన పడింది. ఫలితంగా చక్రాల కుర్చీకే పరిమితమైన ఆమెను బాల్యంలో అంతా హేళన చేసేవారు. పైగా..తల్లిదండ్రులకు మోనా మూడో ఆడబిడ్డ. దాంతో బంధువులు, పెద్దల నుంచి అవహేళనలు మరింతగా ఉండేవి. కానీ మోనా అవేమీ పట్టించుకోలేదు. పైగా ఆమెలో పట్టుదల మెండు. అమ్మమ్మ గీతా దేవి..మోనాకు అండగా నిలిచింది. క్రీడల్లో రాణించాలని మోనా చిన్నతనం నుంచి కలలు కంటూ ఉండేది. సికార్‌లో హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తుండే తండ్రి..మోనాను క్రీడలవైపు ప్రోత్సహించాడు. పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో రాష్ట్రస్థాయి పోటీలలో ఆమె పాల్గొంది. 2017లో పారా బాస్కెట్‌బాల్ ఆటగాడు రవీంద్ర చౌదరితో మోనాకు వివాహమైంది. అనంతరం ఉదయ్‌పూర్‌కు మారిన అగర్వాల్ పారా వెయిట్‌లిఫ్టింగ్‌లో ప్రవేశించింది. 60 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి టైటిల్ కూడా దక్కించుకుంది. ఇక..ఇద్దరు పిల్లలకు తల్లయ్యాక 2021లో భర్త ప్రోత్సాహంతో మోనా పారా షూటింగ్‌లోకి అడుగు పెట్టింది. జైపూర్‌లోని ఏకలవ్య షూటింగ్ అకాడమీలో యోగేష్ షెకావత్ ఆధ్వర్యంలో శిక్షణ పొందింది. అదే ఏడాది జూలైలో క్రొయేషియాలో జరిగిన పారా వరల్డ్ కప్ షూటింగ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. గత ఏప్రిల్‌లో కొరియా ఆతిథ్యమిచ్చిన ప్రపంచ కప్‌లో మోనా స్వర్ణ పతకంతో భళా అనిపించింది. ఢిల్లీలో జరిగిన వరల్డ్ కప్‌లో పారిస్ క్రీడల బెర్త్ అందుకుంది.

టిల్లి.. ఐదో పసిడి



ట్యునీషియాకు చెందిన షాట్‌పుటర్ రవా టిల్లి అరుదైన రికార్డు సాధించింది. వరుసగా ఐదోసారి పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించింది. 4 అడుగుల 4 అంగుళాలున్న 34 ఏళ్ల టిల్లి.. ఇనుపగుండును 10.40 మీటర్ల దూరం విసిరి ప్రథమస్థానంలో నిలిచింది. 2008, 2012 క్రీడల్లో షాట్‌పు ట్‌లో స్వర్ణాలు నెగ్గిన టిల్లి.. 2016, 2021 క్రీడల్లో డిస్కస్ త్రోలో పసిడి పతకాలు సాధించింది. ఇప్పుడు పారిస్‌లో షాట్‌పుట్ ఈవెంట్‌లో విజేతగా నిలిచి, వరుసగా ఐదో క్రీడల్లో స్వర్ణం ఖాతాలో వేసుకుంది.



ప్రీతి పాల్

మనుగడే ప్రశ్నార్థకమై..!

పారా అథ్లెట్ ప్రీతీ పాల్ జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన ప్రీతి రైతు కుటుంబంలో పుట్టింది. మెదడు సమస్యతో చిన్నతనంలోనే పలు వ్యాధులు చుట్టుముట్టాయి. ఆమె మనుగడనే ప్రశ్నార్థకం చేశాయి. కాళ్లు బలహీనమయ్యాయి. అవి బలంగా మారేందుకు ఆమెకు ఎన్నో సంప్రదాయ చికిత్సలు చేయించారు. దివ్యాంగులు వాడే కాలిపర్స్‌ను ఐదేళ్లకే ధరించడం ప్రారంభించిన ఆమె ఎనిమిదేళ్ల వరకు వాటిని ఉపయోగించింది. 17 ఏళ్ల వయస్సులో సోషల్‌మీడియాలో పారాలింపిక్స్‌ను చూశాక జీవితం పట్ల ప్రీతి దృక్పథం మారిపోయింది. తానూ క్రీడాకారిణిగా మారాలని నిశ్చయించుకుంది. ఆ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పాల్ వెరవలేదు. ఇక..పారా అథ్లెట్ ఫాతిమా ఖాతూన్‌ను కలవడం ప్రీతి జీవితాన్ని మలుపు తిప్పింది. ఫాతిమా ప్రోత్సాహంతో 2018లో పారా అథ్లెటిక్స్‌లో కాలుమోపిన ప్రీతి..2022లో పారా ఆసియా క్రీడలకు క్వాలిఫై అయ్యింది. 100మీ., 200మీ., పరుగులో నాలుగో స్థానంలో నిలవడంతో ఆమెలో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. తర్వాత ఢిల్లీ చేరి కోచ్ గజేందర్ సింగ్ శిక్షణలో రాటుదేలిన ప్రీతి 2024 వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో 100, 200మీ.లలో కాంస్య పతకాలు నెగ్గి అబ్బురపరిచింది. తద్వారా తొలిసారి పారాలింపిక్స్ బెర్త్‌ఖాయం చేసుకుంది.

ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఆర్తికి కాంస్యం

లిమా (పెరు): ప్రపంచ అథ్లెటిక్స్ అండర్-20 చాంపియన్‌షిప్‌లో భారత యువ రేసర్ ఆర్తి మహిళల 10,000 మీటర్ల రేస్ వాక్‌లో కాంస్య పతకం సాధించింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో 17 ఏళ్ల ఆర్తి 44 నిమిషాల 39.39 సెకన్లలో రేసును పూర్తిచేసి మూడోస్థానంలో నిలిచింది. హైజంప్‌లో పూజా సింగ్ ఫైనల్ చేరింది.

శ్రీలంక 196 ఆటౌట్

లార్డ్స్: శ్రీలంకతో రెండో టెస్ట్ రెండో రోజే ఇంగ్లండ్ పట్టుబిగించింది. పేసర్లు చెలరేగిన వేళ..పర్యాటక జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 196 పరుగులకే ఆలౌట్ చేసింది. దాంతో ఆతిథ్య జట్టుకు 231 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అంతకుముందు ఓవర్‌నైట్ 358/7తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్..427 పరుగులకు ఆలౌటైంది. అట్కిన్సన్ శతకం (118) పూర్తి చేశాడు. భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కూడగట్టుకున్న ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆఖరికి 25/1 స్కోరు సాధించింది. ఓవరాల్‌గా 256 రన్స్ ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఆర్చరీ, రోయింగ్‌లో..

పురుషుల ఆర్చరీ వ్యక్తిగత కాంపౌండ్ ఓపెన్‌లో రాకేశ్ కుమార్ ప్రీక్వార్టర్స్‌కు చేరాడు. ఎలిమినేషన్ రౌండ్‌లో తను సెనెగల్‌కు చెందిన అలియో డ్రేమ్‌ను 136-134 తేడాతో ఓడించాడు. మిక్స్‌డ్ పీఆర్3 డబుల్ స్కల్స్ హీట్1లో ఏపీకి చెందిన నారాయణ కొంగనపల్లె-అనిత జోడీ 8:06.84 టైమింగ్‌తో ఐదో స్థానంలో నిలిచారు. ఫైనల్లో చోటు కోసం నేడు రెపిచేజ్ 2లో తలపడనున్నారు.

వీరికి నిరాశే..


పురుషుల సైక్లింగ్ సీ2 3000 మీటర్ల వ్యక్తిగత విభాగంలో తెలుగు అథ్లెట్ షేక్ అర్షద్ అర్హత రౌండ్‌లోనే వెనుదిరిగాడు. 4 నిమిషాల 20.949 సెకన్ల టైమింగ్‌తో అర్షద్ ఆఖరైన తొమ్మిదో స్థానంలో నిలిచాడు. టాప్-4 మాత్రమే ఫైనల్‌కు వెళతారు. మహిళల డిస్కస్‌త్రో ఎఫ్55 ఫైనల్‌లో సాక్షి కసానా ఎనిమిది, కరమ్‌జ్యోతి తొమ్మిదో స్థానంలో నిలిచారు. అలాగే మహిళల టీటీ డబుల్స్ డబ్ల్యూడీ 10 క్వార్టర్స్‌లో సోనాల్‌బెన్-భవిన జోడీ కొరియా చేతిలో ఓడింది.

సెమీస్‌లో సుహాస్, నితేశ్

పారా బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ఎస్ఎల్ 4లో సుహాస్, ఎస్ఎల్ 3లో నితేశ్ కుమార్ సెమీఫైనల్స్‌లో ప్రవేశించారు. సుహాస్ 26-24, 21-14 తేడాతో క్యుంగ్ వాన్ (కొరియా)పై, నితేశ్ 21-5, 21-11తేడాతో యాంగ్ (చైనా)పై గెలిచారు. అలాగే మహిళల సింగిల్స్ ఎస్‌యూ 5 గ్రూప్ ఎలో తులసీమతి 21-12, 21-8 తేడాతో మోంటీరో (పోర్చుగల్)పై గెలిచి సెమీస్ చేరింది. మరోవైపు సింగిల్స్ ఎస్ఎల్3లో మానసి జోషి వరుసగా రెండో ఓటమి పాలవగా..మనోజ్ సర్కార్ కూడా పురుషుల సింగిల్స్ ఎస్ఎల్ 3లో రెండో ఓటమితో నిష్క్రమించాడు.

అల్కారజ్‌కు షాక్

- ఒసాక ఇంటిబాట
- ప్రీక్వార్టర్స్‌కు గాఫ్
- యూఎస్ ఓపెన్



న్యూయార్క్: ప్రపంచ మాజీ నెంబర్‌వన్, టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్కారజ్‌కు యూఎస్ ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలింది. ఈ స్పెయిన్ సంచలనానికి నెదర్లాండ్స్‌కు చెందిన 28 ఏళ్ల బొటిక్ వాన్ డి జాండ్‌షల్ప్ రెండోరౌండ్లో చెక్ పెట్టాడు. ప్రపంచ 74వ ర్యాంకరైన బొటిక్ 6-1, 7-5, 6-4తో వరుససెట్లలో మాజీ చాంపియన్ అల్కారజ్‌ను కంగుతినిపించి మూడోరౌండ్‌కు దూసుకెళ్లాడు. ఈ పరాజయంతో గ్రాండ్‌స్లామ్స్‌లో అల్కారజ్ వరుస 15 మ్యాచ్‌ల విజయానికి బ్రేక్ పడింది. అల్కారజ్ ఓటమితో డిఫెండింగ్ చాంప్ జొకోవిచ్ టైటిల్ నిలబెట్టుకునేందుకు మార్గం సుగమమైంది. ఐదోసీడ్ మెద్వెదేవ్ 6-3, 6-2, 7-6(7-5)తో ఫాబియానస్‌పై, పదోసీడ్ అలెక్స్ డి మినార్ 7-5, 6-1, 7-6(7-3)తో ఒట్టో విర్టానెన్‌పై, 25వ సీడ్ డ్రేపర్ 6-4, 6-2, 6-2తో డియాజ్‌పై గెలిచి మూడో రౌండ్ చేరారు.

గాఫ్ జోరు: చైనా మహిళల డిఫెండింగ్ చాంప్ కొకొ గాఫ్ తన జోరు కొనసాగిస్తూ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మూడో రౌండ్లో మూడోసీడ్ గాఫ్ 3-6, 6-3, 6-3తో స్విటోలినాను ఓడించింది. ఏడోసీడ్ క్విన్ జెంగ్ 6-2, 6-1తో నీమెర్‌ను చిత్తుచేసి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. ఇక, మాజీ విజేత నవోమి ఒసాక రెండోరౌండ్లోనే వెనుదిరిగింది. చెక్ క్రీడాకారిణి కరోలినా ముచోవా 6-3, 7-6 (7-5)తో ఒసాకాకు ఝులకిచ్చింది. 4వ సీడ్ రిబకినా వాకోవర్ ఇవ్వడంతో ప్రత్యర్థి జెస్సికా మూడోరౌండ్‌లో అడుగుపెట్టింది. టాప్‌సీడ్ స్వియటెక్ 6-0, 6-1తో హిబహర్‌పై, 6వ సీడ్ పెగులా 7-6 (7-4), 6-3తో కెనిన్‌పై, వోజ్నియాకి 6-3, 6-3తో రెనటాపై నెగ్గి మూడోరౌండ్లో ప్రవేశించారు.

అఫ్రీది-మసూద్ బాహాబాహీ?

రావల్పిండి: పాకిస్థాన్ జట్టులో విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయని తెలుస్తోంది. తొలి టెస్టు ముగిశాక జరిగిన జట్టు సమావేశంలో పేసర్ షహీన్ అఫ్రీది భుజంపై కెప్టెన్ షాన్ మసూద్ చేయి వేసి మాట్లాడుతుండగా అతడు చేయిని వెనక్కి నెట్టేశాడు. అనంతరం డ్రెసింగ్ రూమ్‌కు చేరిన ఈ వివాదం అఫ్రీది, మసూద్ పరస్పరం భౌతికదాడి చేసుకునేంత వరకు వెళ్లిందని సమాచారం. వీరిద్దరు తీవ్రంగా కొట్టుకుంటుండగా, ఓపెనర్ రిజ్వాన్ మధ్యలో ఆపే ప్రయత్నం చేయగా, అతడిపై కూడా ఈ ఇరువురు దాడి చేసినట్టు తెలుస్తోంది.

శివాజీ మాకు దేవుడు!

ఆయన విగ్రహం కూలిపోవడంపై శిరస్సు వంచి క్షమాపణ చెబుతున్నా: ప్రధాని

మహారాష్ట్రలో వాధ్వాన్ పోర్టుకు శంకుస్థాపన

పాల్ఘర్, ఆగస్టు 30: మహారాష్ట్రలోని సింధ్‌దుర్గ్ జిల్లాలో శివాజీ విగ్రహం ఇటీవల కూలిపోవడంపై ప్రధాని మోదీ శుక్రవారం క్షమాపణ చెప్పారు. 'ఛత్రపతి శివాజీ మహారాజ్ అంటే ఒక పేరో.. ఒక రాజో కాదు. మాకు ఆయన దేవుడు. ఇవాళ ఆయన పాదాల ముందు నా శిరస్సు వంచి క్షమాపణ చెబుతున్నా' అని పేర్కొన్నారు. తొలిసారి తనను బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించినప్పుడు శివాజీ సామ్రాజ్య రాజధాని అయిన రాయగడ్‌ను సందర్శించి.. ఆయన సమాధి వద్ద ధ్యానం చేశానని గుర్తు చేసుకున్నారు. శుక్రవారం మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో వాధ్వాన్ పోర్టు ప్రాజెక్టుకు మోదీ శంకుస్థాపన చేశారు. ఇదే సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని జువ్వలదిన్నె హార్బర్ సహా దేశవ్యాప్తంగా రూ.1,560 కోట్ల వ్యయంతో చేపట్టిన 218 ఫిషరీస్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సముద్ర రక్షణకు శివాజీ చేసిన కృషికి గుర్తింపుగా నిరుడు డిసెంబరులో నౌకాదళ వేడుకలను పురస్కరించుకుని సింధ్‌దుర్గ్ జిల్లా రాజ్‌కోట్ కోటలో ఆయన విగ్రహాన్ని మోదీ స్వయంగా ఆవిష్కరించారు. అయితే అది గత సోమవారం కూలిపోయింది. దీనిపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తుండడంతో ప్రధాని స్పందించారు. "కొందరు వ్యక్తులు వీరసావర్కర్‌ను దూషిస్తూ ఉంటారు. ఆయన్ను అవమానించినందుకు క్షమాపణ చెప్పరు. నేను ఇక్కడ దిగగానే.. శివాజీ మహరాజ్ విగ్రహం కూలిపోయినందుకు మొదట క్షమాపణ చెప్పాను.



పాల్ఘర్‌లో ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో మోదీ

విగ్రహం కూలడంతో మనోభావాలు దెబ్బతిన్నవారికీ నా క్షమాపణలు" అని తెలిపారు. భారత్‌ను అభివృద్ధి పథంలో నడపాలన్న సంకల్పంలో మహారాష్ట్ర అభివృద్ధి కూడా భాగమని.. అందుకే గత పదేళ్లుగా రాష్ట్ర పురోభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. "వాధ్వాన్ పోర్టును రూ.76 వేల కోట్లతో నిర్మిస్తున్నాం. దేశంలోనే అతిపెద్ద కంటైనర్ పోర్టుగా ఇది రూపుదిద్దుకోనుంది" అని వెల్లడించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా చేపల ఉత్పత్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెద్దఎత్తున పెంచుతున్నామన్నారు. 2014లో చేపల ఉత్పత్తి 80 లక్షల టన్నులు మాత్రమే ఉండేదని.. ఇప్పుడు 1.7 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. కాగా.. రూ.360 కోట్లతో ఏర్పాటుచేసిన 'నేషనల్ రోల్‌వుట్ ఆఫ్ వెసెల్ కమ్యూనికేషన్ అండ్ సపోర్ట్ సిస్టమ్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులతో నేరుగా సంభాషించేందుకు, వారిని రక్షించేందుకు ఇది ఉపకరిస్తుంది.

బీజేపీలో చేరిన చంపయి సోరెన్

రాంచీ, ఆగస్టు 30: ఝార్ఖండ్ మాజీ సీఎం చంపయి సోరెన్ శుక్రవారం బీజేపీలో చేరారు. జేఎంఎం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అలాగే అక్కడ తనకు అవమానం జరిగిందని ఆ పార్టీకి రాజీనామా చేసిన రెండు రోజులకే ఆయన పార్టీ మారారు. రాంచీలో కేంద్రమంత్రి శివ్‌రాజ్ చౌహాన్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమక్షంలో భారీ సంఖ్యలో వచ్చిన మద్దతుదారులతో చంపయి బీజేపీలో చేరారు. అనంతరం మాట్లాడుతూ... జార్ఖండ్ ప్రభుత్వం ఢిల్లీ, కోల్‌కతాల్లో తనపై నిఘా పెట్టిన తర్వాత బీజేపీలో చేరాలన్న తన నిర్ణయం బలపడిందన్నారు. తాను చెమటోడ్చి, రక్తం చిందించి జేఎంఎం పార్టీని పెద్ద చేస్తే చిన్నచూపు, అవమానం మిగిలాయన్నారు.

శివసైనికులం..ఎన్సీపీ వ్యతిరేకులం

ముంబై, ఆగస్టు 30: మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మహారాష్ట్రలో రాజకీయం వేడెక్కుతోంది. బీజేపీ-శివసేన (శిందే)-ఎన్సీపీ(అజిత్ పవార్)ల మహాయుతి కూటమిలో విభేదాలు బయటపడుతున్నాయి. తాజాగా అజిత్ ఎన్సీపీని ఉద్దేశించి శిందే సేనకు చెందిన ఆరోగ్య మంత్రి తానాజీ సావంత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాము కరడుగట్టిన శివ సైనికులమని.. ఎన్సీపీ, కాంగ్రెస్‌తో తమకు పొసగదని అన్నారు. క్యాబినెట్ సమావేశాల సందర్భంగా ఎన్సీపీ మంత్రుల పక్కన కూర్చుంటే వాంతి వచ్చినట్లే ఉంటుందన్నారు. కాకపోతే ప్రభుత్వంలో ఉన్నందున తప్పడం లేదని వ్యాఖ్యానించారు. దీనిపై ఎన్సీపీ కూడా గట్టిగానే స్పందించింది. ఇలాంటి ప్రకటనలను వినేకంటే ప్రభుత్వం నుంచి వెళ్లిపోవడమే ఉత్తమమని పేర్కొంది. లేదా తానాజీపై వేటు వేయాలంది.

గూండాల్లా బ్యాంకు రికవరీ ఏజెంట్లు

ఓ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 30: బ్యాంకు లోన్ల రికవరీ ఏజెంట్ సంస్థ గూండాల ముఠా మాదిరిగా వ్యవహరిస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఏక కాల పరిష్కారం(వన్ టైమ్ సెటిల్‌మెంట్) కింద రుణ గ్రహీత చెల్లింపులను పూర్తి చేసినా రికవరీ ఏజెంట్లు మాత్రం ఆయన దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న బస్సును తిరిగి అప్పగించకపోవడాన్ని తప్పుపట్టింది. ఆ రికవరీ సంస్థపై కేసు నమోదు చేసి రెండు నెలల్లో అభియోగ పత్రం దాఖలు చేయాలని పశ్చిమ బెంగాల్ పోలీసులను ఆదేశించింది. బాధితునికి పరిహారం చెల్లించాలని, ఆ మొత్తాన్ని రికవరీ సంస్థ నుంచి వసూలు చేయాలని రుణం మంజూరు చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సూచించింది. ఈ మేరకు జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. కోల్‌కతాలో నడిపేందుకోసం బస్సు కొనడానికి దేబాశీశ్‌రాయ్ అనే వ్యక్తి బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.15.15 లక్షల రుణం తీసుకున్నాడు. నెలకు రూ.26,502 వంతున 84 ఈఎంఐల్లో చెల్లించడానికి అంగీకారం కుదిరింది. 2014 డిసెంబరు నుంచి ఈఎంఐలు మొదలయ్యాయి. 2018 జనవరి నుంచి ఈఎంఐలు చెల్లించలేదు. దాంతో ఆ రుణాన్ని నిరర్థక ఆస్తిగా ప్రకటిస్తూ బ్యాంకు 2018 మే 31న ఆదేశాలు ఇచ్చింది. ఆ సమయానికి రాయ్‌చౌధరి ఇంకా రూ.10.23 లక్షలు చెల్లించాల్సి ఉంది. రుణం వసూలు చేసే బాధ్యతను నగరంలోని మెస్సర్స్ సిటీ ఇన్‌వెస్టిగేషన్ అండ్ డిటెక్టివ్ సంస్థకు బ్యాంకు అప్పగించింది. రికవరీ ఏజెంట్లు వచ్చి ప్రభుత్వ అధికారుల సాయంతో ఆ బస్సును స్వాధీనం చేసుకున్నారు. 2021 మార్చిలో రాయ్ చౌదరి బ్యాంకును సంప్రదించి వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.1.8 లక్షలు చెల్లిస్తానని, మొత్తం చెల్లించినట్టుగా పరిగణించి రుణ ఖాతాను మూసివేయాలని కోరారు. ఇందుకు బ్యాంకు అంగీకరించింది. అయితే, సెటిల్‌మెంట్ జరిగినా స్వాధీనం చేసుకున్న బస్సును తిరిగి ఇవ్వకపోవడంతో ఆయన కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. తరువాత రికవరీ ఏజెంట్లు బస్సును వాపసు చేసినా అందులో కొన్ని పార్టులు కూడా కనిపించలేదు. దీంతో కేసు సుప్రీంకోర్టుకు వచ్చింది.

పెండింగ్ కేసులు 82,831

న్యూఢిల్లీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 82,831. ఇందులో ఈ ఏడాది కొత్తగా నమోదైనవే 38,996 కేసులు. సుప్రీంకోర్టు గడిచిన ఏడాది కాలంలో 37,158 కేసులను పరిష్కరించింది. మరోవైపు, 2023 నాటికి దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 61 లక్షలకు పెరిగింది. ట్రయల్ కోర్టుల్లో 4.5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

జస్టిస్ హిమా కోహ్లీ పదవీ విరమణ

మహిళల హక్కుల పరిరక్షకురాలు జస్టిస్ హిమా కోహ్లీ అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రశంసించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆమె శుక్రవారం పదవీ విరమణ చేశారు. చివరి రోజున ఆమె గౌరవ సూచికంగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనంపై ఆసీనులయ్యారు. ఆమె మూడేళ్ల పాటు సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేశారు. అంతకు ముందు 2021 జనవరి నుంచి ఆగస్టు 31 వరకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు.

టైట్లర్‌పై అభియోగాలు నమోదు చేయండి

» 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 30: కాంగ్రెస్ నాయకుడు జగదీశ్ టైట్లర్‌పై హత్య సహా ఇతర అభియోగాలను నమోదు చేయాలని శుక్రవారం ప్రత్యేక న్యాయస్థానం సీబీఐని ఆదేశించింది. ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984లో సిక్కులపై జరిగిన దాడులకు సంబంధించిన కేసులో ఈ ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర ఢిల్లీలోని పుల్ బంగేష్ వద్ద ముగ్గురు సిక్కులు హత్యకు గురికావడం వెనుక ఆయన ప్రమేయం ఉందంటూ కేసు నమోదయింది. ఆయనపై విచారణ జరిపేందుకు తగిన ఆధారాలు ఉన్నాయని ప్రత్యేక జడ్జి రాకేష్ సియాల్ అభిప్రాయపడ్డారు. హత్యతో పాటు చట్టవ్యతిరేకంగా గుమికూడడం, అలర్లు సృష్టించడం, వివిధ వర్గాల మధ్య శతృత్వాన్ని పెంచడం, ఇళ్లల్లో చొరబడడం, దొంగతనం చేయడం వంటి అభియోగాలు కూడా నమోదు కానున్నాయి. ఓ సాక్షి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ అభియోగాలు మోపనున్నారు. "1984 నవంబరు ఒకటో తేదీన తెల్లని అంబాసిడర్ కారులో గురుద్వారా పుల్ బంగేష్ వద్దకు వచ్చిన టైట్లర్ 'సిక్కులను చంపండి. మన అమ్మను వారు చంపేశారు' అంటూ రెచ్చగొట్టాడని, అనంతరం ముగ్గురు హత్యకు గురయ్యారు"ని ఆ వ్యక్తి అఫిడవిట్‌లో పేర్కొన్నాడు. దాని ఆధారంగా అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించిన కోర్టు తదుపరి విచారణను వచ్చే నెల 13కు వాయిదా వేసింది.

కేంద్ర ఉద్యోగులకు సరళీకృత పెన్షన్ ఫారం విడుదల


న్యూఢిల్లీ, ఆగస్టు 30: పదవీ విరమణ చేయబోయే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సౌలభ్యం కోసం కొత్త పెన్షన్ దరఖాస్తు ఫారాన్ని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ విడుదల చేశారు. మొత్తం 9 రకాల వేర్వేరు ఫారాలను ఈ 'ఫారం 6ఏ'లో విలీనం చేశారు. శుక్రవారం వర్చువల్ జరిగిన సమావేశంలో ఈ ఫారం విడుదల సందర్భంగా జితేంద్రసింగ్ మాట్లాడుతూ.. 'దేశవ్యాప్తంగా వయో వృద్ధులు, పెన్షనర్లకు జీవన సౌలభ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పెన్షన్ దరఖాస్తు ఫారాన్ని సరళీకరించి విడుదల చేశాం. ఈ ఏడాది డిసెంబర్ నుంచి రిటైరయ్యే కేంద్ర ఉద్యోగులందరికీ భవిష్య/ఈ-హెచ్ఆర్ఎంఎస్ (పోర్టల్)లో ఈ ఫారం అందుబాటులో ఉంటుంది. దీనిపై ఉద్యోగి ఒక్క సంతకం చేస్తే చాలు.. పెన్షన్ ప్రక్రియ సులభతరం అవుతుంది' అని చెప్పారు.

ప్రాణాల మీదకు తెచ్చిన సెల్ఫీ మోజు

» కాల్వలో పడిన మహిళ... కాపాడిన యువకులు

» నల్లగొండ జిల్లా వేములపల్లిలో ఘటన

వేములపల్లి, ఆగస్టు 30: ఓ మహిళ సెల్ఫీ మోజు ప్రాణాల మీదకు తెచ్చింది. ఫొటోలు దిగుతూ కాలు జారి కాల్వలో పడింది. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు కారులో వెళ్తున్న ఓ మహిళ వేములపల్లి మండల కేంద్రంలోని బ్రిడ్జి సమీపంలో కారును సాగర్ ఎడమ కాల్వ వద్ద ఆపి... కాల్వలో ప్రవహిస్తున్న నీటిని చూసి సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించింది. అలా సెల్ఫీ దిగుతుండగా, కాలు జారి ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయింది. సదరు మహిళకు ఈత వచ్చినా నీటి ఉధృతికి ఈదలేక కొట్టుకుపోతుండగా, అదే సమయానికి అటుగా వెళ్తున్న యువకులు గమనించి మహిళను తాళ్లతో పైకి లాగి బయటకు తీశారు. దాంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది.



రాత్రిపూట డ్యూటీ

భయం భయం!

(మొదటి పేజీ తరువాయి)



వైద్యసేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. ఆన్‌లైన్‌లో నిర్వహించిన సర్వేలో వెల్లడైన అంశాలను ఐఎంఏ వివరించింది. కాగా, ఈ సర్వే వివరాలను దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులకు అందించనున్నట్టు ఐఎంఏ కేరళ విభాగం, పరిశోధన సెల్ చైర్మన్ డాక్టర్ జయదేవన్ తెలిపారు.

వైద్యుల గోడు ఇదీ..

- రాత్రి విధుల్లో ఉన్న వైద్యులకు 45 శాతం ఆసుపత్రుల్లో డ్యూటీ రూమ్‌లు లేవు. దీంతో నైట్ డ్యూటీలో ఉంటున్నవారు తీవ్ర అభద్రతలో ఉంటున్నామనే భావనలో ఉన్నారు. కచ్చితంగా తమకు డ్యూటీ రూమ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.
- డ్యూటీ రూమ్ ఉన్నప్పటికీ.. తమకు గోప్యత ఉండడం లేదని, భారీ సంఖ్యలో వస్తున్న రోగుల కారణంగా తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలిపారు. వీటిలో ఎటాచ్డ్ బాత్‌రూమ్స్ లేవని మరికొందరు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా తమకు విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలన్నారు.
- ఆసుపత్రుల్లో భద్రత లేదని 24.1% మంది, అస్సలు ఏమాత్రం సురక్షితం కాదని 11.4% మంది వైద్యులు తెలిపారు. వీరిలో ఎక్కువ మంది మహిళా వైద్యులే ఉన్నారు. "సుశిక్షితులైన సిబ్బందితో ఆసుపత్రుల్లో భద్రత కల్పించాలి. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆసుపత్రి ఆవరణలో లైట్లు ఏర్పాటు చేయాలి" అని వారు కోరారు.
- సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్(సీపీఏ)ను అమలు చేయాలి. అలారం వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వైద్యులకు కనీస భద్రత కల్పించాలి.
- రోగులు ఎక్కువగా ఉన్న ఆసుపత్రుల్లో గుంపు నియంత్రణ సిబ్బందిని నియమించాలి. తద్వారా రోగులకు నిర్భయంగా వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది.
- ఆత్మ రక్షణ కోసం చిన్నపాటి ఆయుధాలను తీసుకువెళ్తున్నట్టు సర్వేలో కొందరు తెలిపారు.
- తన హ్యాండ్ బ్యాగులో చిన్నపాటి కత్తితో పాటు మిరియాల ద్రావకాన్ని కూడా పెట్టుకుంటున్నట్టు ఓ మహిళా వైద్యురాలు తెలిపారు.
- రోగుల బంధువులు కొందరు మద్యం తాగి, మరికొందరు మాదద్రవ్యాల మత్తులో జోగుతూ వైద్యులను బెదిరిస్తున్నారని మెజారిటీ వైద్యులు ఫిర్యాదు చేశారు. వీరిని కట్టడి చేయాలని కోరారు.
- మహిళా వైద్యులను కొందరు తాకరాని చోట తాకుతున్నారు. రోగుల సమూహం ఎక్కువగా ఉన్న ఆసుపత్రుల్లో ఇది సర్వసాధారణం అయిపోయింది.
- ప్రైవేటు ఆసుపత్రుల్లో భద్రతను ప్రశ్నిస్తే.. యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. చులకనగా చూస్తున్నాయి. జూనియర్ వైద్యులపై దాడులు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి.

సర్వే సాగింది ఇలా..

22 రాష్ట్రాల్లో ఐఎంఏ ఆన్‌లైన్ అధ్యయనం సాగింది. మొత్తం 3,885 మంది వైద్యులు పాల్గొన్నారు. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 85% మంది 35 ఏళ్లలోపున్న వైద్యులు. వీరిలో 61% మంది ఇంటెర్న్, లేదా పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనీలే.

ఆధారాల్ని చెరిపేయలేదు..

కోల్‌కతా, ఆగస్టు 30: కోల్‌కతా హత్యాచార ఘటనాస్థలంలో ఆధారాలను తారుమారు చేశారంటూ సీబీఐ చేసిన ఆరోపణలను కోల్‌కతా పోలీసులు తోసిపుచ్చారు. కోల్‌కతా పోలీసుల తరఫున డీసీపీ సెంట్రల్ ఇందిరా ముఖర్జీ సుప్రీంకోర్టులో ఈ ఆరోపణలకు వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో వైరలైన ఫొటోలో.. ఘటనాస్థలంలో ఉన్న వారంతా విచారణ బృందానికి సంబంధించిన వారేనని, ఆ చిత్రంలో ఉన్న వారి వివరాలతో సహా వివరించారు. అంతేకాక, ఆ ఫొటో విచారణ పూర్తయిన తర్వాత ఆగస్టు 9న తీసిన చిత్రమని తెలిపారు. ఇక, సీబీఐ తరఫున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యాన్ని సుప్రీం కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోల్‌కతా పోలీసులు పేర్కొన్న ప్రకారం ఆగస్టు 9న ఉదయం తొమ్మిదిన్నర గంటలకు మృతదేహాన్ని గుర్తించిన ఆస్పత్రి వర్గాలు పోలీసులకు పది గంటల పది నిమిషాలకు సమాచారం అందించాయని తెలిపారు. తొలి ఎఫ్ఐఆర్ రాత్రి 11:45 గంటలకు నమోదు కావడం మరింత అనుమానం కలిగించే అంశమని పేర్కొన్నారు.

ప్రధాని మోదీకి మమత మరో లేఖ

కోల్‌కతా, ఆగస్టు 30: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని మోదీకి శుక్రవారం మరో లేఖ రాశారు. హత్యాచార ఘటనలకు పాల్పడే వారిని శిక్షించేందుకు కఠిన చట్టం తీసుకురావాలని, నిర్దిష్ట కాలపరిమితిలో కేసుల్ని పరిష్కరించేలా అది ఉండాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై గత వారం తాను రాసిన లేఖకు ప్రధాని మోదీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర మహిళా శిశుసంక్షేమశాఖ నుంచి తనకు బదులు వచ్చిందని, అయితే సమస్య తీవ్రత దృష్ట్యా ఆ సాధారణ సమాధానం సరిపోదని మమత పేర్కొన్నారు. గత వారం ఇదే అంశంపై మమత మోదీకి తొలిసారి లేఖ రాశారు. కాగా, కోల్‌కతాలో హత్యాచార ఘటనపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వచ్చే వారం ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో అత్యాచారాల నిరోధానికి కొత్త బిల్లు తీసుకురానున్నట్లు పేర్కొంది.

12 సార్లు పరీక్ష రాశా.. అందులో ఏడింటిని వదిలేయండి..

» ఢిల్లీ హైకోర్టుకు పూజా ఖేద్కర్ అభ్యర్థన



న్యూఢిల్లీ, ఆగస్టు 30: తాను 12 సార్లు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రవేశ పరీక్షలు రాశానని, అందులో ఏడింటిని వదిలేసి మిగిలిన ఐదు పరీక్షలనే పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఐఏఎస్ ట్రైనీ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును కోరారు. అలాగే, ఏసీఎల్ గాయం వల్ల తన ఎడమ మోకాలు అస్థిరంగా ఉన్నట్టు మహారాష్ట్ర ఆస్పత్రి ఇచ్చిన ధ్రువపత్రం తన వద్ద ఉందని, అందువల్ల దివ్యాంగుల కోటాలో తాను రాసిన పరీక్షలనే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. 40% అంగ వైకల్యం ఉన్న వారు దివ్యాంగులని నిబంధనలు చెబుతున్నాయని, తనకు 47% వైకల్యం ఉందని తెలిపారు. ఈ మేరకు న్యాయస్థానంలో శుక్రవారం ఆమె ఓ అఫిడవిట్ దాఖలు చేశారు. జనరల్ కేటగిరీ అభ్యర్థిగా తాను రాసిన పరీక్షలను గుర్తించవద్దని కోరారు. న్యాయస్థానం ఇందుకు అంగీకరిస్తే తాను రాసిన పరీక్షల సంఖ్య ఐదు(అన్నింటిల్లో ఆమె ఉత్తీర్ణత సాధించారు)కు తగ్గుతుందని పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థులు సివిల్స్ రాసేందుకు ఉన్న తొమ్మిది పరిమిత ప్రయత్నాల కంటే ఈ అంకె నాలుగు తక్కువని, జనరల్ కేటగిరీ అభ్యర్థులకు ఉన్న అత్యధిక అవకాశాల కంటే ఒకటి తక్కువేనని పూజా అభ్యర్థించారు. ఫోర్జరీ, చీటింగ్ కేసుల్లో తన అరెస్టును అడ్డుకోవాలంటూ పూజా కొద్ది రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. కాగా, పూజా ఖేద్కర్ 12 సార్లు పరీక్ష రాయగా అందులో ఓసారి పేరును మార్చి బోర్డును మోసగించారంటూ యూపీఎస్సీ చేసిన ఆరోపణను కూడా పూజా ఖండించింది. తాను తన పేరును మార్చలేదని మధ్యలో అటు పదం ఇటు మార్చి చిన్న మార్పు చేశానని సమర్థించుకున్నారు. ఇదిలా ఉండగా, పూజా ఖేద్కర్ వివాదం నేపథ్యంలో సివిల్స్ అభ్యర్థుల గుర్తింపును ఆధార్ ఆధారితంగా ధ్రువీకరించుకోవడానికి యూపీఎస్సీకి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

అరేబియాలో తుఫాన్.. పేరు 'అస్నా'

విశాఖపట్నం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అరేబియా సముద్రంలో తుఫాన్ ఏర్పడింది. దీనికి పాకిస్థాన్ సూచించిన 'అస్నా' అని పేరు పెట్టారు. ఆగస్టులో తుఫాన్‌లు రావడం చాలా అరుదు. అయితే సముద్రాలు వేడెక్కడంతో తుఫాన్ ఏర్పడింది. అరేబియా సముద్రంలో ఆగస్టులో 1891 నుంచి 1976 వరకూ మూడు తుఫాన్‌లు వచ్చాయి. 'అస్నా' నాలుగోది. గతంలో 1944, 1964, 1976 సంవత్సరాల్లో ఆగస్టు నెలలో తుఫాన్‌లు వచ్చాయి.

కనీస పెన్షన్ రూ.7,500 చేయండి

» ఆర్థిక మంత్రికి పెన్షనర్ల సంఘం వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 30: కనీస నెలవారీ పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని ఈపీఎస్-95 నేషనల్ యాజిటేషన్ కమిటీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలను విజ్ఞప్తి చేసింది. ఈ సంఘం 78 లక్షల మంది పెన్షనర్లకు, పరిశ్రమల్లో పనిచేస్తున్న 7.5 కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఆ సంఘం ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం సానుభూతితో వ్యవహరిస్తోందని, సమస్యకు పరిష్కారాన్ని అన్వేషిస్తుందని ఆమె వారికి హామీ ఇచ్చారు. పెన్షనర్లకు ఆర్థిక భద్రత కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గత నెలలో ఈ సంఘం ప్రతినిధులు కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసి ఇదే సమస్యపై వినతి పత్రం సమర్పించారు.

నవ్వుతో చెల్లింపు!

'స్మైల్‌పే' పేరిట ముఖ గుర్తింపు ఆధారిత చెల్లింపు వ్యవస్థ

» ప్రారంభించిన ఫెడరల్ బ్యాంకు

» దేశంలోనే మొదటి ఫేషియల్ పేమెంట్ వ్యవస్థ



న్యూఢిల్లీ, ఆగస్టు 30: మారుతున్న కాలానికి అనుగుణంగా సులభంగా, సురక్షితంగా చెల్లింపులు చేసేందుకు కొంగొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. నగదు నుంచి కార్డులు తర్వాత క్యూఆర్ కోడ్‌లు, వేరబుల్స్‌తో వివిధ రకాల చెల్లింపులు చేస్తున్నాం. తాజాగా ముఖ గుర్తింపు టెక్నాలజీ ఆధారంగా చెల్లింపులు జరిపే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ప్రైవేటు రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఫెడరల్ బ్యాంకు 'స్మైల్‌పే' పేరిట ఫేషియల్ రికగ్నిషన్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ తరహా చెల్లింపు విధానాన్ని ప్రారంభించడం దేశంలోనే మొదటిది. రిలయన్స్ రిటైల్, స్వతంత్ర మైక్రో హౌసింగ్‌ల సహకారంతో ఎంపిక చేసిన శాఖలు, ఔట్‌లెట్లలో పైలెట్‌గా దీన్ని ప్రారంభించింది. యూఐడీఏఐకి చెందిన భీమ్ ఆధార్ పేపై అత్యాధునిక ఫేషియల్ అథెంటికేషన్ టెక్నాలజీతో దీనిని రూపొందించారు. ఈ వినూత్న సదుపాయం వల్ల నగదు, కార్డులు, మొబైల్ డివైజ్‌ల అవసరం లేకుండా ఒక్క నవ్వుతో చెల్లింపులు చేయవచ్చు. తొలుత స్మైల్ పే సర్వీసు కేవలం ఫెడరల్ బ్యాంకు కస్టమర్లకే అందుబాటులో ఉంటుంది. వ్యాపారులు, కస్టమర్లు ఇద్దరు కూడా ఫెడరల్ బ్యాంకు ఖాతాలను కలిగి ఉండాలి. రానున్న కాలంలో ఈ సేవలను విస్తృతం చేయనున్నారు. స్మైల్‌పే ద్వారా ఒక్కో లావాదేవీకి రూ.5వేల వరకు పరిమితి ఉంటుంది. నెలకు రూ.50 వేల వరకు చెల్లింపులు చేయవచ్చు. బ్యాంకు మర్చంట్స్ తమ మొబైల్‌లో ఫెడ్ మర్చంట్ అప్లికేషన్‌లో పేమెంట్ ఆప్షన్లలో ఉండే స్మైల్ పే ఆప్షన్ ఎంచుకొని ఈ సదుపాయాన్ని పొందవచ్చు. ఫెడ్ మర్చంట్స్.. కస్టమర్ ఆధార్ నంబరును ఎంటర్ చేసి చెల్లింపు ప్రక్రియను ప్రారంభిస్తారు. అనంతరం వ్యాపారి మొబైల్ నుంచి కస్టమర్ ముఖాన్ని స్కాన్ చేస్తారు. యూఐడీఏఐ వ్యవస్థలో నిల్వ ఉన్న ఫేషియల్ డేటా ఆధారంగా వెరిఫికేషన్ జరుగుతుంది. ఆ తర్వాత కస్టమర్ ఖాతా నుంచి సొమ్ము డెబిట్ అవుతుంది. ఆ మొత్తం వ్యాపారి ఫెడరల్ బ్యాంకు ఖాతాలో జమవుతుంది.

బిజినెస్

అమ్మకానికి కాగ్నిజెంట్ చెన్నై ప్రధాన కార్యాలయం!

15 ఎకరాల స్థలానికి రూ.800 కోట్లు వస్తాయని అంచనా

చెన్నై: అమెరికా ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ చెన్నైలోని తన భారత ప్రధాన కార్యాలయాన్ని అమ్మకానికి పెట్టింది. చెన్నై ఐటీ కారిడార్‌లో 15 ఎకరాల విస్తీర్ణం, నాలుగు లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ స్పేస్ ఉన్న ఈ ఆస్తి గత 20 సంవత్సరాలుగా కంపెనీ ప్రధాన కార్యాలయంగా కొనసాగుతోంది. ఈ ఆస్తికి ఎంత లేదన్నా రూ.800 కోట్ల వరకు ధర లభించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. కాగ్నిజెంట్ ఈ ఆస్తి అమ్మకం కోసం జేఎల్ఎల్‌ను ప్రాపర్టీ అడ్వైజరీగా నియమించింది. చెన్నైకి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థలు భాష్యం గ్రూప్, కాసాగ్రాండ్ ఈ ఆస్తి కోసం పోటీ పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికల్లా ఈ విక్రయాన్ని పూర్తి చేయాలని కాగ్నిజెంట్ యోచిస్తున్నట్లు సమాచారం. చెన్నై జీఎస్‌టీ రోడ్డులోని తాంబరం ప్రాంతానికి కాగ్నిజెంట్ తన ప్రధాన కార్యాలయాన్ని తరలిస్తుండడంతో ఈ కార్యాలయాన్ని అమ్మకానికి పెట్టింది.

టర్మ్ పాలసీలకు జీఎస్‌టీ మినహాయింపు?

న్యూఢిల్లీ: బీమా కంపెనీలు అందించే టర్మ్ పాలసీలపై ప్రభుత్వం త్వరలో తీపికబురు చెప్పబోతున్నట్లు సమాచారం. ఈ పాలసీలను జీఎస్‌టీ నుంచి మినహాయించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వచ్చే నెల 9న జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో ఈ విషయం అధికారికంగా ప్రకటిస్తారని అధికార వర్గాలు చెప్పాయి. ఇతర బీమా పాలసీల్లానే ఈ పాలసీలపైనా ప్రస్తుతం 18 శాతం జీఎస్‌టీ విధిస్తున్నారు. పన్ను మినహాయింపు లభిస్తే ఈ పాలసీలకు మరింత ఆదరణ లభించనుంది. 10 నుంచి 30 సంవత్సరాల కాలపరిమితి ఉండే ఈ పాలసీల గడువులో.. పాలసీదారుడు మరణిస్తే.. అతడి కుటుంబానికి బీమా కంపెనీ ద్వారా పాలసీలో పేర్కొన్నంత మేరకు ఆర్థిక రక్షణ లభిస్తుంది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు ఆమోదిస్తే ఏటా రూ.200 కోట్ల మేర జీఎస్‌టీ ఆదాయం మాత్రమే నష్టపోతుందని అంచనా.

గతంలో ఇచ్చిన ఆఫర్లన్నీ గౌరవిస్తాం: విప్రో

న్యూఢిల్లీ: గతంలో జారీ చేసిన ఉద్యోగాల ఆఫర్ పత్రాలన్నింటినీ గౌరవించడం, వారందరినీ ఉద్యోగాల్లో చేర్చుకోవడం తమ ప్రాధాన్యత అని ఐటీ కంపెనీ విప్రో ప్రకటించింది. వర్తమాన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అలాంటి 3,000 మంది "కొత్త తరం అసోసియేట్ల"ను (ఎన్‌జీఏ) ఉద్యోగాల్లో చేర్చుకున్నట్టు తెలిపింది. మొత్తం 10 వేల నుంచి 12 వేల ఎన్‌జీఏలకు ఉద్యోగాలివ్వనున్నట్టు తెలిపింది. టెక్నాలజీ పరిశ్రమలో ఉద్యోగాల కోతలు ఉన్న నేపథ్యంలో ఈ హామీకి ప్రాధాన్యత ఏర్పడింది. తాము జెనరేటివ్ ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ విభాగాల్లో ఉద్యోగులను చేర్చుకుంటున్నట్టు తెలిపింది.



15 నెలల కనిష్ఠానికి జీడీపీ వృద్ధి రేటు

జోరు తగ్గిన ఆర్థికం

క్యూ1లో 6.7 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో జోరు తగ్గింది. దేశంలో స్థూల వస్తూత్పత్తిలో వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (క్యూ1)లో 6.7 శాతానికి పరిమితమైంది. ఇది 15 నెలల లేదా ఐదు త్రైమాసికాల కనిష్ఠ స్థాయి. వ్యవసాయ, సేవల రంగాలు ప్రదర్శించిన నిరాశావహమైన పనితీరు ఇందుకు కారణం. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి రేటు దిగజారినప్పటికీ ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని భారత్ నిలబెట్టుకుంది. మన పోటీ ఆర్థిక వ్యవస్థ అయిన చైనా ఇదే త్రైమాసికంలో 4.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. గతంలో జీడీపీ వృద్ధి రేటులో కనిష్ఠ స్థాయి 6.2 శాతం 2023 జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైంది. స్థిర ధరల ప్రకారం క్యూ1లో జీడీపీ పరిమాణం రూ.43.64 లక్షల కోట్లున్నట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ విలువ రూ.40.91 లక్షల కోట్లుగా (6.7% వృద్ధి) ఉంది. ప్రస్తుత ధరల ప్రకారం ఇది రూ.77.31 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో 9.7 వృద్ధితో జీడీపీ పరిమాణం రూ.70.50 లక్షల కోట్లుగా ఉంది. మరిన్ని వివరాలు..

- వ్యవసాయ రంగంలో స్థూల విలువ జోడింపులో (జీవీఏ) వృద్ధి 3.7% నుంచి 2 శాతానికి దిగజారింది. ఆర్థిక, రియల్ ఎస్టేట్, వృత్తి సర్వీసుల్లో జీవీఏ 12.6% నుంచి 7.1 శాతానికి తగ్గింది.
- వాణిజ్య, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవల రంగం 9.7% నుంచి 5.7 శాతానికి మందగించింది.
- తయారీ రంగం జీవీఏ మాత్రం 5% నుంచి 7 శాతానికి పెరిగింది. గనులు, క్వారీ రంగాల్లో జీవీఏ 7% నుంచి 7.2 శాతానికి, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సర్వీసుల్లో జీవీఏ 3.2% నుంచి 10.4 శాతానికి దూసుకుపోయింది. నిర్మాణ రంగంలో వృద్ధి 8.6% నుంచి 10.5 శాతానికి పెరిగింది.



ప్రధాని మోదీ

ఫిన్‌టెక్‌ల పనితీరు భేష్

సైబర్ మోసాలకు చెక్ పెట్టాలి

లేకపోతే ఫిన్‌టెక్‌ల మనుగడకే ప్రమాదం

ముంబై: దేశంలో ఫిన్‌టెక్ కంపెనీల పనితీరుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఈ సంస్థల కారణంగానే ఆర్థిక సేవల ప్రజాస్వామీకరణ జరిగిందని ముంబైలో శుక్రవారం ముగిసిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్), 2024 సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలిపారు. అయితే ఈ సంస్థలు అందించే ఆర్థిక సేవల్లో సైబర్ మోసాలు పెరిగి పోతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అడ్డుకోకపోతే ఫిన్‌టెక్ కంపెనీల మనుగడ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. దేశంలో ఫిన్‌టెక్‌లు, స్టార్టప్ కంపెనీల అభివృద్ధికి సైబర్ మోసాలు అడ్డంకి కాకూడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ మోసాలకు చెక్ పెట్టేందుకు డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెగ్యులేటరీ సంస్థలు మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.2.6 లక్షల కోట్ల పెట్టుబడులు: దేశంలో ఫిన్‌టెక్ కంపెనీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఇందుకోసం ఏంజిల్ ట్యాక్స్ రద్దు, పరిశోధన-నవకల్పనలకు రూ.లక్ష కోట్ల కేటాయింపుతో పాటు విధానపరమైన అనేక సానుకూల నిర్ణయాలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ చర్యలతో ఫిన్‌టెక్ రంగం గత పదేళ్లలో 3,100 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.6 లక్షల కోట్లు) పెట్టుబడులు ఆకర్షించగలిగిందన్నారు. ప్రపంచ ఫిన్‌టెక్‌ల విజయపరంపరలో మన యూపీఐ ఒక ఉదాహరణ అన్నారు. ఫిన్‌టెక్‌లతో అక్రమ నగదు లావాదేవీలకూ తెరపడుతుందని తెలిపారు. డిజిటల్ టెక్నాలజీ కారణంగా ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెరిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. నేరుగా నగదు బదిలీ పథకం విజయమే ఇందుకు ఉదాహరణ అన్నారు.

గూగుల్ పే నుంచి యూపీఐ సర్కిల్

గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ సందర్భంగా గూగుల్ పే పలు కొత్త డిజిటల్ చెల్లింపుల విధానాలను ఆవిష్కరించింది. ఇందులో యూపీఐ సర్కిల్ ఒకటి. ఈ ఫీచర్ ద్వారా గూగుల్ పే ఖాతాదారులు తమ కుటుంబ సభ్యులు, మిత్రుల బ్యాంకు ఖాతాలను లింక్ చేయకుండానే వారిని సెకండరీ యూజర్లుగా గూగుల్ పేలో చేర్చవచ్చు. ఎన్‌పీసీఐ భాగస్వామ్యంతో గూగుల్ పే ఈ ఫీచర్ తీసుకొచ్చింది. ఇంకా 'ఈ-రూపీ, రూపే కార్డు హోల్డర్ల కోసం ట్యాప్ అండ్ పే విధానాలను ఆవిష్కరించింది.

9 రోజులు..రూ.10 లక్షల కోట్లు

ఈక్విటీ ఇన్వెస్టర్లకు కాసుల పంట.. ఆల్‌టైమ్ హైలో సూచీలు

ఈక్విటీ మార్కెట్ సూచీలు వరుస లాభాలతో కొత్త రికార్డుల పయనం సాగిస్తూనే ఉన్నాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన పటిష్ఠమైన సంకేతాలు, విదేశీ నిధుల రాక, అమెరికా వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలు మార్కెట్‌ను పరుగులు తీయిస్తున్నాయి. సెన్సెక్స్ వరుసగా తొమ్మిదో రోజు లాభపడగా నిఫ్టీ వరుసగా 12వ రోజు లాభాలతో ముగిసింది. 12 వరుస సెషన్లలో నిఫ్టీ 1,096.90 పాయింట్లు లాభపడింది. 1996లో నిఫ్టీ ఏర్పడిన తర్వాత అత్యుత్తమ ప్రదర్శన ఇదే. శుక్రవారం భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ మార్కెట్ ర్యాలీకి మద్దతు ఇచ్చాయి. సెన్సెక్స్ 231.16 పాయింట్ల లాభంతో చారిత్రక గరిష్ఠ స్థాయి 82,365.77 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో కూడా 502.42 పాయింట్లు లాభపడి 82,637.03 పాయింట్ల రికార్డుకు దూసుకుపోయింది. నిఫ్టీ 83.95 శాతం లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 25,235.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 116.4 పాయింట్ల లాభంతో కొత్త చారిత్రక రికార్డు 25,268.35 పాయింట్లను తాకింది.

తొమ్మిది రోజుల ర్యాలీలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.10,00,028 కోట్ల మేరకు పెరిగి రూ.4,64,39,993.77 కోట్ల (5.54 లక్షల కోట్ల డాలర్లు) రికార్డును తాకింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,150 ▼	67,050 ▼	93,000 ▼
ముంబై	71,958 ▼	65,914 ▼	85,019 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31 వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	508	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	98
వరంగల్	99	గుంటూరు	98
కరీంనగర్	99	ఒంగోలు	98
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	92
కర్నూలు	99	నెల్లూరు	92
విశాఖపట్నం	94	అనంతపురం	98
గోదావరి	98		

విస్తారా కథ కంచికి

ఎయిర్ ఇండియాలో విలీనం నవంబరు 11 నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ: పది సంవత్సరాల క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన విస్తారా విమానయాన సంస్థ కథ కంచికి చేరుతోంది. ఈ ఏడాది నవంబరు 11 వరకే ఈ పేరుతో విమానాలు నడుస్తాయి. నవంబరు 12 నుంచి ఈ సంస్థ టాటాల నిర్వహణలోని ఎయిర్ ఇండియా గ్రూప్‌లో విలీనమవుతోంది. ఎయిర్ ఇండియా గ్రూప్ ఈక్విటీలో రూ.2,058.5 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)తో 25.1 శాతం వాటా తీసుకునేందుకు సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ) సంస్థ చేసిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో పదేళ్ల విస్తారా ఎయిర్‌లైన్స్ కథ కంచికి చేరుతోంది. ఈ ఏడాది చివరికల్లా ఈ విలీన ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు. పదేళ్ల క్రితం ఎస్ఐఏతో కలిసి 51:49 శాతం భాగస్వామ్యంతో టాటా గ్రూప్.. విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేసింది.

ఈ ఏడాది నవంబరు 12 నుంచి విస్తారా విమానాలు, సిబ్బంది ఎయిర్ ఇండియాకు బదిలీ అవుతారని ఎయిర్ ఇండియా సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. నష్టాల్లో ఉన్నప్పటికీ విస్తారా ఎయిర్‌లైన్స్ 70 విమానాలతో 50 ప్రాంతాలకు విమాన సర్వీసులు నడుపుతోంది. ఈ విలీనంతో ఎయిర్ ఇండియా సేవలు మరింత విస్తృతమవుతాయని భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో కాల్ సెంటర్

పాలసీబజార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పాలసీబజార్ దక్షిణ భారత్‌లో తన కార్యకలపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా త్వరలో హైదరాబాద్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. 20 నుంచి 25 మంది ఉద్యోగులు ఈ సెంటర్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఖాతాదారులకు సేవలు అందిస్తారని పాలసీబజార్ అనుబంధ సంస్థ పీబీపార్ట్‌నర్స్ మోటార్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ అభిమన్యు శర్మ చెప్పారు. అక్టోబరు నాటికి తమ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం కూడా ప్రారంభమవుతుందన్నారు. పాలసీబజార్ ఆదాయంలో 73 శాతం మోటార్ ఇన్సూరెన్స్ ద్వారా వస్తోందన్నారు. ఇందులో 45 శాతం వాటా వాణిజ్య వాహనాలు, 35 శాతం ద్విచక్ర వాహనాల బీమా ద్వారా వస్తోందన్నారు. పీబీ పార్ట్‌నర్స్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ పాలసీలను ప్రజలకు మరింత చేరువ చేయనున్నట్టు తెలిపారు. పాలసీల నమోదు నుంచి క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ వరకు ఈ పార్ట్‌నర్స్ సేవలు అందిస్తారని శర్మ చెప్పారు.

ఎన్‌హెచ్‌పీసీ, ఎస్‌జేవీఎన్‌కు నవరత్న హోదా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థలైన నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ), సట్లెజ్ జల్‌విద్యుత్ నిగమ్ లిమిటెడ్ (ఎస్‌జేవీఎన్), సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈసీఐ)లకు కేంద్ర ప్రభుత్వం నవరత్న హోదాను ప్రకటించింది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌హెచ్‌పీసీ, ఎస్‌జేవీఎన్‌లకు ఇప్పటికే మినీ నవరత్న హోదా ఉండగా తాజాగా ప్రభుత్వం నవరత్న హోదాను ఇచ్చింది.



ముఖ్యమంత్రికి ఆశీర్వచనాలు అందిస్తున్న వేములవాడ ఆలయ అర్చకులు

వేములవాడ ఆలయ విస్తరణకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోండి

» సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సిరిసిల్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాలని అధికారులు, అర్చకుల్ని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ఆలయ విస్తరణకు బడ్జెట్‌లో 50 కోట్ల రూపాయలు కేటాయించినందుకు హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ అర్చకులు, అధికారులు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదాన్ని అందించడంతో పాటు దేవస్థానం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం విస్తరణకు సంబంధించిన డిజైన్లు, నమూనాలకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు వివరించారు. వెంటనే వెళ్లి శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించారు. ఆయన్ను కలిసిన వారిలో దేవస్థానం ఈవో వినోద్, స్థపతి వల్లినాయగం, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ తదితరులు ఉన్నారు.

ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలి: భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపకుండా, ప్రభుత్వ అవసరాలు, ఆలోచనలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆదాయ మార్గాలపై పలు కీలక శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆదాయ పెంపుపై ప్రతి నెలా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగే సమావేశానికి అధికారులు నూతన ఆలోచనలతో రావాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా తాము అధికారులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చామని, మంచి నిర్ణయాలు తీసుకుని సత్ఫలితాలు సాధించాలని సూచించారు. ఇసుకను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధాన పట్టణాల్లోని సబ్ యార్డులు, అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మార్కెట్ యార్డుల్లో నిల్వలు ఉంచాలని గనుల శాఖ అధికారులకు సూచించారు. లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌లో వేగం పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు, ఇప్పటివరకు సమకూరిన ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ వివరాలు, అసైన్డ్ భూముల కోర్టు వివాదాలను సమీక్షించారు. ల్యాండ్ పూలింగ్ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కావొద్దని ఆదేశించారు. వస్తు సేవల పన్నులో లీకేజీలను అరికట్టి, ఆదాయాన్ని పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు.

మహిళా సంఘాల ద్వారా బస్సుల కొనుగోలు

» మొదటి దశలో 600 బస్సులు: మంత్రి పొన్నం



హుస్నాబాద్, ఆగస్టు 30 : ఆర్టీసీకి అవసరమైన బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొదటి దశలో 600 బస్సులను కొనుగోలు చేసేందుకు చర్చలు జరుగుతున్నాయన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నియోజకవర్గ స్థాయి గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. త్వరలో మహిళా సంఘాలు బస్సు యజమానులు కాబోతున్నారని వెల్లడించారు. స్త్రీ శక్తి ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలను మహిళలు సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. హుస్నాబాద్‌లో 100 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని, మండల సమాఖ్యల ద్వారా యూనిట్లను నెలకొల్పేందుకు ప్రోత్సహం అందిస్తామని చెప్పారు.

రోజుకు 1000 చొప్పున ఫైన్ కట్టండి : హైకోర్టు

» ఐఏఎంసీ భూకేటాయింపు కేసులో కౌంటర్ దాఖలు చేయనందుకు ప్రభుత్వంపై ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్(ఐఏఎంసీ)కి భూకేటాయింపు, ఖర్చుల కోసం రూ.3 కోట్లు కేటాయిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లలో 10 నెలలుగా కౌంటర్ దాఖలు చేయకుండా తాత్సారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. శుక్రవారం నుంచి ఎప్పుడు కౌంటర్ దాఖలు చేస్తారో అప్పటి వరకు రోజుకు రూ. వెయ్యి చొప్పున జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మొత్తాన్ని లీగల్ సర్వీసెస్ అథారిటీకి జమ చేయాలని పేర్కొంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నెంబర్ 83/1లో 3.70 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఐఏఎంసీకి కేటాయించింది. దీంతోపాటు నిర్వహణ ఖర్చుల కోసం రూ. 3 కోట్లు సైతం విడుదల చేస్తూ జీవోలు జారీ చేసింది. ప్రైవేటు సంస్థ అయిన ఐఏఎంసీకి ఉచితంగా రూ.కోట్ల విలువైన భూమిని కేటాయించడమే కాక ఖర్చులకు డబ్బులు ఇవ్వడం చెల్లదని పేర్కొంటూ హైకోర్టులో వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ కేసులో ఎన్నిసార్లు ఆదేశించినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో కౌంటర్ దాఖలు చేసే వరకు జరిమానా చెల్లించాలని జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ సుజన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

ఇంటర్ ప్రవేశాల గడువు సెప్టెంబరు 7 దాకా పెంపు

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువును సెప్టెంబరు 7వ తేదీ వరకు పెంచుతున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం తెలిపింది. 2024- 25 విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, కో-ఆపరేటివ్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, కాంపోజిట్ డిగ్రీ, వివిధ సంక్షేమ శాఖల పరిధిలోని గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు ఇదే చివరి అవకాశమని పేర్కొంది. ఈ గడువులోగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించింది. ఇంటర్మీడియట్ బోర్డు అనుబంధ (అఫిలియేటెడ్) కళాశాలల్లోనే చేరాలని విద్యార్థులకు సూచించింది. అనుబంధ కళాశాలల జాబితా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ఉందని తెలిపింది.

నేటి నుంచి బీపీఈడీ రెండో దశ కౌన్సెలింగ్

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ), అండర్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (యూజీడీపీఈడీ) కోర్సుల రెండో, చివరి దశ కౌన్సెలింగ్ శనివారం నుంచి ప్రారంభమవుతుందని టీజీపీఈసెట్ కన్వీనర్ పి.రమేశ్‌బాబు తెలిపారు. సెప్టెంబరు 3వ తేదీ వరకు సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని, అర్హులైన అభ్యర్థుల జాబితాను అదే రోజున వెల్లడిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 4 నుంచి 5వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, 6న ఎడిటింగ్‌కు అవకాశముంటుందని వివరించారు. కళాశాలల వారీగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను 8న వెబ్‌సైట్‌లో పెడతామని, 9 నుంచి 12వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో అభ్యర్థులు రిపోర్టు చేసి ఫీజును చెల్లించాలని తెలిపారు.

సింగరేణిలో జనరల్ మజ్దూర్లుగా బదిలీ వర్కర్లు

» 2,364 మందిని క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం

సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ విధానంలో నియమితులైన 2,364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ ఆ సంస్థ నిర్ణయం తీసుకుంది. వీరిలో 243 మంది మహిళలు కూడా ఉన్నారు. ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన నేపథ్యంలో వీరిని క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. ఈ నిర్ణయం సెప్టెంబరు 1 తేదీ నుంచి అమల్లోకి రానుంది.

12 చెరువులు.. 887 అక్రమ నిర్మాణాలు!

హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే చేసి ప్రాథమికంగా గుర్తించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 12 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, వాటిని తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు సర్వే చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న 12 చెరువులకు సంబంధించి చేసిన సర్వేలో.. 887 దాకా అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం. మాదాపూర్‌లోని దుర్గం చెరువు పరిధిలో 224 వరకు ఐదంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, దుకాణాలు, చిన్నా, చితకా కాలనీలున్నట్లు వారు కనుగొన్నారు. అల్వాల్‌లోని చిన్నరాయుని చెరువులో 185, కూకట్‌పల్లిలోని అంబీర్ చెరువులో 108, అల్లాపూర్‌లోని సున్నం చెరువులో 78, హస్మత్‌పేట్‌లోని బోయిన్‌చెరువులో 125, గోపన్‌పల్లిలోని గోసానికుంటలో 34, పీర్జాదిగూడలోని పెద్ద చెరువులో 27, ఉప్పల్‌లోని నల్లచెరువులో 26, బైరామల్‌గూడలోని మద్దెలకుంటలో 12, దుండిగల్‌లోని చిన్నదామెర చెరువులో 7, చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువులో 60, నల్లగండ్లలోని నల్లగండ్ల చెరువులో 1 నిర్మాణం ఉన్నట్లు ఇటీవల గుర్తించారు. వీటిలో.. మద్దెలకుంట చెరువు 6.64 ఎకరాల నుంచి 4.5 ఎకరాలకు కుచించుకుపోయింది. సున్నం చెరువు 32.51 ఎకరాల నుంచి 15.23 ఎకరాలకు, బోయినిచెరువు 72.16 ఎకరాల నుంచి 64.06 ఎకరాలకు, చిన్నరాయుని చెరువు 48 నుంచి 24 ఎకరాలకు, అంబీర్ చెరువు 224 నుంచి 84 ఎకరాలకు, చిన్నదామెర చెరువు 114 నుంచి 100 ఎకరాలకు, దుర్గం చెరువు 160.6 నుంచి 65.12 ఎకరాలకు, నల్లగండ్ల చెరువు 60 నుంచి 32.15 ఎకరాలకు, గంగారం పెద్ద చెరువు 61.01 ఎకరాల నుంచి 50 ఎకరాలకు, ఉప్పల్ నల్ల చెరువు 103 నుంచి 65 ఎకరాలకు, పీర్జాదిగూడ పెద్ద చెరువు 49 నుంచి 34 ఎకరాలకు కుచించుకుపోయినట్లు అధికారులు గుర్తించారు.

రాష్ట్రాన్ని మరో బుల్డోజర్ రాజ్యం కానివ్వొద్దు

» రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించండి

» మల్లికార్జున ఖర్గేకు కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్యం కానివ్వొద్దని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించాలంటూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. 'ఒకరి ఇంటిని కూల్చి వారి కుటుంబాన్ని నిరాశ్రయులను చేయడం అమానవీయం, అన్యాయమని గతంలో మీరే అన్నారు. ఇప్పుడు తెలంగాణలో కూడా పేదల ఇళ్లను అదే విధంగా కూల్చేస్తూ వారిని నిరాశ్రయులను చేస్తున్నారు. దీనికి మీ సమాధానం ఏమిటి?' అంటూ ఖర్గేను కేటీఆర్ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రభుత్వం కూల్చేసిన 75 కుటుంబాల ఇళ్లలో 25 కుటుంబాలు వికలాంగులకు చెందిన వేనని ఆయన పేర్కొన్నారు.

ఫిర్యాదు వచ్చిన 48 గంటల్లోపే.. ఆక్రమణలు నేలమట్టం

హైదరాబాద్ రాంనగర్ మణెమ్మ గల్లీ రోడ్డు, నాలాపై చర్యలు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించిన రెండు రోజుల్లోనే..

» మూడంతస్తుల భవనం సహా రోడ్డుపై ఉన్న కట్టడాల తొలగింపు

హైదరాబాద్ సిటీ, ఓల్డ్‌బోయినపల్లి, రాంనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): "సర్.. మా ప్రాంతంలో రోడ్డు, నాలాను ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపట్టారు. వర్షం నీరు బయటకు వెళ్లడం లేదు. కొత్త డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు వీలు లేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాం.." ఇదీ మంగళవారం హైదరాబాద్ అడిక్‌మెట్ డివిజన్ ముషీరాబాద్ సర్కిల్-15 పరిధి రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ గల్లీ వాసులు హైడ్రాకు చేసిన ఫిర్యాదు. దీనిపై 48 గంటల్లోనే అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయమే రంగంలోకి దిగారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి కూల్చివేతలు చేపట్టారు. కాగా, మణెమ్మ గల్లీ స్థానికుల ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం సాయంత్రం జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులతో కలిసి ఆక్రమణలను పరిశీలించారు. రికార్డులు, ఇళ్ల డాక్యుమెంట్లను గమనించి నివేదిక ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏసీపీ గురువారం సమగ్ర నివేదికను హైడ్రా కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. పరిశీలించిన రంగనాథ్.. రోడ్డు, నాలాను ఆక్రమించి చేపట్టిన కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు డీఆర్ఎఫ్, పోలీస్ సిబ్బంది మూడు ఎక్స్‌కవేటర్‌లతో మణెమ్మ గల్లీకి వెళ్లారు. రోడ్డుపై నిర్మించిన బాబుయాదవ్‌కు సంబంధించిన యాభై గజాల ఇంటిని, యాభై గజాల స్థలంలో విక్రమ్‌యాదవ్‌కు చెందిన కల్లు కాంపౌండ్ షెడ్డు, దానిపక్కనే ఉన్న స్థలం గోడలు, ఆ పక్కనే ఉన్న వైష్ణవి బార్-రెస్టారెంట్ యజమాని బాల్‌రాజ్‌గౌడ్ నిర్మించిన మూడంతస్తుల భవనాన్ని కూల్చివేశారు. నోటీసులు జారీ చేయకుండా కూల్చివేతలు ఏమిటని అధికారులతో వారు వాగ్వాదానికి దిగగా ఉద్రిక్తత నెలకొంది. అక్రమ నిర్మాణదారులను పోలీసులు దూరంగా తీసుకెళ్లారు.



కల్లు కాంపౌండ్ షెడ్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

ఎంపీకి ఫోన్ చేసినా..

మణెమ్మ గల్లీలో 40 ఏళ్లుగా ఉంటున్నవారి నిర్మాణాలను ఎలా కూల్చివేస్తారంటూ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకుడు విజయ్ యాదవ్.. టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్‌తో వాదనకు దిగినా పట్టించుకోలేదు. ఆయన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అయినా.. అధికారులు కూల్చివేతలు కొనసాగించారు. రెవెన్యూ రికార్డులో మణెమ్మ గల్లీ నుంచి ప్రధాన రోడ్డుకు ఎల్ ఆకారంలో 24 అడుగుల రోడ్డు ఉందని తేలిందని అందుకు అనుగుణంగా కూల్చివేతలు చేపట్టామని ఏసీపీ దేవేందర్ తెలిపారు. కాగా, మణెమ్మ గల్లీలో మురుగునీటి పారుదలకు అడ్డుపడుతూ నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించామని రంగనాథ్ వెల్లడించారు. 21వ వార్డు సర్వే నం.20లోని 155 బ్లాక్ ఎ జమిస్తాపూర్‌లో ఆక్రమణలను గుర్తించామని చెప్పారు. కొందరు వ్యక్తులు కల్లు కాంపౌండ్, తాత్కాలిక షెడ్‌తో పాటు జీ ప్లస్ 2 భవనాన్ని నిర్మించారని, వీటికి అనుమతులు లేవని తెలిపారు. మురుగు పారేందుకు ఇబ్బందితో మణెమ్మ గల్లీ, రాంనగర్‌వాసులు రోజూ అవస్థ పడుతున్నారని చెప్పారు.

రెవెన్యూ నోటీసులతో టెన్షన్.. టెన్షన్

వారం రోజుల్లో ఖాళీ చేయాలంటూ సికింద్రాబాద్ ఓల్డ్‌బోయినపల్లి హస్మత్‌పేట హరిజన బస్తీ వాసులు 125 మందికి రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసులు దడ పుట్టిస్తున్నాయి. ఈ బస్తీ బోయిన్‌చెరువుకు పక్కన ఉంది. దశాబ్దాల క్రితం ఇక్కడ గడిసెలు వేసుకున్నామని, 1987లో ప్రభుత్వం పట్టాలిచ్చిందని చెబుతున్నారు. తమకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. బహుమతి వచ్చిందని నమ్మించి సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. కమ్యూనిటీ హాలు, నల్లపోచమ్మ ఆలయానికి కూడా నోటీసులు ఇచ్చారంటున్నారు.

అధికారులపై క్రిమినల్ కేసు

» జీహెచ్‌ఎంసీలోని ఆరుగురిపై నమోదు

» ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులిచ్చినందుకే

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలకు అనుమతులు జారీచేసిన జీహెచ్‌ఎంసీ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీరిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతికి లేఖ రాశారు. దీంతో.. ఈర్ల చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలకు ఆమోదం తెలిపిన జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) సర్కిల్-21 ఎం.రాజ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ సుధాంశ్‌లపై కేసులు నమోదయ్యాయి. నిజాంపేట ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్ పి.రామకృష్ణ, తహసీల్దార్ పూల్‌సింగ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, డిప్యూటీ కమిషనర్ సుధీర్‌కుమార్ పైనా కేసులు నమోదు చేశారు.

అలసత్వం వద్దు.. అన్ని ఫిర్యాదులను పరిశీలించాలి

» ఇబ్బందులు లేనిచోట ఆక్రమణలను తొలగించాలి

» అధికారులతో సమీక్షలో రంగనాథ్

వరుస ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రతి ఫిర్యాదూ ప్రత్యేకమే అని అలసత్వం వద్దు అన్ని అంశాలు పరిశీలించాలని సూచించారు. ఇప్పటిదాక వచ్చిన వినతులు.. వాటిలో ఏ విభాగానివి ఎన్ని ? పరిశీలించినవి ఎన్ని..? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బుద్ధ భవన్‌లోని కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ సమావేశం సాగింది. రంగనాథ్ ప్రతి ఫిర్యాదు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. చెరువులతో పాటు నాలాలు, రోడ్లపై ఆక్రమణల గురించి విన్నపాలు వస్తున్నాయని పేర్కొన్నారు. చెరువుల్లో ఆక్రమణల నిర్ధారణకు సమయం పడుతుందని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేని చోట నాలాలు, రోడ్లపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రంగనాథ్ ఆదేశించినట్లు తెలిసింది. కాగా, విపత్తుల నిర్వహణపైనా ఆయన సమీక్షించారు. వర్షాల సమయంలో వచ్చేవాటిపై ఎంత సమయంలో స్పందిస్తున్నారు..? సమస్య పరిష్కారం ఎప్పుడు జరుగుతుందన్నది ఆరా తీశారు. స్వయంగా కొందరు ఫిర్యాదుదారులకు ఫోన్లు చేసి మాట్లాడారు. ప్రతి నెలా ఫిర్యాదులు, పురోగతిపై సుదీర్ఘ సమీక్ష ఉంటుందని.. చిత్తశుద్ధితో పని చేయాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు.

హిమాయత్‌సాగర్‌కు హైడ్రా బుల్డోజర్లు!

(మొదటిపేజీ తరువాయి)



వాటర్ బోర్డు, నీటిపారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణపై ఒక అంచనాకు వచ్చినట్టు తెలిసింది. దీనికి సంబంధించి సోమవారం నివేదిక ఇచ్చే అవకాశముందని వాటర్‌బోర్డు అధికారి ఒకరు తెలిపారు. పది నిర్మాణాల వరకూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్టు గుర్తించారని ప్రాథమిక సమాచారం. ఇందులో ఆరు భవనాలు కాగా.. మిగతావి ప్రహరీ గోడలు, తాత్కాలిక నిర్మాణాలుగా సమాచారం. అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే, రాజకీయ నేతలు, సినీ ప్రముఖుల నిర్మాణాలూ ఉన్నట్టు తెలిసింది. ఆ నివేదిక ఆధారంగా హైడ్రా తదుపరి చర్యలు తీసుకోనుంది.

విమర్శలకు చెక్ పెట్టేలా..

గండిపేట ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌లో ఆక్రమణలను హైడ్రా ఈ నెల 11న నేలమట్టం చేసింది. ఖానాపూర్, చిలుకూరు ప్రాంతాల్లో ఉన్న కేంద్ర మాజీ మంత్రి, కొందరు వ్యాపారవేత్తలు, రాజకీయ నేతల భవనాలను కూల్చివేసింది. అయితే, ఎఫ్‌టీఎల్ నోటిపై కాలేదన్న కారణంతో హిమాయత్‌సాగర్‌లో ఆక్రమణలను మాత్రం తొలగించలేదు. అధికార పార్టీ నేతల నిర్మాణాలున్నందునే చర్యలు తీసుకోలేదన్న విమర్శల నేపథ్యంలో సత్వర సర్వేకు సర్కారు ఆదేశించినట్టు సమాచారం. దీంతో పాత రికార్డులు, ఇతర వివరాలను పరిశీలించడంతోపాటు క్షేత్రసాయిలో పర్యటించిన వాటర్‌బోర్డు, నీటిపారుదల శాఖల అధికారులు జలాశయం ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్ నిర్ధారణపై అంచనాకు వచ్చినట్టు తెలిసింది. అక్కడి నిర్మాణాలు అధికార పార్టీకి చెందిన వారివి అయినా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి హైడ్రాను ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో.. వచ్చే వారం హిమాయత్‌సాగర్‌లో ఆక్రమణల తొలగింపు ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

తెల్లాపూర్‌లో..

హైదరాబాద్ నగర శివార్లలోని సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లోనూ మూడు చెరువులు కబ్జాకోరల్లో చిక్కుకున్నాయి. పలు నిర్మాణ సంస్థలు తప్పుడు ధ్రువీకరణలు, ఎన్‌వోసీలతో భూములు ఆక్రమించుకుని అధికారుల సహకారంతో చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో దర్జాగా నిర్మాణాలు చేపట్టాయి. కాలువలు పూడ్చి వేసి/కాలువల దిశను తమకు అనుకూలంగా మార్చుకుని.. బాక్స్ కల్వర్టులను నిర్మించుకున్నాయి. దీంతో వరద కాలువలు స్వేచ్ఛగా చెరువులోకి ప్రవహించే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో చెరువుల పరిరక్షణకు గ్రామంలోని పర్యావరణ ప్రేమికులు పలు ఉద్యమాలు చేశారు. అయినా అక్రమార్కులు, అధికారులు పట్టించుకోకపోవడంతో.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను (ఎన్జీటీ) సైతం ఆశ్రయించారు. చెరువుల పై భాగంలో ఎటువంటి నిర్మాణాలకూ అనుమతులు ఇవ్వరాదంటూ ఎన్జీటీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో బిల్డర్లు నిర్మాణాలు చేపట్టడానికి సాహసించలేదు. కానీ, కొందరు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఎన్జీటీ న్యాయమూర్తుల బృందం.. స్థానిక తహసీల్దార్, మునిసిపాలిటీ కమిషనర్, ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, లేక్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో కలిసి చెరువులను పరిశీలించింది. అక్కడ మేళ్ల చెరువు పైభాగంలో ఒక నిర్మాణ సంస్థ కట్టిన 32 అంతస్తుల భవనాన్ని చూసి.. ఒక న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. "చెరువులో ఇంత పెద్ద భవనం కంటికి కనిపించడం లేదా" అని మండిపడ్డారు. వెంటనే దాన్ని కూల్చివేయాలని ఆదేశించారు. అయినా అధికారులు స్పందించలేదు.

ఎఫ్‌టీఎల్ ఎక్కువగా ఉండటంతో..

తెల్లాపూర్‌లోని మూడు చెరువుల శిఖం కంటే ఎఫ్‌టీఎల్ పరిధి అధికంగా ఉండటం వల్లే బిల్డర్లు మునుగుడు పట్టాలను కొనుగోలు చేసి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రికార్డుల ప్రకారం.. వనం చెరువుకు 38 ఎకరాల శిఖం ఉండగా, 20 ఎకరాల ఎఫ్‌టీఎల్ ఉంది. ఇక్కడ చెరువులో ఓ రైస్ మిల్, ఒక బార్, జిమ్‌ను ఏర్పాటు చేశారు. మేళ్ల చెరువు శిఖం 27 ఎకరాలు ఉండగా, 65 ఎకరాల ఎఫ్‌టీఎల్ ఉంది. ఇక్కడ 32 అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. ఓ ప్రముఖ సిమెంట్ సంస్థ విల్లాలు, అపార్టుమెంట్లను నిర్మించింది. ప్రస్తుతం ఇక్కడి మామిడి తోటకు ఆనుకుని నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం కూడా ఎఫ్‌టీఎల్‌లో ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక, చెలికుంట చెరువు శిఖం 12 ఎకరాల్లో విస్తరించి ఉండగా.. 50 ఎకరాల ఎఫ్‌టీఎల్ ఉంది. ఇటీవల ఓ సంస్థ అందులో క్లబ్ హౌస్‌ను నిర్మించింది. గురువారం రెవెన్యూ, మునిసిపల్ అధికారులు ఎఫ్‌టీఎల్‌లోని ప్రహరీని కూల్చారుగానీ, అసలు క్లబ్ హౌస్‌ను కూల్చకపోవడంపై విమర్శలువెల్లుతుతున్నాయి. కాగా.. మేళ్ల చెరువు, చెలికుంట చెరువులను మట్టితో పూడుస్తూ చెరువు పై భాగంలో ఎత్తును పెంచుతూ హద్దులను మార్చడంలో నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధుల హస్తం ఉంది. ఒక ప్రజాప్రతినిధి దగ్గరుండి చెరువులో ప్రహరీ కోసం బేస్‌మెంట్ కట్టించారు. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ఈ అంశాన్ని వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. తాజాగా.. చెరువులను ఆక్రమించి వెలిసిన నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తున్న.. నేపథ్యంలో తెల్లాపూర్ చెరువుల కబ్జాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్న చర్చ జరుగుతోంది.

కేటీఆర్ ఫామ్‌హౌస్‌పై నివేదిక సిద్ధం

::: ఆర్డీఓకు అందించిన సర్వేయర్లు

శంకర్‌పల్లి, ఆగస్టు 30: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అధీనంలోని జన్వాడ ఫామ్‌హౌస్‌పై నివేదిక సిద్ధమైంది. సర్కారు ఆదేశాల నిమిత్తం మూడు రోజుల క్రితం బుధవారం.. ఈ ఫామ్‌హౌస్ వద్ద రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించిన సంగతి తెలిసిందే. మర్నాడు కూడా సర్వే చేస్తామని చెప్పినప్పటికీ.. బుధవారం నాటి సర్వేనే ఫైనల్ చేశారు. ఈమేరకు సర్వేయర్లు నివేదికను తయారు చేసి ఆర్డీవోకు పంపారు. ఆర్డీవో దాన్ని కలెక్టర్‌కు పంపించనున్నారు. నివేదికను పరిశీలించిన అనంతరం కలెక్టర్ తీసుకునే నిర్ణయం ఆధారంగా ఆక్రమణలపై చర్యలు తీసుకోనున్నారు. కాగా.. బుల్కాపూర్ నాలను ఆక్రమించి ఈ ఫామ్‌హౌస్ ప్రహరీ గోడ కట్టినట్లు 2020లో చేసిన సర్వేలోనే అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే. తాజాగా చేసిన సర్వేలో మరికొంత ఎక్కువగానే ఆక్రమణలను గుర్తించినట్లు సమాచారం. బుల్కాపూర్ నాలా ఈ ఫామ్‌హౌస్ ప్రాంతంలోనే కాక మరికొన్నిచోట్ల కూడా ఆక్రమణలకు గురైంది. వాటినీ తొలగించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

సహజ వనరుల రక్షణ కోసమే హైడ్రా

» జీరో కార్బన్ నగరంగా ఫ్యూచర్ సిటీ: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను రక్షించుకోలేక పోతే అది పర్యావరణ విధ్వంసానికి దారి తీస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నదులు, చెరువులు, వాగులు, అడవులు ప్రతిదీ మానవాళి మనుగడకు అవసరమేనని పేర్కొన్నారు. 'గృహ' అనే పర్యావరణ సంస్థ శుక్రవారం ఇక్కడ నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు ఈ మేరకు మాట్లాడారు. చెరువులు, నీటి నాలాలు కాపాడేందుకే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారని వివరించారు. తమ ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే ఫ్యూచర్ సిటీ అత్యాధునిక టెక్నాలజీతో కార్బన్ రహిత (జీరో కార్బన్) నగరంగా రూపొందుతుందని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించాల్సిందిగా మహేంద్రా వర్సిటీని కోరామని, 'గృహ' సంస్థ కూడా చేతులు కలిపి పర్యావరణ హిత నగరానికి దోహదపడాలని శ్రీధర్ బాబు కోరారు. ఇదంతా కొత్త ఉద్యోగాల సృష్టికి, స్థిరమైన అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. కాగా నవోదయ విద్యాసమితి సంస్థలు రూపొందించిన 'సస్టైనబుల్ ఇనిషియేటివ్స్' అనే సంకలనాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బెంగళూరు మెట్రో రైల్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధాకృష్ణారెడ్డి, గృహ సంస్థ ప్రతినిధులు సంజయ్ సేథ్, షబనా బస్సీ తదితరులు పాల్గొన్నారు.

బఫర్‌జోన్‌లో నూతన నిర్మాణాలు చేపట్టొద్దు

» ఎమ్మెల్యే పల్లాకు హైకోర్టు ఆదేశాలు

» కూల్చేముందు నోటీసులివ్వాలని హైడ్రాకు స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బఫర్‌జోన్‌లో నూతన నిర్మాణాలు కొనసాగించవద్దని, నూతన నిర్మాణాల విషయంలో అలాగే ముందుకు వెళ్తే సమస్యలు కొని తెచ్చుకున్నట్లేనని హైకోర్టు తెలిపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన గాయత్రి, అనురాగ్, నీలిమ తదితర విద్యాసంస్థలకు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కుర్రెముల నడెం చెరువు సమీపంలో 17.21 ఎకరాల్లో ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి విద్యాసంస్థలను కూల్చేముందు నోటీసులు ఇచ్చి చట్టబద్ధంగా వ్యవహరించాలని హైడ్రా, రెవెన్యూ, నీటిపారుదలశాఖలను ఆదేశించింది. కూల్చివేతలను అడ్డుకోవాలని ఆయా విద్యాసంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి. వినోద్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. గత ఆదేశాల మేరకు.. నడెం చెరువు 61 ఎకరాల్లో విస్తరించి ఉన్నట్లు నిరూపించే 1954-55ల నాటి కాస్ర పహాణీని ప్రభుత్వ న్యాయవాది ఎస్. రాహుల్‌రెడ్డి హైకోర్టుకు సమర్పించారు. పల్లా విద్యాసంస్థలు బఫర్‌జోన్‌లో నిర్మించారని పేర్కొన్నారు. బఫర్‌జోన్‌లో నూతన నిర్మాణాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. బఫర్ జోన్‌లో నూతన నిర్మాణాలు కొనసాగించవద్దని.. అనుమతులు తెచ్చుకున్నప్పటికీ వాటిని మోసపూరితమైనవిగానే భావించాల్సి వస్తుందని తెలిపింది.

మీరే పట్టాలిచ్చి.. ఇప్పుడు కూలిస్తే ఎలా? :శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లోని అంధుల కాలనీలో అర్ధరాత్రి ఇళ్లను కూల్చివేశారని, ఇళ్లు కూల్చడం అన్యాయమని పోలీసులను వేడుకున్నా కనీసం జాలి చూపలేదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే 2007లో వారికి పట్టాలిచ్చిందని, ఎంతో కష్టపడి నిర్మించుకున్న దివ్యాంగుల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం దారుణమన్నారు. అప్పుడు మీరే పట్టాలిచ్చి.. ఇప్పుడు వారి ఇళ్లను కూలిస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బడాబాబులకు సంజాయిషీ నోటీసులిస్తారని, పేదల పట్ల మాత్రం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం తగదన్నారు. వారికి పట్టాలిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. ప్రభుత్వం వారికి అక్కడే పక్కా ఇళ్లు కట్టించాలని.. న్యాయస్థానాలు సుమోటోగా స్వీకరించి దీనిపై విచారణ జరపాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.



ఏపీ మంత్రి నారాయణతో వీఐటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ డా. విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్

ఏపీ మంత్రి నారాయణతో
వీఐటీ వర్సిటీ చాన్స్‌లర్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ సమీపంలో గల 'వీఐటీ-ఏపీ' యూనివర్సిటీ చాన్స్‌లర్ డా.విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వానికి వీఐటీ యూనివర్సిటీ అన్ని రకాలుగా సహకరిస్తుందని వారు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో వీఐటీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.ఎస్వీ కోటరెడ్డి, రిజిస్ట్రార్ డా.జగదీశ్ చంద్ర ముదిగంటి కూడా ఉన్నారు.

ప్రతిపక్షంపై కక్షతో అభివృద్ధిపై సర్కార్ నిర్లక్ష్యం

» 10 వేల కోట్ల ఎస్డీఎఫ్ పనుల రద్దే నిదర్శనం: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): "ప్రతిపక్షంపై కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోంది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్డీఎఫ్) కింద గతంలో కేసీఆర్ ప్రభుత్వం 33 జిల్లాలకు మంజూరు చేసిన రూ.10వేల కోట్ల విలువ చేసే 34,511 పనులను రద్దు చేయడమే ఇందుకు నిదర్శనం" అని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రారంభమైన అనేక పనులను నిలిపేయాలని, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు కొనసాగించొద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తికావస్తున్న పనులకు సైతం బిల్లుల చెల్లింపులు నిలిపేయడంతో ఆయా శాఖలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. కేసీఆర్ హయాంలో కేటాయించిన ఎస్డీఎఫ్ నిధులను రద్దు చేసి..కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలకు రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేయడం పక్షపాతానికి నిదర్శనమన్నారు.

ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి కార్యదర్శులుగా విష్ణునాథ్, విశ్వనాథన్

న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి కార్యదర్శులుగా పీసీ విష్ణునాథ్, పి. విశ్వనాథన్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి కార్యదర్శిగా గణేష్‌కుమార్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా పాలక్ వర్మ నియమితులయ్యారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను పార్టీ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం నియమించారు. ఈమేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. పీసీ విష్ణునాథ్ ప్రస్తుతం తెలంగాణ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పనిచేస్తుండగా ఆయనకు మరోసారి అవే బాధ్యతలు అప్పగించారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జ్ కార్యదర్శి బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది.

చవితి తర్వాత జనంలోకి కేసీఆర్ ?

» రైతు సమస్యలపై పోరు.. అమెరికా పర్యటనలో కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ త్వరలో ప్రజా క్షేత్రంలోకి రానున్నారు. రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేలా వినాయక చవితి తర్వాత కేసీఆర్ నిరసన లేదా ధర్నా చేయనున్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కేసీఆర్ కొన్నాళ్లుగా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు పరిమితమైన సంగతి తెలిసిందే. ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఎమ్మెల్సీ కవిత బెయిల్ మీద విడుదల కావడంతో ప్రస్తుతం ఆయన ఉత్సాహంగా ఉన్నారని తిరిగి ప్రజల్లోకి వస్తారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. రైతులు ఎదుర్కొంటున్న సాగు నీరు, విద్యుత్ సమస్యలతోపాటు రుణమాఫీ, రైతు భరోసా వంటి అంశాలను ఆయన ప్రజల్లోకి తీసుకెళతారని వెల్లడించాయి. మరోపక్క,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తిగత పనిమీద అమెరికా వెళ్లారు. సెప్టెంబరు రెండో వారంలో తిరిగి ఆయన హైదరాబాద్ వస్తారని సమాచారం.



పెద్దమ్మ గుడిలో రాబర్ట్ వాద్రాతో సెల్ఫీ తీసుకుంటున్న ప్రజలు

నా భార్య ప్రియాంకకు ఆల్ ది బెస్ట్

» ఆమె వయనాడ్ ఎంపీగా పోటీ చేయడం సంతోషంగా ఉంది

» దేశంలో మహిళల భద్రత సమస్యగా మారింది: రాబర్ట్ వాద్రా

హైదరాబాద్, శంషాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తన భార్య ప్రియాంక గాంధీ వయనాడ్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేయనుండటం సంతోషంగా ఉందని రాబర్ట్ వాద్రా అన్నారు. ఆమెకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన హైదారాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా శంషాబాద్‌లో ఆయనకు కాంగ్రెస్ నేతలు పూల మాలలు, బొకేలతో ఘన స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సన్మానించారు. తొలిరోజు ఆయన జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టులో, ఓ హోటల్‌లో, పెద్దమ్మ ఆలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తాను తెలంగాణకు రాజకీయాల కోసం రాలేదని, అధ్యాత్మిక ప్రదేశాల సందర్శనకు, ప్రజలు చెప్పింది వినడానికి మాత్రమే వచ్చానన్నారు. దేశం సుభిక్షింగా ఉండాలనే భావనతో తాను ధార్మిక యాత్రలు చేస్తున్నానని.. ధార్మికతతోనే ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. తాను హైదరాబాద్‌లో బడే మసీదును కూడా సందర్శిస్తానని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా తాను దివ్యాంగులు, అంధులను కలిసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పును మరో ఐదేళ్ల చూస్తామని చెప్పారు. కశ్మీర్, హరియాణ, మహారాష్ట్ర ఎన్నికల్లో ఇండియా కూటమి మంచి ఫలితాలు సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుతం మహిళల భద్రత ప్రధాన సమస్యగా మారిందని, తన భార్య, కూతురు భద్రత విషయంలో అప్పుడప్పుడు ఆందోళన చెందుతుంటానని చెప్పారు. దేశంలోని మహిళలందరూ తామంతా భద్రంతా ఉన్నామని భావించే రోజులు రావాలన్నారు. మహిళలు రోడ్డు మీద ఒంటరిగా నడుస్తున్నప్పుడూ తాము సురక్షితంగా ఉన్నామనే భరోసా వారిలో కలిగించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా రక్షణకు సంబంధించి తల్లిదండ్రులు పిల్లలకు ఇంట్లోనే నేర్పించాలని కోరారు. మహిళల భద్రతకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు అంతా ఒక్కటిగా ముందుకు కదలాలన్నారు. దేశంలోని సమస్యలను తాను, రాహుల్ గాంధీ ఒకే కోణంలో చూస్తున్నామని, ఒకే విషయం గురించి మాట్లాడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్‌లో మీరు పవర్‌సెంటర్ అవుతారా? అని విలేకరులు అడగ్గా.. తాను రాజకీయాల్లోకి రావాలా అనే అంశాన్ని ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ఎమర్జెన్సీ సినిమా మీద ప్రశ్నించగా.. అదో సినిమా మాత్రమేనన్నారు. భార్య, తల్లి, చెల్లెళ్లతో పాటు మహిళలందరినీ ఎలా గౌరవించాలి అన్నదానిపై సినిమా రావాలని పేర్కొన్నారు.

వెయ్యి ఎకరాల్లో జూపార్కు

(మొదటి పేజీ తరువాయి)

జూపార్కు ఏర్పాటు నేపథ్యంలో.. ప్రస్తుతం ఉన్న జూపార్కును అక్కడికి తరలిస్తారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణ కాలుష్యం దృష్ట్యా ఈ జూపార్కును తరలించాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది.

వెయ్యి ఎకరాల్లో హెల్త్ హబ్..

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఫోర్త్ సిటీలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో హెల్త్ హబ్ నిర్మించాలని భావిస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. దీనిద్వారా హైదరాబాద్‌లో హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే సంస్థలు ఇక్కడ తమ సెంటర్లు నెలకొల్పేందుకు వీలుగా కొత్త పాలసీని రూపొందించాలని, ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను అందులో చేర్చాలని అన్నారు. ప్రపంచంలోని నలుమూలల నుంచి వైద్య సేవల కోసం వచ్చేవారికి ఈ హబ్.. వన్‌స్టాప్ సొల్యూషన్‌గా ఉండేలా ప్యాకేజీలు రూపొందించాలన్నారు. ఆన్‌లైన్‌లో అన్ని సేవల వివరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యుల అపాయింట్‌మెంట్, ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని సర్వీసులు ఆన్‌లైన్‌లోనే అందాలని పేర్కొన్నారు. పేషంట్లు నేరుగా విమానాశ్రయం నుంచి ఆస్పత్రికి వెళ్లి కావాల్సిన చికిత్సను జాప్యం లేకుండా అందుకునేలా సర్వీసులను డిజైన్ చేయాలని సూచించారు. దేశంలోనే అందరి దృష్టినీ ఆకర్షించేలా హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇక తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట ఆలయ బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బోర్డుకు స్వయం ప్రతిపత్తి, విధివిధానాలు ఉండేలా చట్ట సవరణ చేయాలన్నారు. యాదగిరిగుట్ట ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులను ప్రారంభించాలని ఆదేశించారు. గుట్టపై చేపడుతున్న అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో లేవని, ఏ పని కూడా అర్ధాంతరంగా ఆగిపోవడానికి వీల్లేదని అన్నారు. ఇప్పటివరకు జరిగిన పనులు, అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. భక్తులు విడిది చేసే కాటేజీల నిర్మాణం, ఇతర సౌకర్యాల కోసం దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు.

కీసరగుట్ట ఆలయం పునర్నిర్మాణం..

కీసరగుట్టపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ములుగు జిల్లాలోని రామప్ప ఆలయం తరహాలో పునర్నిర్మించాలని సీఎం రేవంత్ అన్నారు. పురాతన శాండ్ బాక్స్ టెక్నాలజీ జోలికి వెళ్లకుండా అధునాతన పరిజ్ఞానంతో అలాంటి ఆకృతిని తీర్చిదిద్దాలని సూచించారు. ఇక బెంగుళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్‌స్టిట్యూట్ తరహాలో వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నేచర్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. అక్కడ ఉన్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను దీనికోసం వినియోగించాలని అన్నారు. ప్రకృతి చికిత్సలో పేరు పొందిన ప్రముఖ సంస్థలను సంప్రదించి అవసరమైన కసరత్తు పూర్తి చేయాలని ఆదేశించారు. కవ్వాల్, అమ్రాబాద్ అటవీ ప్రాంతాల్లో సఫారీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కొత్త విధానాలను రూపొందించాలని సీఎం ఆదేశించారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజంల అభివృద్ధికి విడివిడిగా పాలసీలను రూపొందించాలని సూచించారు. తెలంగాణలోని ప్రాచీన ఆలయాలు, చారిత్రక స్థలాలతో పాటు అటవీ సంపద, వైద్య సదుపాయలన్నింటినీ సమాహారంగా మార్చి పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. పర్యాటకులకు ఎక్కడికక్కడ వసతి సౌకర్యం ఉండేలా చూడాలని, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని చెప్పారు. టూరిజం, దేవాదాయ, అటవీ శాఖ అధికారులు కలిసికట్టుగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కొత్తగా చేపట్టే ప్రాజెక్టులన్నింటినీ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాలని అన్నారు. ఉద్యోగ కల్పనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడేలా టూరిజం అభివృద్ధి జరగాలని పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌ను కలిసిన కామన్వెల్త్ ఎంటర్‌ప్రైజెస్, ఇన్వెస్ట్‌మెంట్ కౌన్సిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రోసీ గ్లేజ్ బ్రూక్

నామినేటెడ్ పోస్టులపై చర్చ

సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మధ్య సచివాలయంలో శుక్రవారం రాత్రి కీలక భేటీ జరిగింది. మిగిలి ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంపై ఈ భేటీలో చర్చించినట్లు తెలిసింది.

స్కిల్ యూనివర్సిటీ డిజైన్ల పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల డిజైన్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. డిజైన్లపై ఆర్కిటెక్టులకు పలు సూచనలు చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల డిజైన్లకూ పలు మార్పులను సీఎం సూచించారు. కాగా, సీఎంను శుక్రవం పలువురు ప్రముఖులు కలిశారు. లండన్‌కు చెందిన కామన్‌వెల్త్ ఎంటర్‌ప్రైజెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కౌన్సిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రోసీ గ్లేజ్‌బ్రూక్.. సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ టాప్-2024 అవార్డు గ్రహీత డాక్టర్ సమరేందు మొహంతి కూడా సీఎంతో భేటీ అయ్యారు. జానపద కళాకారుడు కుమారస్వామి రచించిన 5వేల చరణాలతో ఉన్న అతిపెద్ద జానపద గీతం పుస్తకాన్ని రేవంత్ విడుదల చేశారు. మతి భానుమూర్తి రచించిన 'జయ సేనాపతి' నవలను కూడా సీఎం ఆవిష్కరించారు.

అవి నాకు ఆపాదించిన వ్యాఖ్యలు: సీఎం రేవంత్

భారత న్యాయ వ్యవస్థ పట్ల తనకు అత్యంత గౌరవం, పూర్తి విశ్వాసం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొన్ని పత్రికల్లో గురువారం తాను అన్నట్లుగా ప్రచురితమైన వ్యాఖ్యలు తనకు ఆపాదించబడినవేనని వివరణ ఇచ్చారు. కవిత బెయిల్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల సుప్రీం ధర్మాసనం సీరియస్ అయిన నేపథ్యంలో ఎక్స్ వేదికగా శుక్రవారం ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. న్యాయ ప్రక్రియ పట్ల తనకు ప్రగాఢ విశ్వాసం ఉందన్నారు. పత్రికా నివేదికల్లో ప్రచురితమైన ఆ వ్యాఖ్యలపట్ల తాను బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. న్యాయవ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల తనకు అపారమైన గౌరవం ఉందన్నారు. భారత రాజ్యాంగం, దాని నైతికతపైన దృఢ విశ్వాసం ఉన్న తాను.. న్యాయవ్యవస్థపైన తనకు ఉన్న అత్యున్నత గౌరవాన్ని కొనసాగిస్తానన్నారు.

'బుద్ధవనం' సందర్శనకు రెండు రోజుల టూర్

ప్యాకేజీ ప్రకటించిన రాష్ట్ర పర్యాటక సంస్థ

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బౌద్ధుల ఆధ్యాత్మిక కేంద్రంగా సుప్రసిద్ధమైన నాగార్జునసాగర్ బుద్ధవనంను సందర్శించే పర్యాటకుల కోసం తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ కొత్తగా రెండు రోజుల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. ఇప్పటి వరకున్న హైదరాబాద్ నుంచి ఉదయం వెళ్లి రాత్రి వరకు వచ్చే ప్యాకేజీకి బదులుగా వారాంతపు సెలవు రోజులు, ఇతర పని దినాల్లో బుద్ధవనంను సందర్శించేందుకు ఆసక్తి ఉన్న పర్యాటకుల కోసం వేర్వేరుగా రెండు రోజుల ప్యాకేజీని రూపొందించింది. ఇందులో తొలిరోజు నాగార్జునసాగర్ జలాలపై క్రూయిజ్‌లో బయలుదేరి నీటి మధ్యన ద్వీపం కొండపై నిర్మించిన మ్యూజియంలో బుద్ధుని కాలం నాటి పురాతన బౌద్ధ మత శిల్పాలు, అరుదైన వస్తు సంపదను సందర్శించే అవకాశం కల్పిస్తారు. తిరిగి సాగర్ డ్యామ్ చేరుకుని రాత్రిపూట నల్లమల అటవీ ప్రాంత ప్రకృతి దృశ్యాలను సందర్శించడంతోపాటు రాత్రి బస చేయడానికి పర్యాటక సంస్థ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెండో రోజు నాగార్జునసాగర్ డ్యామ్ సమీపంలో సుమారు 274ఎకరాల విస్తీర్ణంలో బౌద్ధ చారిత్రక వారసత్వ విధానంలో అద్భుతంగా అభివృద్ధి చేసిన 'బుద్ధవనం ప్రాజెక్టు'ను సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. రోజంతా బుద్ధవనంలో పర్యటించి బౌద్ధ వారసత్వ ప్రాశస్త్యాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇటీవల బుద్ధవనంలో పర్యాటకులకు వసతి సౌకర్యాలను కల్పించిన పర్యాటక సంస్థ ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. హైదరాబాద్ నుంచి పర్యాటక సంస్థ నాగార్జునసాగర్ వరకు బుద్ధవనం ప్రాజెక్టు టూర్ ప్యాకేజీలో భాగంగా ప్రతి రోజూ ఏసీ బస్సును నడుపుతోంది. వివరాలకు 9666651561, 9848125720 సంప్రదించవచ్చని సంస్థ అధికారులు తెలిపారు. చార్జీల విషయానికొస్తే.. సాధారణ రోజుల్లో (సోమవారం నుంచి గురువారం వరకు) పెద్దలు ఒక్కొక్కరికి రూ.2,600, పిల్లలకు రూ.2,100, వీకెండ్ (శుక్రవారం నుంచి ఆదివారం వరకు)లో పెద్దలకు ఒక్కొక్కరికి రూ.3,400, పిల్లలకు రూ.2,700.

మీ సేవ ద్వారా మరో తొమ్మిది సేవలు

» ఎమ్మార్వో దాకా వెళ్లకుండానే పలు ధ్రువపత్రాల జారీ

ఇప్పటివరకు తహసీల్దారు కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ద్వారా అందుతున్న 9 రకాల సేవలను ఇక నుంచి మీ సేవ ద్వారా అందించేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలంటూ సీసీఎల్ఏ కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో గ్యాప్ సర్టిఫికేట్, పౌరుడి పేరు మార్పు, స్థానిక ధ్రువీకరణ పత్రం, మైనార్టీ సర్టిఫికేట్, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల జారీ, క్రిమీ లేయర్, నాన్ క్రిమీలేయర్ ధ్రువీకరణ పత్రాలు, మార్కెట్ విలువ మీద ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ రికార్డులకు సంబంధించిన నకల్లు, 1బి రిజిస్టర్‌కు సంబంధించిన నకల్లు ఇక నుంచి మీ సేవ ద్వారా అందించనున్నారు.

సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి 9 నెలలుగా అందుబాటులోనే..

» ప్రజల కోసం ఎప్పుడైనా అపాయింట్‌మెంట్

» ప్రజలపై ప్రేముంటే అపాయింట్‌మెంట్ అడుగు

» అడిగితేనే నువ్వు నిజమైనవిపక్ష నేతవు

» కేసీఆర్‌కు జగ్గారెడ్డి సూచన

» తొమ్మిదిన్నరేళ్లలో సెక్రటేరియట్‌కు రాని కేసీఆర్

» రేవంత్‌కి.. కేసీఆర్‌కి ఉన్న తేడా ఇదే!

» రుణమాఫీ కోసం రూ.31 వేలకోట్లు మంజూరు

» ఇప్పటికే రూ.18 వేల కోట్లుచెల్లించారు

» ప్రభుత్వ వ్యవస్థలను కేసీఆర్ ఖరాబు చేసిండు

» అందుకే మాఫీ ఆలస్యం.. రైతులు గమనించాలి

» రాహుల్‌ను అనే స్థాయి హరీశ్‌కు లేదు

» మళ్లీ మాట్లాడితే నా భాషా మారుద్ది: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): "తొమ్మిదిన్నరేళ్ల పాలనలో నువ్వు ఎప్పుడూ సచివాలయానికి వచ్చి కూర్చోలేదు కేసీఆర్ గారూ! మా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మాత్రం 9 నెలలుగా క్రమం తప్పకుండా సచివాలయానికి వచ్చి కూర్చుని.. అందరికీ అందుబాటులో ఉంటున్నరు. సీఎం రేవంత్‌కు, మీకు ఉన్న తేడా ఇదే! ప్రజల సమస్యల పరిష్కారానికి నువ్వు ఆయన్ను ఎప్పుడు అపాయింట్‌మెంట్ అడిగినా ఇస్తరు. నీకు నిజంగా ప్రజలపైన ప్రేముంటే ఒక్కసారి సీఎం రేవంత్ రెడ్డిని అపాయింట్‌మెంట్ అడిగి చూడు" అంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి సూచన చేశారు. గాంధీభవన్‌లో మీడియాతో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపైన సీఎం అపాయింట్‌మెంట్ అడిగితేనే కేసీఆర్ నిజమైన ప్రతిపక్ష నేత అవుతవుడన్నారు. కేసీఆర్.. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల్ని కలిసింది లేదన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో సీఎంగా ఎన్నడూ సెక్రటేరియట్‌కు రాలేదన్నారు.

రాష్ట్రంలో రివర్స్ పాలిటిక్స్

తెలంగాణలో రివర్స్ పాలిటిక్స్ నడుస్తున్నాయని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సహజంగా.. ప్రజల సమస్యలపైన చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు పెట్టాలంటూ ప్రభుత్వాన్ని ప్రతిపక్షం అడగాల్సి ఉంటుందన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డే అసెంబ్లీ సమావేశాలు పెట్టి.. సభకు రావాలంటూ ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను పిలిచే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. బయట మాట్లాడే కేసీఆర్.. అదేదో సభకు వచ్చి రుణమాఫీ గురించి మాట్లాడొచ్చు గదా అని అన్నారు. ప్రజాక్షేత్రంలోకి వస్తానంటూ మాట్లాడిన కేసీఆర్.. ఇంట్లో కూర్చుని మీడియాలో ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు. ప్రభుత్వానికి, బ్యాంకర్లకు మధ్య ఉన్న ఆన్‌లైన్ వ్యవస్థను కేసీఆర్ దెబ్బతీయడం వల్లనే రైతు రుణమాఫీ ప్రక్రియ కొంత ఆలస్యం అవుతోందని జగ్గారెడ్డి అన్నారు. తాము ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ 9 నెలల్లో చేశామన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.31 వేల కోట్లలో రూ.18 వేల కోట్ల మేరకు చెల్లింపులు పూర్తయ్యాయని, మరో రూ.12 వేల కోట్ల మేరకు నిధులూ సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో ప్రభుత్వానికి, బ్యాంకర్లకు మధ్య ఉన్న వ్యవస్థనంతా ఖరాబ్ చేశారని, అందుకే కొంత ఆలస్యం అవుతోందని చెప్పారు. "హరీశ్.. లెక్కలే రాని నువ్వు.. బీఆర్ఎస్ హయాంలో ఫైనాన్స్ మినిస్టర్ అయినవు. నీ మేనమామ కేసీఆర్ చెప్పిన పని చేయడమే నీ పని. రాహుల్‌గాంధీని కొడంగల్‌కు రమ్మనే స్థాయా నీది? సిద్దిపేటలో రైతులు లేరా.. నీతో చర్చించేందుకు మాకు నేతలు లేరా? మా రైతు నాయకులు కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డిలను సిద్దిపేటకు పంపిస్తాం. ఏం కావాలో చెప్పుకో!" అని జగ్గారెడ్డి అన్నారు. మరోసారి రాహుల్ గురించి హరీశ్ మాట్లాడితే తన భాష కూడా మారుతుందని ఆయన హెచ్చరించారు.





ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్ సావనీర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పోలీసుశాఖకు పూర్తి స్థాయిలో నిధులు

» ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు లైసెన్సులు తీసుకోవాలి: భట్టి

» ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు ప్రమాణాలు పాటించాలి: దుద్దిళ్ల

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలో భద్రత కల్పించే విషయంలో పోలీసుశాఖకు అవసరమైన పూర్తి స్థాయి నిధులను కేటాయిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.10 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించామని చెప్పారు. పోలీసు కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో శుక్రవారం హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో దాదాపు 1500 ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలున్నాయని, వాటిల్లో రిజిస్టర్ అయినవి 500 మాత్రమే అని చెప్పారు. మిగిలిన సంస్థలు కూడా నిబంధనలు పాటించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించి మంచి వేతనాలివ్వాలని సూచించారు. రాష్ట్రంలో దాదాపు 4 లక్షల మంది ప్రైవేట్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తున్నారని వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భట్టి హామీ ఇచ్చారు. అనంతరం సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రక్షణ రంగంలో పనిచేస్తున్న సైనికులు, పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది, ఇతరులను కాపాడేందుకు అన్ని వేళలా ముందుంటారన్నారు. అదనపు డీజీ మహేష్ భగవత్ మాట్లాడుతూ, పలు ప్రైవేటు సెక్యూరిటీ సంస్థల పనితీరును ప్రత్యేకంగా ప్రస్తావించి అభినందించారు. సదస్సు ముగింపు కార్యక్రమంలో ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఐటీ, ఫార్మా, నిర్మాణం, పర్యాటకం, వాణిజ్య రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోందని, స్థానిక ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు కూడా అంతర్జాతీయ ప్రమాణాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

ఒవైసీ విద్యా సంస్థలకు నోటీసులివ్వరేం?

ఒవైసీకి ఓ న్యాయం? ఇతరులకు మరో న్యాయమా?.. హైడ్రా ఓ నాటకం: బండి సంజయ్

» హైడ్రా అంటేనే పేదలు వణికిపోతున్నారు: ఈటల

» అన్ని వర్గాల ప్రజలను పార్టీ సభ్యులుగా చేర్చాలి: లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ/వనస్థలిపురం, ఆగస్టు 30(ఆంధ్ర జ్యోతి): "హైడ్రా కూల్చివేతల విషయంలో ఒవైసీకి ఒక న్యాయం? ఇతరులకు మరో న్యాయమా? సకలం చెరువును ఆక్రమించిన ఒవైసీ విద్యా సంస్థలకు ఎందుకు నోటీసులివ్వరు? మా సంస్థలపై చెయ్యేస్తే అంతు చూస్తామని ఒవైసీ బెదిరిస్తే చేతులు ముడుచుకుని కూర్చోవడానికి ప్రభుత్వానికి సిగ్గు లేదా?" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. నాగోలులోని శుభం కన్వెన్షన్ హాలులో శుక్రవారం వివిధ మోర్చాల సభ్యత్వ నమోదు కోసం వర్క్‌ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒవైసీ అరాచకాలను అణిచివేసి, హిందువులకు భరోసా కల్పించేందుకే గతంలో పాత బస్తీ నుంచి ప్రజాసంగ్రామ యాత్ర ప్రారంభించామని గుర్తు చేశారు. రుణమాఫీ సర్వే పేరుతో కాంగ్రెస్ సర్కారు మళ్లీ డ్రామాలు ప్రారంభించిందని దుయ్యబట్టారు. రుణమాఫీ ఎంత మందికి వర్తించింది? ఇంకా అర్హులెందరు? అనే వివరాలు బ్యాంకుల వద్ద ఉండగా.. మళ్లీ సర్వే ఎందుకు? అని ప్రశ్నించారు. హైడ్రా దాడులు, విగ్రహాల లొల్లి.. అంతా ఓ నాటకమని విమర్శించారు. కవిత బెయిల్‌కు, బీజేపీకి ఏం సంబంధం? ఒక పార్టీ లేదా ఒక వ్యక్తి చెబితే సుప్రీంకోర్టు బెయిల్ ఇస్తుందనడం సిగ్గు చేటని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ విలీనం మాట ముచ్చట పూర్తయ్యిందని, అమెరికాలో అప్పగింతలు జరగబోతున్నాయన్నారు. కుటుంబ, అవినీతి పాలనకు బీజేపీ వ్యతిరేకమని, కలలో కూడా ఆ పార్టీని కలుపుకొనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 10 కోట్ల మందిని బీజేపీ సభ్యులుగా మార్చడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేపట్టనున్నామని తెలిపారు. 8800002024 నంబర్ కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ప్రజలు బీజేపీ సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను పార్టీ సభ్యులుగా చేర్పించేందుకృషి చేయాలని ఎంపీ లక్ష్మణ్ కోరారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఖమ్మం, నల్లగొండతోపాటు బలహీనంగా ఉన్న జిల్లాల్లో అత్యధిక సభ్యత్వం చేపట్టాలని సూచించారు. హైడ్రా పేరు వింటేనే పేదలు వణికిపోతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. చెరువుల వద్ద ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చి.. ఇప్పుడు ఎలా కూలుస్తుందని ప్రశ్నించారు. చెరువులను కాపాడేందుకు... అక్రమ కట్టడాలు కూల్చాల్సిందేనని, కానీ.. పేదల జోలికిరావొద్దని హెచ్చరించారు.



సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

హైడ్రా వెనుక.. హైడ్రామా: డీకే అరుణ

హైడ్రా వెనుక హైడ్రామా నడుస్తోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో పేదల ఇళ్లను కూల్చివేయగా, హైదరాబాద్‌లో వందలాది మందికి నోటీసులు ఇచ్చారని తెలిపారు. హామీల అమలు విషయంలో ప్రజలు, విపక్షాల దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్ సర్కారు హైడ్రాను తెరపైకి తెచ్చిందని విమర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 31 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

మిలిటరీ స్కూళ్లలో
6, 9వ తరగతుల్లో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు

- 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: ప్రశ్న పత్రంలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: https://www.rashtriyamilitaryschools.edu.in/



బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం)- 'ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ టీ టేస్టింగ్ అండ్ మార్కెటింగ్(పీసీపీ-టీటీఎం)'ను అందిస్తోంది. టీ బోర్డ్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించే ఈ ఇంటెన్సివ్ ప్రోగ్రామ్ వ్యవధి 45 రోజులు. నవంబరు 4 నుంచి డిసెంబరు 18 వరకు ట్రెయినింగ్ సెషన్స్ ఉంటాయి. ఫ్రెషర్స్, టీ ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ సహా టీ మాన్యుఫాక్చరింగ్, టీ ప్రొడక్షన్, టీ ట్రేడింగ్/బ్లెండింగ్, టీ రిటైలింగ్ విభాగాల్లో అనుభవం ఉన్న వారికి టెక్నికల్, ఫంక్షనల్, మార్కెటింగ్ అవసరాలకు తగ్గట్టుగా టీ టేస్టింగ్ సెషన్స్ నిర్వహిస్తారు.

టీ టేస్టింగ్ అండ్ మార్కెటింగ్‌లో ప్రొఫెషనల్ సర్టిఫికెట్

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో టీ బిజినెస్ మేనేజ్‌మెంట్, మార్కెట్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నిక్‌లకు సంబంధించిన అంశాలు వివరించడంతోపాటు టీ టేస్టింగ్ స్కిల్స్ నేర్పిస్తారు. దేశ విదేశాల్లో తయారుచేసే టీ రకాలను టేస్ట్ చేసే మెథడాలజీని వివరిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా అకడమిక్, టెక్నికల్, ప్రాక్టికల్ మాడ్యూల్స్ ఉంటాయి. చివరలో అసెస్‌మెంట్ వర్క్ ఉంటుంది.

- అకడమిక్ మాడ్యూల్‌లో టీ టేస్టింగ్ ఫర్ రైట్ మార్కెటింగ్, టీ టేస్టింగ్-ప్రొడక్షన్ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ అంశాలు; టెక్నికల్ మాడ్యూల్‌లో మైక్రో ప్రొఫైలింగ్ ఆఫ్ టీ గ్రేడింగ్, లాంగ్వేజ్ ఆఫ్ టీ టేస్టింగ్, కప్ టేస్టింగ్ టెక్నిక్స్, ఎలక్ట్రానిక్ నోస్ అండ్ ఎలక్ట్రానిక్ టంగ్, ఎవల్యూషన్ అండ్ స్కోరింగ్, టేస్టింగ్ ఫర్ ప్రొక్యూర్‌మెంట్స్ అండ్ టీ బ్లెండ్స్, ప్యాలెట్ మెమరీ-టీ టేస్టింగ్/ బ్లెండింగ్ అంశాలు ఉంటాయి. ప్రాక్టికల్ మాడ్యూల్‌లో టీ టేస్టింగ్, సెన్సరీ స్కిల్స్‌కు సంబంధించిన శిక్షణతోపాటు ఫీల్డ్ స్టడీ, టీ ఎస్టేట్/ ఫ్యాక్టరీ విజిట్స్, మార్కెటింగ్ అంశాలు ఉంటాయి. అసెస్‌మెంట్‌లో ప్రాజెక్ట్ ప్రజంటేషన్, ప్రాక్టికల్ టెస్ట్‌లు, రిటెన్ టెస్ట్‌లు, కేస్ అనాలిసిస్, ఎక్స్‌పర్ట్ కమిటీ ఎవల్యూషన్ అండ్ సర్టిఫికేషన్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్ చదవడం, రాయడంలో ప్రావీణ్యం తప్పనిసరి. టీ సంబంధిత ప్రొడక్షన్, మార్కెటింగ్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. విదేశీయులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంపిక: ఇంటర్వ్యూ, టీ టేస్టింగ్‌కు సంబంధించిన సైకోమెట్రిక్ టెస్ట్, బ్లైండ్ సెన్సరీ టెస్ట్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.80,000+జీఎస్‌టీ(విదేశీయులకు 1100 యూఎస్ డాలర్లు)
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500; విదేశీయులకు 15 యూఎస్ డాలర్లు
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 18
- **చిరునామా:** ఎండీపీ యూనిట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, జ్ఞాన భారతి క్యాంపస్, బెంగళూరు-560056
- **వెబ్‌సైట్:** www.iipmb.edu.in

ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐసీటీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ముంబయి, ఐఓసీ భువనేశ్వర్, మరాఠ్వాడా జల్నా క్యాంపస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

ఐసీటీలో పీహెచ్‌డీ

స్పెషలైజేషన్‌లు: బయోప్రాసెస్ టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, ఫైబర్స్ అండ్ టెక్స్‌టైల్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫుడ్ బయోటెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, గ్రీన్ టెక్నాలజీ, పర్ఫ్యూమరీ అండ్ ఫ్లేవర్స్ టెక్నాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మకాలజీ, ఫార్మకాగ్నసీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, పాలిమర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సర్ఫేస్ కోటింగ్ టెక్నాలజీ, ప్లాస్టిక్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రోకెమికల్ ఇంజనీరింగ్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ కెమిస్ట్రీ



అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాల నుంచి కనీసం 65 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(కెమికల్ ఇంజనీరింగ్/కెమికల్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు డైరెక్ట్ పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **సెలెక్షన్ ప్రాసెస్ వెయిటేజీ:** రిటెన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం మార్కులు, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం మార్కుల వెయిటేజీ ఇస్తారు.
- **వెబ్‌సైట్:** http://ictmumbai.edu.in

జాబ్ కార్నర్

అప్రెంటిస్‌లు

యూనియన్ బ్యాంకులో

ఖాళీలు 500

ముంబయిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మానవ వనరుల శాఖ, సెంట్రల్ ఆఫీస్... దేశవ్యాప్తంగా యూబీఐ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 50, తెలంగాణలో 42 ఖాళీలున్నాయి.

ఖాళీలు: యూఆర్-248, ఎస్సీ-64, ఎస్టీ-32, ఓబీసీ-115, ఈడబ్ల్యూఎస్-41

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం

స్టయిపెండ్: నెలకు రూ.15,000

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), లోకల్ లాంగ్వేజ్ నాలెడ్జ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్) సబ్జెక్టులు: జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు - 25 మార్కులు), జనరల్ ఇంగ్లీష్(25 ప్రశ్నలు- 25 మార్కులు), క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు - 25 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్(25 ప్రశ్నలు- 25 మార్కులు).

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీలకు రూ.800. ఎస్సీ/ఎస్టీ/మహిళా అభ్యర్థులకు రూ.600. దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 17

వెబ్‌సైట్: www.unionbankofindia.co.in/

వెస్ట్ సెంట్రల్ రైల్వేలో

ఖాళీలు 3317

జబల్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- వెస్ట్ సెంట్రల్ రైల్వే...డబ్ల్యూసీఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్‌లలో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

ఆర్ఆర్‌సీ డివిజన్/యూనిట్‌లు: జేబీపీ డివిజన్, బీపీఎల్ డివిజన్, కోటా డివిజన్, సీఆర్‌డబ్ల్యూఎస్ బీపీఎల్, డబ్ల్యూఆర్ఎస్ కోటా, హెచ్‌క్యూ/జేబీపీ

అర్హత: పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: ఏసీ మెకానిక్, బుక్ బైండర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హౌస్ కీపర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, స్టెనోగ్రాఫర్, సర్వేయర్, వెల్డర్, వైర్‌మన్ తదితరాలు.

వయోపరిమితి: 2024 ఆగస్టు 5 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: పదో తరగతి, 12వ తరగతి, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.141. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.41.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 4

వెబ్‌సైట్: https://wcr.indianrailways.gov.in/

గెయిల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఖాళీలు 391

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

- నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు: (యూఆర్- 174, ఈడబ్ల్యూఎస్-29, ఓబీసీ-89, ఎస్సీ-60, ఎస్టీ-39)

1. జూనియర్ ఇంజనీర్(కెమికల్): 2 పోస్టులు
2. జూనియర్ ఇంజనీర్(మెకానికల్): 1
3. ఫోర్‌మన్(ఎలక్ట్రికల్): 1
4. ఫోర్‌మన్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 14
5. ఫోర్‌మన్(సివిల్): 6
6. జూనియర్ సూపరింటెండెంట్(అఫీషియల్ లాంగ్వేజ్): 5
7. జూనియర్ కెమిస్ట్: 8
8. జూనియర్ అకౌంటెంట్: 14
9. టెక్నికల్ అసిస్టెంట్(ల్యాబొరేటరీ): 3
10. ఆపరేటర్(కెమికల్): 74
11. టెక్నీషియన్(ఎలక్ట్రికల్): 44
12. టెక్నీషియన్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 45
13. టెక్నీషియన్(మెకానికల్): 39
14. టెక్నీషియన్(టెలికాం అండ్ టెలిమెట్రీ): 11
15. ఆపరేటర్(ఫైర్): 39
16. ఆపరేటర్(బాయిలర్): 8
17. అకౌంట్స్ అసిస్టెంట్: 13
18. బిజినెస్ అసిస్టెంట్: 65

అర్హతలు: పోస్టును అనుసరించి పదోతరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీబీఎస్, బీబీఎం, బీఈ, బీటెక్, ఎమ్మెస్సీ, ఎంకాం, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతభత్యాలు: జూనియర్ ఇంజనీర్ పోస్టులకు రూ.35,000 - రూ.1,38,000. జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ అకౌంటెంట్ పోస్టులకు రూ.29,000 - రూ.1,20,000. మిగిలిన పోస్టులకు రూ.24,500 - రూ.90,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.50. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 7

వెబ్‌సైట్: https://gailonline.com/

ఆదిలాబాద్ రిమ్స్‌లో ఫ్యాకల్టీ

ఖాళీలు 97

ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

విభాగాలు: అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్స్, పాథాలజీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, న్యూరో సర్జరీ, న్యూరాలజీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,90,000; అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,50,000; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,25,000; మిగతా పోస్టుకు పోస్టుకు రూ.52,000.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 4

వేదిక: ఆఫీస్ ఆఫ్ ద డైరెక్టర్, రిమ్స్ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్.

వెబ్‌సైట్: rimsadilabad.org/




లిటిల్స్




వంటవాడి సమయ స్ఫూర్తి

వందన గిరి రాజ్యాన్ని ప్రవీణుడు అనే రాజు పాలించే వాడు అతనికి చాలా ముక్కోపి అని పేరుండేది. అతని దగ్గర ధర్మయ్య అనే వంటవాడు ఉండేవాడు. ఆతను చేసే వంటకాలంటే మహారాజుకు చాలా ఇష్టం ఉండేది. ఒక రోజు ధర్మయ్య త్వరత్వరగా వంట పూర్తి చేసి, తన కొడుక్కి అనారోగ్యంగా ఉండటంతో మహారాజుకు వడ్డించే పనిని మరొక పనివాడికి అప్పగించి తాను ఇంటికి వెళ్లిపోయాడు. ఆ రోజు కూరల్లో కారం ఎక్కువ అయింది. మహారాజు రుచి చూడగానే కారం ఎక్కువయిందని తెలిసి, కోపంతో ఆ మర్నాడు ధర్మయ్యకి మరణ దండన విధించాలని నిర్ణయం చేశాడు. ఇది తెలిసిన ధర్మయ్య రాజు కొలువుకువచ్చి 'మహారాజా చనిపోయే ముందు ఎవరికైనా చివరి కోరిక తీరుస్తారు కదా. అలాగే నా చివరి కోరిక కూడా తీర్చండి. నాకు ఓ ధనుస్సు, బాణం కావాలి తెప్పించండి. ఆ బాణం నేను రాజుగారి మీద వేయాలి అనుకుంటున్నాను' అన్నాడు అదేమిటి? అని అడిగినరాజుతో ధర్మయ్య 'కేవలం కూరలో కారం ఎక్కువ అయినందుకే నా ప్రాణం తీశారనే అపకీర్తి మీకు వద్దు మహారాజా.. ఇపుడు ఇంత హాని మీకు తలపెట్టాను అని చెప్పి నన్ను ఉరి తీయించండి' అన్నాడు శిక్ష తప్పించుకోవడానికి వంటవాడు చూపిన సమయ స్ఫూర్తికి నవ్వుకున్న రాజు అతనికి విధించిన మరణదండన రద్దు చేసి, క్షమించి పంపేశాడు అలా ధర్మయ్య ఉపాయంతో తననుతాను కాపాడుకున్నాడు.

5 తేడాలను కనిపెట్టండి




ఏవి ఎన్ని?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 398

								9
	9				4	5		8
			9	5	2		6	
	5				6	9		
2	6			3			1	4
		4	1				5	
	3		4	8	1			
5		1	6				3	
9								

సుడోకు - 397 సమాధానం

8	2	7	9	3	5	1	4	6
6	1	4	7	2	8	3	9	5
3	9	5	4	1	6	2	8	7
5	7	8	1	6	3	9	2	4
1	6	9	5	4	2	7	3	8
4	3	2	8	9	7	6	5	1
7	4	1	2	5	9	8	6	3
2	5	6	3	8	1	4	7	9
9	8	3	6	7	4	5	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.